సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 16 సంచిక: 80

ఆదివారం 11-6-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'


'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 80

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL






## ఎన్సీపీకి కార్యనిర్వాహక అధ్యక్షులు

తన కుమార్తె, ఎంపీ సుప్రియా సూలేతోపాటు ప్రఫుల్ పటేల్‌ను ఎన్సీపీ కార్యనిర్వాహక అధ్యక్షులుగా శరద్ పవార్ ప్రకటించారు.

- వివరాలు 6లో



## గోశాలలో చంపితే పాపమని..

అప్సరను గోశాలలో చంపాలనుకున్న నిందితుడు అక్కడ రక్తం చిందిస్తే పాపం చుట్టుకుంటుందని మరో చోటుకు తీసుకెళ్లినట్లు తేలింది.

- వివరాలు 5లో

# 'నూరు' ఊరించేలా..!

## కాంగ్రెస్‌లో పెరుగుతున్న కర్ణాటక గెలుపు రుచి



- 60–70 సీట్ల లక్ష్యాన్ని 100 సీట్లకు పెంచుకున్న టీపీసీసీ
- సానుకూల వాతావరణాన్ని ఒడిసిపట్టుకోవాలనే ఆలోచన
- పార్టీ సీనియర్లంతా కలిసి బస్సుయాత్ర.. సభలు, సమావేశాలు
- బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి 20 మంది వరకు కీలక నేతలు వస్తారనే ఆశలు
- సెప్టెంబర్‌లోనే మేనిఫెస్టో ప్రకటన ద్వారా ప్రజలకు దగ్గరకావాలనే భావన
- కార్యకర్తల్లో ఉత్సాహం పెంచేందుకే లక్ష్యాల పెంపు అంటున్న రాజకీయ విశ్లేషకులు
- క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలం ఇంకా తేలాల్సి ఉందనే చర్చ

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త ఆశలు రేపుతోంది. అక్కడిలానే తెలంగాణలోనూ సానుకూల వాతావరణం ఉంటుందని భావిస్తున్న టీపీసీసీ.. అసెంబ్లీ ఎన్నికల లక్ష్యాలను మార్చుకుంటోంది. ఇప్పటివరకు తెలంగాణలో 60–70 అసెంబ్లీ నియోజకవర్గాలను చేజిక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పుడు 100 స్థానాల దాకా సాధించగలమని అంచనా వేసుకుంటోంది. బీఆర్‌ఎస్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని,

మిగతా 2వ పేజీలో ▶

## హైదరాబాద్‌లో కూర్చుంటే కుదరదు

- టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో ఠాక్రే, రేవంత్‌ల దిశానిర్దేశం
- నెలకు 4 సార్లు నియోజకవర్గాలకు వెళ్లాలి.. 2 సార్లు నివేదికలివ్వాలి
- కష్టపడి పనిచేసే వారిని కాంగ్రెస్ మోసం చేయదు.. ఇందుకు బోసురాజే ఉదాహరణ
- సోనియాకు ఆహ్వానం, భట్టికి అభినందన సహా 4 తీర్మానాలకు ఆమోదం..

- వివరాలు 2లో

## అమెజాన్ అడవిలో 40 రోజులు

అమెజాన్ అడవి..
అపాయానికి అతి పెద్ద కేరాఫ్ అడ్రస్..
అక్కడ పువ్వులు విషం చిమ్ముతాయి..
కప్పలు కాటేస్తాయి..

అలాంటి భీకరారణ్యంలో పాపం.. నలుగురు పసివాళ్లు చిక్కుకున్నారు. అందరూ 'హోప్' వదిలేసుకున్న తరుణంలో 40 రోజుల తర్వాత మృత్యుంజయులుగా తిరిగొచ్చారు.



మే 1న వీరు ప్రయాణిస్తున్న చిన్న విమానం అడవిలో కూలిపోయింది. తల్లి, పైలట్, గైడ్ చనిపోయారు. ఆపరేషన్ హోప్ పేరిట సైన్యం గాలింపు చర్యలు చేపట్టింది. 16న విమాన శకలాలను గుర్తించింది.



పిల్లలు అక్కడ లేకపోయేసరికి.. బతికే ఉన్నారని భావించి.. అణువణువూ గాలించడం మొదలుపెట్టారు.





అక్కడక్కడా పిల్లల అడుగుజాడలు కనిపించాయి. చిన్నారి పాలసీసా దొరికింది. జాగిలాలతో విస్తృతంగా గాలించారు.



40 రోజుల తర్వాత వారి జాడ కనిపెట్టారు. ఆస్పత్రికి తరలించి.. వైద్య చికిత్స అందిస్తున్నారు.



పాపం పసివాళ్లు.. ప్రపంచాన్నే అబ్బురపరిచారు

- వివరాలు 6లో



దేవరకొండ సభలో జానారెడ్డి, ఉత్తమ్‌లతో కలిసి భట్టి అభివాదం

## స్వరాష్ట్రంలో ప్రజలకు ఆత్మగౌరవమేది..?

- ప్రాజెక్టులపై చర్చకు బీఆర్‌ఎస్ నాయకులు సిద్ధమా...
- దేవరకొండలో సభలో భట్టి
- వెయ్యి కి.మీ. పూర్తి చేసుకున్న పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర

2లో

# సిట్టింగ్‌లను మారిస్తే మాకో చాన్సివ్వండి

- ఎమ్మెల్యే టికెట్ కోసం బీఆర్‌ఎస్ ఎంపీలు, ఎమ్మెల్సీలు, 'నామినేటెడ్'ల యత్నాలు
- మంత్రి సత్యవతి సహా డజను మంది ఎమ్మెల్సీల ఆరాటం
- అర డజను మంది ఎంపీల కన్ను అటువైపే
- సిట్టింగులకు కోతవేసి తమకు ఇస్తారని ఆశావహుల అంచనా
- అధినేత దృష్టిలో పడేందుకు తంటాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)లో ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న నేతల్లో ఉత్కంఠ పెరిగిపోతోంది. సర్వేలు, పనితీరు ఆధారంగానే టికెట్లు దక్కుతాయన్న పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటన నేపథ్యంలో.. సిట్టింగ్‌ల టికెట్లలో భారీ కోత ఉంటుందని, ఆ స్థానంలో తమకు అవకాశం రావొచ్చని ఆశావహులు భావిస్తున్నారు. ఈ క్రమంలో సీఎం కేసీఆర్ దృష్టిలో పడేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.



పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎంపీ సంతోష్ తదితర ముఖ్య నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ విజ్ఞప్తిని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా కోరుతున్నారు. ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నవారిలో.. మంత్రి సత్యవతి రాథోడ్ సహా

మిగతా 2వ పేజీలో ▶

## టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు రాష్ట్రం సహకరించట్లేదు

- ఆ పార్క్ ఏర్పాటు ఎంవోయూను పట్టించుకోవడం లేదు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శ
- వ్యవసాయానికి మోదీ ప్రభుత్వం వెన్నుదన్ను
- 9 ఏళ్ల పాలనా విజయాలను వివరించిన కేంద్ర మంత్రి - 13లో

## బెడ్రూం నుంచి బాత్రూం వరకు..



- రహస్య పత్రాలను గుట్టలుగా దాచిన అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్
- అభియోగాలతోపాటు ఫొటోలు కోర్టుకు సమర్పించిన ప్రాసిక్యూషన్ - 6లో

## 15 నిమిషాల ముందే గేట్లు బంద్

- బూట్లు వేసుకున్న వారికి అనుమతి లేదు
- నేడే గ్రూప్–1 ప్రిలిమ్స్
- గతేడాది పేపర్ లీక్, పరీక్షను రద్దు చేసిన నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ ప్రత్యేక కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంలో అత్యున్నత హోదాగా భావించే గ్రూప్–1 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రిలిమినరీ పరీక్షలకు సమయం ఆసన్నమైంది. మరికొద్ది గంటల్లో ఈ పరీక్ష ప్రారంభం కానుంది. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)లో ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో గత అక్టోబర్ 16న నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష రద్దయిన

మిగతా 5వ పేజీలో ▶



## కాంగ్రెస్ గూటికి జూపల్లి, కూచుకుళ్ల?

మల్లురవితో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లా బీఆర్‌ఎస్ నేతల భేటీ

ఉదయం కలిసిన మాజీ మంత్రి జూపల్లి... పొంగులేటి ప్రెస్‌మీట్‌పై చర్చ

సాయంత్రం కలిసిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల... కేడర్‌తో ఒత్తిడని వెల్లడి



- వివరాలు 2లో

## క్లుప్తంగా...

### 22న అమరుల స్మారక చిహ్నాం ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 22న తెలంగాణ అమరుల స్మారక చిహ్నాం ప్రారంభించనున్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమాలకు కొత్త సచివాలయ భవనం వేదిక కాగా, ముగింపు ఉత్సవాలకు అమరుల స్మారక చిహ్నా భవనం వేదిక కానుంది. ఆ రోజు స్మారక చిహ్నాన్ని ప్రారంభించటమే కాకుండా, దాని ముందున్న రోడ్డు మీద దశాబ్ది వేడుకలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు ఆ రోడ్డు మీద ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపేసి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రారంభోత్సవానికి పెద్దగా సమయం లేనందున, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

### నేడు కరీంనగర్‌కు జవదేకర్



సాక్షి, హైదరాబాద్: మహా జనసంపర్క్ అభియాన్‌లో భాగంగా బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ నేడు రాష్ట్రానికి రానున్నారు. నేటి నుంచి ఈ నెల 16 వరకు రాష్ట్రంలోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఆయన పర్యటిస్తారు. ఈ నెల 11, 12 తేదీల్లో కరీంనగర్ లోక్‌సభ పరిధిలో, 13, 14 తేదీల్లో నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో, 15, 16 తేదీల్లో సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో జవదేకర్ పాల్గొంటారు.

### నేడు తెలంగాణ సాహిత్య దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెలంగాణ సాహిత్య దినోత్సవం నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. సాహిత్య వైభవాన్ని చాటేలా రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సాంస్కృతిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రస్థాయిలో రవీంద్రభారతిలో నిర్వహించే కవి సమ్మేళనంలో 150 అవార్డు పొందిన కవులు పాల్గొంటారు. ఇందులో ఎంపికైన ఉత్తమ కవితలకు బహుమతులను అందచేసి కవులు, సాహితీవేత్తలను ప్రోత్సహించాలని నిర్ణయించినట్లు సాంస్కృతిక శాఖ తెలిపింది. సాహిత్య, సుపరిపాలన దినోత్సవాల ఏర్పాట్లపై శనివారం సీఎస్ శాంతికుమారి జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను, ప్రభుత్వ అధికారులను, సిబ్బందిని భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా, మండల కేంద్రాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రముఖ కవులు, సాహితీవేత్తల విగ్రహాలకు పూలమాలలు వేసి గౌరవించాలన్నారు.

### ఇదం జగత్



నాకే పాపం తెలీదు!

# స్వరాష్ట్రంలో ప్రజలకు ఆత్మగౌరవమేది..?

- సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు బీఆర్ఎస్ నాయకులు సిద్ధమా...
- నల్లగొండ జిల్లా ప్రజలకు సీఎం క్షమాపణ చెప్పాలి
- దేవరకొండలో సభలో భట్టి విక్రమార్క
- వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్ర



పాదయాత్ర వెయ్యి కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న భట్టి, రంజితా రంజన్ తదితరులు

దేవరకొండ: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజలకు ఆత్మగౌరవం లేకుండా పోయిందని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. భట్టివిక్రమార్క పాదయాత్ర శనివారం రాత్రి నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణానికి చేరుకుంది. ఆయన పాదయాత్ర వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవరకొండ పట్టణంలోని డిండి చౌరస్తా వద్ద సభ ఏర్పాటు చేశారు. భట్టి విక్రమార్కతో పాటు నాయకులు కేక్ కట్ చేశారు. ఈ సభలో భట్టి మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు బీఆర్ఎస్ మంత్రులు, ప్రజాప్రతినిధులు సిద్ధమా అని సవాల్ విసిరారు. జిల్లాకు ఒక్క చుక్క నీరు తీసుకురాని ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

**తెలంగాణలోనూ కర్ణాటక ఫలితాలే**

ఏఐసీసీ సెక్రటరీ, రాజ్యసభ సభ్యురాలు రంజితా రంజన్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర సందేశాన్ని తెలంగాణలో ఇంటింటికీ తీసుకెళ్లేందుకు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ చేపట్టినట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో కర్నాటక ఫలితాలే తెలంగాణలో వస్తాయన్నారు. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌ను రూ.500కు ఇచ్చినట్లుగానే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇక్కడ కూడా అమలు చేస్తుందని ఆమె చెప్పారు. అనంతరం మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రైతులకు న్యాయం చేయలేని ఉత్సవాలు ఎందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పి పూర్తి చేయకుండా నల్లగొండ రైతులను మోసం చేసిన ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే బాలునాయక్, సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ ఎంపి సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, పాల్వాయి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో కూర్చుంటే కుదరదు

- నెలకు నాలుగు సార్లు నియోజకవర్గాలకు వెళ్లాలి.. రెండు సార్లు నివేదికలు ఇవ్వాలి
- టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల భేటీలో ఠాక్రే, రేవంత్ దిశానిర్దేశం
- కష్టపడి పనిచేసే వారిని కాంగ్రెస్ మోసం చేయదు.. ఇందుకు బోసురాజే ఉదాహరణ
- బీఆర్ఎస్ ప్రభుత్వ అబద్ధాలను అవగాహన చేసుకుని ప్రజల్లోకి తీసుకెళ్లండి
- ఈనెల 16కల్లా మండల కమిటీలన్నీ పూర్తి కావాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఠాక్రే, చిత్రంలో రేవంత్, అంజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: పార్టీలో కీలక బాధ్యతలు తీసుకున్న నేతలు హైదరాబాద్‌లో కూర్చుంటే కుదరదని.. తమకు కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ప్రజల్లోకి వెళ్లి పనిచేయాల్సిందేనని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నేతలు తమకు కేటాయించిన అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలకు నెలకు నాలుగుసార్లు వెళ్లాలని సూచించారు. శనివారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో పార్టీ సంస్థాగత నిర్మాణం, మండల కమిటీల ఏర్పాటు తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఠాక్రే మాట్లాడుతూ.. తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అందరూ కష్టపడితే అధికారం తప్పకుండా దక్కుతుందని స్పష్టం చేశారు. తెలంగాణలో ఎన్నికల వాతావరణం వచ్చేసిందని, ఆరు నెలల పాటు రాష్ట్రంలోని ప్రజలందరినీ కలసి బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం చేయాలని సూచించారు. కేసీఆర్ రోజుకో అబద్ధం చెప్తూ ప్రచారం చేసుకుంటున్నారని.. ఆయా అంశాలపై అవగాహన పెంచుకుని, వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వారిని చైతన్యవంతం చేయాలని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో కూడా వివరించాలని ఆదేశించారు.

**ప్రతి 15 రోజులకో నివేదిక: రేవంత్**

పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలని.. ప్రతి 15 రోజులకోసారి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలను పార్టీకి అందజేయాలని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తున్నవారు ఎప్పుడూ మోసపోరని, ఇందుకు కర్ణాటకలో మంత్రి పదవి దక్కించుకున్న బోసురాజు ఉదంతమే ఉదాహరణ అని చెప్పారు. నేతల పనితీరు, సర్వేల ఆధారంగానే టికెట్లు, పదవులు వస్తాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు అంతా కలసికట్టుగా పనిచేయాలన్నారు.

**నాలుగు తీర్మానాలకు ఆమోదం**

ఈ సమావేశంలో భాగంగా నాలుగు తీర్మానాలను ఆమోదించారు. ఏఐసీసీ కార్యదర్శులుగా ఇప్పటివరకు పనిచేసిన బోసురాజు, నదీమ్ జావేద్‌లను ఆ బాధ్యతల నుంచి హైకమాండ్ రిలీవ్ చేసిన నేపథ్యంలో వారి సేవలకు అభినందనలు తెలుపుతూ తీర్మానాన్ని ఆమోదించారు. కొత్తగా కార్యదర్శులుగా నియమితులైన విష్ణునాథ్, మన్సూర్ అలీఖాన్‌లను అభినందిస్తూ.. బోయిన్‌పల్లిలో రాజీవ్‌గాంధీ నాలెడ్జ్ సెంటర్ శంకుస్థాపన కోసం సోనియాగాంధీని ఆహ్వానిస్తూ.. 1,000 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకున్న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కను అభినందిస్తూ మరో మూడు తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి బి.మహేశ్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ నేతలు జి.నిరంజన్, హర్కర వేణుగోపాల్‌రావు, సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, మానవతారాయ్, పి.విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**డీసీసీలు సహకరించడం లేదు!**

రాష్ట్రవ్యాప్తంగా మండల కమిటీల ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. పలువురు ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. మండల కమిటీల ఏర్పాటులో కొందరు డీసీసీ అధ్యక్షులు సహకరించడం లేదన్నారు. దీనిపై స్పందించిన ఠాక్రే.. హైదరాబాద్ మినహా అన్ని జిల్లాల్లో మండల కమిటీల ఏర్పాటు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మిగతా కమిటీలను ఈనెల 16లోపు పూర్తి చేయాలని.. మండల కమిటీల పదవుల్లో పోటీ ఏర్పడితే సదరు నాయకులు చేసిన సభ్యత్వ నమోదును ప్రాతిపదికగా తీసుకోవాలని ఆదేశించారు. ఇక ఈనెల 18న నిర్వహించనున్న రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కోసం నియోజకవర్గాల వారీగా ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేసి, ఎక్కువ మంది యువత పోటీలో పాల్గొనేలా చూడాలని రేవంత్‌రెడ్డి కోరారు.

# ‘నూరు’ ఊరించేలా..!

▶ మొదటి పేజీ తరువాయి

తాజా పరిణామాలతో బీజేపీ గ్రాఫ్ పడిపోతోందని.. ఈ క్రమంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా, ప్రజల్లోకి చొచ్చుకెళ్లేలా కార్యక్రమాలను రూపొందించుకుంటే ప్రయోజనం ఉంటోందని భావిస్తోంది. అయితే.. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంపై ఆ పార్టీ నేతల్లోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో కర్ణాటక ఫలితాలను చూపుతూ.. కార్యకర్తలు, నేతల్లో ఉత్సాహం పెంచుకునేందుకే వంద సీట్లు సాధించగలమని టీపీసీసీ అంచనాలు వేసుకుంటోందని పేర్కొంటున్నారు.

**చేరికలతో బలోపేతమవుతాం..!**

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో పార్టీలోకి చేరికలపై కాంగ్రెస్ దృష్టిపెట్టినట్టు తెలిసింది. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పర్యవేక్షణలో తెలంగాణ కాంగ్రెస్‌లోకి చేరికల కసరత్తు జరుగుతోందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. బీఆర్ఎస్‌లో అసంతృప్తితో ఉన్న నాయకులు, బీఆర్ఎస్ విషయంలో బీజేపీ అనుసరిస్తున్న విధానాల పట్ల గుర్రుగా ఉన్న నాయకులు కలిపి సుమారు 20 మంది వరకు పార్టీలోకి వస్తారనే ఆశ కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతోంది. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డితో పాటు పలువురు కీలక నేతలు కూడా ఈ జాబితాలో ఉన్నారని.. మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రస్తుత మండలాధ్యక్షులు, బీఆర్ఎస్‌లోని కీలక నేతలకు గట్టిపోటీ ఇచ్చే నాయకులు కాంగ్రెస్‌లోకి రానున్నారని నేతలు అంటున్నారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో పార్టీ పటిష్ట స్థితికి చేరుకుంటుందని చెప్తున్నారు. తెలంగాణ జన సమితి (టీజేఎస్) కూడా కలసి వస్తుందని, అవసరమైతే కోదండరాం తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తారని.. లేదంటే కాంగ్రెస్ ఉద్దేశానికి అనుగుణంగా ఆయన పనిచేస్తారనే చర్చ కూడా జరుగుతోంది.

**యాత్రలు.. సభలతో..**

సెప్టెంబర్ 17న పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించడం ద్వారా ఎన్నికలకు రెండున్నర నెలల ముందే ప్రజల్లోకి వెళ్లాలని.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఏఐసీసీ అగ్రనేతల పర్యటనలు, భారీ బహిరంగ సభలు నిర్వహించాలని టీపీసీసీ నిర్ణయించింది. రైతు, యూత్ డిక్లరేషన్ల తరహాలో అన్ని వర్గాలను ఆకట్టుకునేలా.. మహిళా, బీసీ, ఎస్సీ, ఎస్టీల కోసం డిక్లరేషన్లు వెలువరించి ఆకట్టుకునే వ్యూహాన్ని అమలు చేయాలని భావిస్తోంది. వీటితోపాటు రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతల మధ్య పొరపొచ్చాలు లేవని, పార్టీ కోసం అందరం ఐక్యంగా పనిచేస్తామనే సంకేతాలు ఇచ్చే ప్రతిపాదన ఒకటి తెరపైకి వచ్చింది. పార్టీలోని సీనియర్ నేతలంతా కలసి రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేస్తారని.. అందులో భాగంగానే రేవంత్‌రెడ్డి రెండో విడత పాదయాత్ర వాయిదా పడిందని, భట్టి పాదయాత్ర ముగిశాక ఈ బస్సు యాత్ర చేపట్టే అవకాశం ఉందని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి. ఒకవేళ రేవంత్ పాదయాత్ర నిర్వహించినా అది బస్సు యాత్ర తర్వాతే ఉంటుందని అంటున్నాయి.

**కర్ణాటక ‘ఫార్ములా’ అమలు**

కర్ణాటక ఎన్నికల్లో కేంద్రంతోపాటు రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న బీజేపీని మట్టికరిపించి కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది. ఈ క్రమంలో ఆ రాష్ట్రంలో అనుసరించిన వ్యూహాలను, అక్కడి నేతలను ఉపయోగించుకుని తెలంగాణలో ముందుకు వెళ్లాలని ఏఐసీసీ భావిస్తోంది. ఇందులో భాగంగానే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీతోపాటు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సేవలను తెలంగాణలో వినియోగించుకోనుంది. కర్ణాటక ఎన్నికల్లో కీలకంగా పనిచేసిన కేరళ ఎమ్మెల్యే పీసీ విష్ణునాథ్, కర్ణాటక పీసీసీ ప్రధాన కార్యదర్శి మన్సూర్ అలీఖాన్‌లను తెలంగాణకు పంపింది.





# సాహసం సేయరా డింభకా.. హోటల్‌లో రూం లభిస్తుంది!!

మీరు విన్నది నిజమే.. వీళ్లిక్కడ ఏదో రికార్డు బద్దలు కొట్టేయడానికి సాహసాలు చేయడం లేదు.. ఇదంతా చేస్తోంది హోటల్‌లో రూం కోసం.. అందులో ఉండటం కోసం..



గని ముఖద్వారం

డీప్ స్లీప్ అంటారు కదా.. ఇక్కడ నిజంగానే డీప్ స్లీప్ వస్తుందేమో.. ఎందుకంటే.. ఇది ప్రపంచంలోనే అత్యంత లోతైన ప్రదేశంలో ఉన్న హోటల్. వేల్స్‌లోని స్నోడోనియా పర్వత ప్రాంతం వద్ద ఉంది. అక్కడికి ఏకంగా 1375 అడుగుల లోతులో అవుట్ డోర్ యాక్టివిటీ కంపెనీ గో బిలో దీన్ని నిర్మించింది. నిజానికి ఇదో సున్నపురాయి గని.. 1939లో మూతపడిన గనిలో ఈ హోటల్‌ను కట్టారన్నమాట. ఇందులో కంటెయినర్ తరహాలోని నాలుగు డబుల్ బెడ్రూంలు, గని మధ్యలో నిర్మించిన ఒక స్పెషల్ బెడ్రూం ఉన్నాయి. కంటెయినర్ టైపు బెడ్రూంలో బస చేయాలంటే.. రూ. 36 వేలు.. స్పెషల్ రూం కోసం రూ. 57 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం వారానికి ఒక రోజు అంటే.. శనివారం రాత్రి మాత్రమే ఇక్కడ బస చేయడానికి వీలవుతుంది. దానికి కూడా పెద్ద తతంగం ఉంటుంది.. ఫొటోలు చూశారుగా.. ఒక విధంగా అడ్వెంచర్ క్యాంప్‌కు వెళ్తున్నట్లే.. అది శనివారం సాయంత్రం నుంచే ప్రారంభమవుతుంది.



కంటెయినర్ బెడ్రూంలు



ముందుగా స్నోడోనియా పర్వత ప్రాంతంలో 45 నిమిషాలు ట్రెక్కింగ్ చేసి.. గని ముఖద్వారానికి చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడ మనకు గని కార్మికులకు సంబంధించిన ఉపకరణాలు.. అంటే లైటు ఉండే హెల్మెట్ లాంటివి ఇస్తారు. అప్పట్లో గని కార్మికులు ఉపయోగించిన మార్గంలోనే మనమూ వెళ్లాల్సి ఉంటుంది. గని లోపల నిర్మించిన హోటల్‌కు చేరుకోవడానికి మరో గంట సమయం పడుతుంది. దారిలో సహజ సిద్ధమైన సెలయేరు పారుతూ ఉంటుంది. అంత లోతున ఉన్నా.. ఇక్కడ అన్ని సదుపాయాలు ఉన్నాయి. వైఫై కూడా.. ఇందుకోసం కిలోమీటరు మేర కేబుల్ వేసి.. నెట్ సౌకర్యం కల్పించారు. ఇక్కడ అనేక అడ్వెంచర్ యాక్టివిటీల్లో కూడా పాల్గొనవచ్చు. ఆదివారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తో టూర్ ముగుస్తుంది. తిరిగి రావడానికి.. వచ్చినప్పుడు చేసిన సాహసమే మళ్లా చేయాల్సి ఉంటుంది. ఏంటి ఆలోచిస్తున్నారు.. వెళ్లడానికి రెడీనా..

– సాక్షి సెంట్రల్ డెస్క్



స్పెషల్ రూం

# కాంగ్రెస్ గూటికి జూపల్లి, కూచుకుళ్ల?

- మల్లురవితో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లా బీఆర్ఎస్ నేతల భేటీ
- ఉదయం కలిసిన జూపల్లి.. సాయంత్రం భేటీ అయిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల



మల్లు రవితో భేటీ అయిన కూచుకుళ్ల దామోదర్

సాక్షి, హైదరాబాద్/నాగర్‌కర్నూల్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చే నేతల కార్యాచరణ క్రమంగా స్పష్టమవుతోంది. ఖమ్మం వేదికగా శుక్రవారం జరిగిన సమావేశాల అనంతరం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరే అంశంపై స్పష్టత రాగా, తాజాగా మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి శనివారం కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ మల్లురవితో భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని రవి నివాసానికి ఉదయం వచ్చిన జూపల్లి పార్టీలో చేరికతోపాటు పలు అంశాలపై మాట్లాడారు. ఆ తర్వాత సాయంత్రం సమయంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, కొంతకాలంగా బీఆర్ఎస్‌లో అసంతృప్తిగా ఉన్న వనపర్తి నియోజకవర్గానికి చెందిన పెదమందడి ఎంపీపీ మేఘారెడ్డిలు సమావేశమయ్యారు. కాగా, కూచుకుళ్ల నాగర్ కర్నూల్ నియోజకవర్గం నుంచి తన కుమారుడిని పోటీ చేయించాలన్న ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో అక్కడ ఇప్పటికే పార్టీలో కొనసాగుతున్న నాగం జనార్దనరెడ్డి విషయంలో పార్టీ ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ అంశాలపై చర్చించేందుకు కూచుకుళ్ల భేటీ కాగా, పొంగులేటితో కలిసి పార్టీలో చేరే అంశంపై మేఘారెడ్డి సమావేశమైనట్లు తెలుస్తోంది.

**రేపో ఎల్లుండో ప్రెస్‌మీట్: మల్లురవి**


బీఆర్ఎస్ నేతలతో సమావేశం అనంతరం కూచుకుళ్ల దామోదర్‌రెడ్డితో కలిసి మల్లురవి మీడియాతో మాట్లాడారు. జూపల్లితో భేటీలో రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించామని, కేసీఆర్ వ్యతిరేక శక్తుల రాజకీయ పునరేకీకరణలో భాగంగా అందరం ఒక్కతాటిపైకి రావాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. మాజీ ఎంపీ పొంగులేటి ఈనెల 12, 13, 14 తేదీల్లో ఏదో ఒకరోజు ప్రెస్‌మీట్ పెట్టే అవకాశం ఉండటంతో దాని గురించి జూపల్లితో మాట్లాడానని చెప్పారు. కూచుకుళ్ల కూడా త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటారన్నారు.

**నాగంతో మాట్లాడాక చెప్తా: కూచుకుళ్ల**

నాగం జనార్దనరెడ్డితో మాట్లాడిన తర్వాత తన నిర్ణయం చెబుతానని కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్‌లోకి రావాలని కేడర్ తనపై ఒత్తిడి చేస్తోందని, మళ్లీ కాంగ్రెస్‌లోకి వస్తే ఎలా ఉంటుందని మల్లురవిని అడగ్గా.. పార్టీలోకి రావాలని ఆయన కోరారన్నారు. తనకు బీఆర్ఎస్‌తో స్థానిక ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయన్నారు.

# చేతిపై కేసీఆర్ పచ్చబొట్టు!

## వేయించుకున్న మంత్రి సత్యవతి రాథోడ్



మంత్రి సత్యవతి రాథోడ్ చేతిపై పచ్చబొట్టుగా కేసీఆర్ పేరు

సాక్షి, మహబూబాబాద్: పచ్చబొట్టు చెరిగిపోదు.. మనిషి కట్టెల్లో కాలే వరకూ అలాగే ఉంటుంది. దీనిని ఆదివాసీలు, గిరిజనులు ఎక్కువగా తమ చేతిపై వేసుకుంటారు. తల్లిదండ్రులు, ఆరాధ్య దైవాలు, ఇష్టమైనవారి పేర్లు పచ్చబొట్టుగా వేసుకోవడం తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ. అదే తరహాలో కేసీఆర్ పేరుతో తన చేతిపై పచ్చబొట్టు వేసుకున్నారు గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్. శనివారం సంక్షేమ దినోత్సవంలో భాగంగా హైదరాబాద్ గిరిజన భవన్‌లో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో ఏర్పాటు చేసిన పచ్చబొట్టు స్టాల్‌ను మంత్రి సందర్శించారు. తన చేతిపై ముఖ్యమంత్రి కేసీఆర్ పేరును పచ్చబొట్టుగా వేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడమే కాక మంత్రిగా కూడా నియమించిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. చనిపోయేంత వరకు కేసీఆర్‌కు కృతజ్ఞురాలిగా ఉంటానని తెలియజేసేందుకు ఈ పచ్చబొట్టు వేయించుకున్నానని తెలిపారు.

# సిట్టింగ్‌లను మారిస్తే.. మాకో చాన్సివ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

డజను మందికిపైగా ఎమ్మెల్సీలు, సుమారు అరడజను మంది ఎంపీలు, మరో పది మంది దాకా ప్రభుత్వ కార్పొరేషన్ చైర్మన్లు ఉన్నారు.

**అసెంబ్లీ వైపు ఎమ్మెల్సీల చూపు**

మండలిలో సుమారు మూడో వంతు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అవకాశం దక్కితే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. వారిలో కొందరు గతంలో మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా కూడా పనిచేసినవారే కావడంతో టికెట్ దక్కించుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా ఉన్న కల్వకుంట్ల కవిత, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఎట్టి పరిస్థితుల్లోనూ ఎమ్మెల్యే బరిలో ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. కవిత నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని బాల్కొండ లేదా జగిత్యాల నుంచి పోటీకి సిద్ధమవుతున్నట్టు సమాచారం. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన కుమారుడు అమిత్‌రెడ్డిని నల్గొండ లేదా మునుగోడు నుంచి పోటీ చేయించాలని భావిస్తున్నారు. మరో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కూడా తన కుమారుడిని నాగర్‌కర్నూల్ నుంచి అరంగేట్రం చేయించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. తాజాగా కూచుకుళ్ల కాంగ్రెస్ నేతలతో భేటీ కావడంపై బీఆర్ఎస్‌లో చర్చ జరుగుతోంది. ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు (కుత్బుల్లాపూర్), కసిరెడ్డి నారాయణరెడ్డి (కల్వకుర్తి), పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి (జనగామ), మంకెన కోటిరెడ్డి (నాగార్జునసాగర్), పి.వెంకట్రామిరెడ్డి (సంగారెడ్డి), శేరి సుభాష్‌రెడ్డి (మెదక్) కూడా ఎమ్మెల్యే టికెట్ కోసం కేసీఆర్ దృష్టిలో పడే ప్రయత్నాల్లో ఉన్నారు. ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఇప్పటికే హుజూరాబాద్‌లో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేస్తున్నారు.

**కార్పొరేషన్ల చైర్మన్లు కూడా..:** తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన పలువురు విద్యార్థి, యువజన నేతలు.. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లుగా నామినేటెడ్ పదవుల్లో ఉన్నారు. వారిలో కొందరు నేతలు ఇప్పటికే తాము ఎంచుకున్న అసెంబ్లీ స్థానాలపై దృష్టి కేంద్రీకరించారు. కేటీఆర్, హరీశ్‌రావు వంటి ముఖ్య నేతల వద్ద తమ మనోగతాన్ని బయట పెడుతున్నారు. టీఎస్ఎండీసీ చైర్మన్ మన్నె క్రిషాంక్ సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఇప్పటికే ప్రచార హడావుడి చేస్తున్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నికలో పోటీచేసిన గెల్లు శ్రీనివాస్ యాదవ్ తనకు మరో అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ (జహీరాబాద్), సాయిచంద్ (అలంపూర్), పల్లె రవికుమార్ (మునుగోడు), ఈడిగ ఆంజనేయగౌడ్ (గద్వాల)తో పాటు దూదిమెట్ల బాలరాజు యాదవ్, రాజీవ్‌సాగర్, వై.సతీశ్‌రెడ్డి తదితరులు కూడా అసెంబ్లీ ఎన్నికల్లో అరంగేట్రానికి ఆసక్తి చూపుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కూడా మంత్రి కేటీఆర్‌తో ఉన్న సాన్నిహిత్యంతో ఉప్పల్ టికెట్ తనకు దక్కుతుందనే ధీమాతో ఉన్నారు.

**సిట్టింగ్‌లలో అసహనం:** ఇప్పటికే ఏదో ఒక అధికార పదవిని అనుభవిస్తున్న నేతలు ఎమ్మెల్యే టికెట్‌ను ఆశిస్తూ యత్నాలు సాగిస్తుండటంపై ఆయా నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ స్థానానికి ఎక్కడ ఎసరు వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా పార్టీలో ఎమ్మెల్యే టికెట్ల కోసం పోటీ ఉన్న నేపథ్యంలో.. కేసీఆర్ ఎలా పరిష్కరిస్తారనే దానిపై బీఆర్ఎస్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు బీఆర్ఎస్ టికెట్ దక్కదని అనుమానిస్తున్న పలువురు ఆశావహులు ఇతర పార్టీల్లోనూ తమ అవకాశాలను బేరీజు వేసుకుంటున్నట్టు రాజకీయ వర్గాలు చెప్తున్నాయి.

**రంగంలోకి ఎందరో..**

ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న మంత్రి సత్యవతి రాథోడ్ గతంలో డోర్నకల్ ఎమ్మెల్యేగా పనిచేశారు. వచ్చే ఎన్నికల్లో డోర్నకల్, మహబూబాబాద్, ములుగు నియోజకవర్గాల్లో ఏదో ఒకచోటి నుంచి బరిలోకి దిగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీకి సన్నాహాలు చేసుకుంటున్నారు. మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత కూడా గతంలో తాను ప్రాతినిధ్యం వహించిన మహబూబాబాద్ అసెంబ్లీ స్థానంలో పోటీకి ఆసక్తి చూపుతున్నారు. ఇలా మంత్రి సత్యవతి, ఎంపీ కవిత ఎమ్మెల్యే టికెట్లు ఆశిస్తుండటంతో డోర్నకల్, మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో వర్గ విభేదాలు రాజుకుంటున్నాయి. మరోవైపు గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన నాగర్‌కర్నూల్ ఎంపీ పి. రాములు (అచ్చంపేట), 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీచేసి ఓటమి పాలైన నామా నాగేశ్వర్‌రావు (ఖమ్మం), బోర్లకుంట వెంకటేశ్ (చెన్నూరు), రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర (వరంగల్ తూర్పు) కూడా అవకాశం చిక్కితే అసెంబ్లీలో అడుగు పెట్టడంపై ఆసక్తి చూపుతున్నారు. చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఏదో ఒక సెగ్మెంట్‌లో ఎమ్మెల్యేగా పోటీ చేసే యోచనలో ఉన్నట్టు బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి.

## గీత కార్మికుల కుటుంబాలకు బీమా నిధులు విడుదల

### ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**సాక్షి, హైదరాబాద్:** గీత కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కింద రూ.12.50 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. కల్లుగీత సందర్భంగా ప్రమాదవశాత్తు చెట్టుపైనుంచి పడి మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. శనివారం ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గౌడ వృత్తిదారుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి త్వరలో జరిగే భూమి పూజ కార్యక్రమంలో గీత కార్మికుల కుటుంబాలకు బీమా సాయాన్ని పంపిణీ చేస్తామన్నారు. అర్హులైన గీత కార్మికుల కుటుంబాలు వారంరోజుల్లో సమీపంలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్‌లో ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, లైసెన్సు, నామినీ వివరాలను అధికారులకు అందజేయాలని చెప్పారు. ఎక్సైజ్ శాఖ అధికారుల వద్ద వివరాలు నమోదు చేసుకోని కుటుంబాలకు 'గీత కార్మికుల బీమా'ను అందించడానికి వీలుకాదని, ఈ నేపథ్యంలో త్వరగా ఎక్సైజ్ అధికారులకు వివరాలు అందించాలని మంత్రి కోరారు.

# న్యాయనిపుణుల మధ్య సత్సంబంధాలు అవసరం

- హైదరాబాద్‌లో సెప్టెంబర్ 16, 17 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు
- దేశవిదేశాల నుంచి హాజరుకానున్న 100 మంది జడ్జీలు
- ఎస్‌సీబీఏ చైర్మన్ ఆదిశ్ సి.అగర్వాల్ వెల్లడి
- అడ్వొకేట్ జనరల్, హెచ్‌సీఏఏ చైర్మన్‌తో భేటీ



ఎస్‌సీబీఏ చైర్మన్ ఆదిశ్‌తో ఏజీ బీఎస్ ప్రసాద్, హెచ్‌సీఏఏ చైర్మన్ పల్లె నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు చెంగల్వ కల్యాణ్‌రావు, కార్యదర్శులు దేవేందర్, ప్రదీప్‌రెడ్డి, ఇతర సభ్యులు

**సాక్షి, హైదరాబాద్:** న్యాయనిపుణుల మధ్య సత్సంబంధాలు అవసరమని, దీనికి పరిధి అంటూ లేదని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) చైర్మన్ ఆదిశ్ సి.అగర్వాల్ పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భేటీలు జరిగినప్పుడే ఒకరి ఆలోచనలు మరొకరికి, ఒక దేశంలోని న్యాయవ్యవస్థ తీరు ఇతరులకు తెలుస్తుందని చెప్పారు. ఇందులో భాగంగానే సెప్టెంబర్ 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో అంతర్జాతీయ న్యాయ నిపుణుల భేటీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దీని కోసం తెలంగాణ బార్ అసోసియేషన్‌లో అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, హెచ్‌సీఏఏ చైర్మన్ పల్లె నాగేశ్వర్‌రావుతో శనివారం ఆయన భేటీ అయ్యారు. అనంతరం అగర్వాల్ మీడియాతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య సత్సంబంధాలు నెలకొల్పడానికి ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి వివిధ దేశాలకు చెందిన 50 మంది న్యాయమూర్తులతోపాటు దేశంలోని హైకోర్టుల నుంచి 50 మంది న్యాయమూర్తులు హాజరవుతారన్నారు. ఈ సమావేశాల్లో న్యాయవాదుల భద్రత చట్టంపై చర్చ జరగనుందన్నారు. ఇప్పటికే కర్ణాటక, రాజస్తాన్‌ల్లో ఈ చట్టం అమల్లోకి వచ్చిందని.. త్వరలో తెలంగాణలో కూడా ఇది వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సహకారంతోనే సమావేశాలు నడుస్తాయని, సీఎం కేసీఆర్ సహకారం అందిస్తారని ఆశిస్తున్నామని అగర్వాల్ తెలిపారు.

**న్యాయవాదుల సంక్షేమానికి సీఎం కృషి :** న్యాయవాదుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రూ.100 కోట్లు కేటాయించారని బీఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ మొత్తంతో ఇప్పటికే పలు సంక్షేమ కార్యక్రమాలు కూడా నిర్వహించామని చెప్పారు. అంతర్జాతీయ సమావేశ నిర్వహణకు పలు రాష్ట్రాలు సుముఖత వ్యక్తం చేసినా, తెలంగాణ వేదిక కావడం సంతోషకరమని పల్లె నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏఏ మాజీ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, ఉపాధ్యక్షుడు చెంగల్వ కల్యాణ్‌రావు, కార్యదర్శులు పులి దేవేందర్, కె.ప్రదీప్‌రెడ్డి, కోశాధికారి వెంగల పూర్ణశ్రీ, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ బైరెడ్డి, కార్యవర్గ సభ్యులు నాగులూరి క్రిష్ణకుమార్ గౌడ్, చైతన్య లత తదితరులు పాల్గొన్నారు.

## పీజీ ప్రవేశ పరీక్షలకు 55 వేల దరఖాస్తులు

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ, ఇతర వర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు జరిగే కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌కు 55 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు టీఎస్‌సీపీజీఈటీ-2023 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. నేటితో (11న) దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుండగా రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 18 వరకు, రూ.2,000 అపరాధ రుసుముతో 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే ప్రవేశ పరీక్షలకు 27 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.



## ఒకేరోజు 3,50,110 కేసుల పరిష్కారం

- జాతీయ లోక్ అదాలత్‌లో భారీగా పాల్గొన్న కక్షిదారులు
- రికార్డు స్థాయిలో రూ.168 కోట్ల చెల్లింపులు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు భారీ స్పందన వచ్చింది. ఒకేరోజు రికార్డు స్థాయిలో 3,50,110 కేసులను పరిష్కరించారు. వీటిలో ప్రి-లిటిగేషన్ కేసులు 25,577, వివిధ కేటగిరీల్లోని పెండింగ్ కేసులు 3,24,533 ఉన్నాయి. లబ్ధిదారులకు రూ.168 కోట్లు పరిహారం చెల్లింపులకు ఉత్తర్వులు ఇచ్చారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మార్గదర్శకాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.నవీన్‌రావు, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జస్టిస్ టి.వినోద్‌కుమార్ రాష్ట్రవ్యాప్తంగా లోక్ అదాలత్‌ను పర్యవేక్షించారు. సాయంత్రం లోక్ అదాలత్ పూర్తయిన తర్వాత కేసుల పరిష్కార వివరాలను తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు.

**ఆరు నెలల్లోనే రూ.90 లక్షల పరిహారం..**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు అల్లంరాజు రాజారావు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఉద్యోగ విధుల నిర్వహణకు బైక్‌పై వెళుతుండగా ఆయనను కారు ఢీకొంది. కారు నడిపిన వ్యక్తి అజాగ్రత్త కారణంగానే తన భర్త మృతిచెందారని పేర్కొంటూ రాజారావు భార్య మోటార్ వెహికల్ యాక్సిడెంట్ ట్రిబ్యునల్‌లో 2022, డిసెంబర్ 5న కేసు వేశారు. రూ.కోటి 30 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అప్పటి నుంచి కేసు విచారణ సాగుతోంది. శనివారం లోక్ అదాలత్‌లో బాధిత కుటుంబం, బీమా కంపెనీతో చర్చించిన న్యాయమూర్తులు రాజీ కుదిర్చారు. రూ.90 లక్షలు బాధిత కుటుంబానికి ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి రాజీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరు బాధిత కుటుంబానికి రూ.90 లక్షల చెక్కు అందజేశారు.



నాటువాడునూ, నీళ్లు పోయువాడునూ ఒక్కటే.
ప్రతివాడూ తాను చేసిన కష్టము కొలది జీతము పుచ్చుకొనును.
– క్రైస్తవ ధర్మం



## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.అష్టమి ప.3.39 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** పూర్వాభాద్ర సా.6.12 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** రా.3.17 నుండి 4.48 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.47 నుండి 5.38 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.43 నుండి 11.55 వరకు.

**సూర్యోదయం** : 5.28
**సూర్యాస్తమయం** : 6.30
**రాహుకాలం** : సా.4.30 నుంచి 6.00 వరకు
**యమగండం** : ప.12.00 నుంచి 1.30 వరకు

ఫరూఖ్ అబ్దుల్లా (మాజీ సీఎం)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

బెంగళూరులోని పద్మనాభ నగర్‌లో ఉన్న దేవెగౌడ ఇంటికి నేను వెళ్లేటప్పటికి ఆయన నా కోసం కాకుండా వేరెవరి కోసమో విప్పారిన కమల నేత్రుడై, గొప్ప ఉత్తేజంతో వేచి ఉండటం నాకు కనిపించింది!

"నమస్తే దేవ్‌జీ.." అంటూ ఎదురుగా వెళ్లి చేతులు జోడించాను.

"ఆ.. వచ్చేశారా! మీ కోసమే చూస్తున్నాను ఫరూఖ్‌జీ. రండి.. కూర్చోండి.." అన్నారు!

"మీరు నా కోసమే ఎదురు చూస్తూ ఉన్నట్లయితే మీకు నా ధన్యవాదాలు దేవ్‌జీ.." అన్నాను నవ్వుతూ.

ఆ మాటకాయన తీవ్రమైన ఒక మందహాసాన్ని నావైపు రువ్వారు. ఆ రువ్వడం.. తరచూ కశ్మీర్‌లో మాత్రమే జరుగుతుండే 'స్టోన్ పెల్టింగ్' లా అనిపించింది నాకు.

"మీ కోసం కాక మరెవరి కోసం చూస్తాను ఫరూఖ్ జీ! మోదీజీ కోసం చూస్తానా, అమిత్‌షా కోసం చూస్తానా? ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే..
'దిగాను దేవ్‌జీ' అని మీరే కదా నాకు ఫోన్ చేసి చెప్పారు.." అన్నారు దేవెగౌడ.



"నేనేమనుకున్నానంటే దేవ్‌జీ... దిగానని నేను మీకు ఫోన్ చేయడానికి ముందే... మల్లేశ్వరంలోని టెంపుల్ స్ట్రీట్ నుంచి ఒకరెవరో మిమ్మల్ని కలిసేందుకు వస్తున్నారని మోదీజీ కానీ, అమిత్‌షా కానీ మీకు ఫోన్ చేయించి ఉంటారని.." అన్నాను.

"ఒకరెవరో అని మీరంటున్నది నళిన్ కుమార్ కతీల్ గురించేనా?" అన్నారు దేవెగౌడ! నళిన్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు. టెంపుల్ స్ట్రీట్‌లో ఉంటుంది వాళ్ల పార్టీ ఆఫీస్.

90 ఏళ్ల దేవెగౌడ పద్మనాభ నగర్ నుంచి టెంపుల్ స్ట్రీట్‌కి వెళ్లడం బాగోదు కనుక 56 ఏళ్ల నళిన్ కుమార్‌నే టెంపుల్ స్ట్రీట్ నుంచి పద్మనాభ నగర్ వెళ్లమని ఢిల్లీ నుంచి నళిన్‌కు ఆదేశాలు వచ్చి ఉంటాయని నా అనుమానం.

ఆ మాటే దేవెగౌడతో అన్నాను.

పెద్దగా నవ్వారు దేవెగౌడ. ఆ వెంటనే కెరటంలా వచ్చి పడిన ఒక బలమైన ఆవలింత నుంచి తనను తాను బ్యాలెన్స్ చేసుకున్నారు.

"క్షమించాలి. మీ నిద్రవేళలకు నేను అంతరాయం కలిగిస్తున్నట్లున్నాను.." అన్నాను.

"నిద్రా!" అంటూ ఆశ్చర్యంగా నవ్వి, "నిద్రాకాలం నేను ప్రధానిగా ఉన్న ఆ పదిన్నర నెలల భాగ్యంతోనే ముగిసిపోయింది" అన్నారు.

నిద్ర భాగ్యాన్ని ఆయన నిద్రాకాలం అనడం, పదిన్నర నెలల కాలాన్ని ఆయన పదిన్నర నెలల భాగ్యం అనడం గ్రహించాను.

"ఏమైనా దేవ్‌జీ, మీరు కనీసం ఐదేళ్ల పాటైనా ప్రధానిగా ఉండాల్సింది. ఆ పదిన్నర నెలల్లోనే కశ్మీర్‌కు ఎంత చేశారు!" అన్నాను.

"ఏం చేశానో నాకు గుర్తు లేదు ఫరూఖ్‌జీ.." అన్నారు దేవెగౌడ.

"ఇంతక్రితమే ఎయిర్‌పోర్ట్‌లో మీడియా వాళ్లు నన్ను అటకాయించి, 'దేవెగౌడను ఇప్పుడెందుకు కలుస్తున్నారు?' అని అడిగినప్పుడు నేను ఇదే చెప్పాను దేవ్‌జీ. 'ఉగ్రవాదులకు భయపడి ఎవరూ కశ్మీర్‌కు రాని సమయంలో దేవెగౌడ వచ్చారు. ఉగ్రవాదులకు భయపడి ఎవరూ కశ్మీర్‌లో శంకుస్థాపనలు చేయడానికి రానప్పుడు దేవెగౌడ వచ్చారు. అందుకే ఆయనకు థ్యాంక్స్ చెబుదామని వచ్చాను..' అని వారికి చెప్పాను దేవ్‌జీ.." అన్నాను.

ఆయన నా వైపు అభావంగా చూశారు.

"పాతికేళ్ల క్రితం ప్రధానిగా దేవెగౌడ కశ్మీర్‌కు వచ్చి వెళితే, అందుకు థ్యాంక్స్ చెప్పడానికి ఇప్పుడు మీరు బెంగళూరుకు రావడం ఏంటని మీడియావాళ్లు మిమ్మల్ని ప్రశ్నించలేదా ఫరూఖ్‌జీ?" అని అడిగారు.

"ప్రశ్నించారు దేవ్‌జీ. కానీ అలా నేరుగా ప్రశ్నించలేదు. దేవెగౌడ బీజేపీతో చేతులు కలుపుతున్నారని తెలిసి, ఆయన మనసు మార్చడానికి మీరు వచ్చారా అని అడిగారు.." అన్నాను.

మళ్లీ ఒక నవ్వును రువ్వారు దేవెగౌడ.

"బీజేపీతో నేను చేతులు కలిపే సంగతి పక్కన పెట్టండి ఫరూఖ్‌జీ. అసలు ఎవరి చేతులు బీజేపీతో కలిసి లేవో ముందు అది చెప్పండి.." అన్నారు!!

# ది హోలీ మ్యానిఫెస్టో!



## జనతంత్రం

వర్ధెల్లి మురళి

**మేరే పాస్ మ్యానిఫెస్టో హై!**

ఎన్నికల కోసం చంద్రబాబు సకల శస్త్రాలు, అస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. అదనపు సైన్యాల కోసం రాయబారాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయన దగ్గర రామోజీరావు అనే ఓ మీడియా మాంత్రికుడున్నారు. అదే తరహా శిష్య పరమాణువుల్లాంటి ఇంకో ఇద్దరు ముగ్గురు మాంత్రికులున్నారు. ఇంకా చంద్రబాబు దగ్గర పవన్ కల్యాణ్ అనే సినీనటుడున్నారు. ఆ నటుడి బిల్డప్ కోసం ఓ మిలటరీ ట్రక్కు కూడా ఉన్నది. ఇటువంటి టక్కుటమారాలు చంద్రబాబు దగ్గర చాలా ఉన్నాయి. మరి జగన్‌మోహన్‌రెడ్డి దగ్గర ఏమున్నది?

'మేరే పాస్ మ్యానిఫెస్టో హై' అంటున్నారాయన. ఎన్నికలకు ముందు అన్ని పార్టీలూ మ్యానిఫెస్టోలను ప్రకటిస్తాయి కదా! ఇందులో ప్రత్యేకత ఏముంటుంది? తాజా వాగ్దానాలతో కూడిన సరికొత్త మ్యానిఫెస్టో కాదు. అధికారంలోకి రావడానికి దోహదం చేసిన పాత మ్యానిఫెస్టో గురించి ఈ చర్చ. 'ఇదిగో మేమిచ్చిన హామీలు... ఇదీ మేము అమలుచేసిన తీరుతెన్నూ' అంటూ పాత మ్యానిఫెస్టోను ప్లకార్డులా పట్టుకొని ఆ పార్టీ బృందాలు ముందుకు కదలబోతున్నాయి. ఈ పని చేయడానికి ఏ పార్టీకైనా చాలా గుండె బలం కావాలి. భారత రాజకీయాల్లో ఇంతకుముందు ఏ రాజకీయ పార్టీ ఇటువంటి సాహసానికి పూనుకున్న దాఖలాలు లేవు. చంద్రబాబుకూ, ఆయన పార్టీకీ అటువంటి ఆలోచన కూడా ఉండదు. అలవిగాని హామీలిచ్చి, గద్దెనెక్కిన తర్వాత తదుపరి ఎన్నికల సమయానికి పాత మ్యానిఫెస్టోను మార్కెట్లో కనబడకుండా చేయడం తెలుగుదేశం ప్రత్యేకత. మొన్నటి ఎన్నికల సమయానికైతే దాన్ని పార్టీ వెబ్‌సైట్ నుంచి కూడా ఆ పార్టీ మాయం చేసింది. ఆరొందల హామీలతో కూడిన బృహత్కథామంజరి సదరు ఎన్నికల ప్రణాళిక! అంత గ్రంథాన్ని కూడా గుటకాయస్వాహా అన్నారు. తాను చేసిన వాగ్దానాలను గుర్తుచేసుకోవడం అంటే చంద్రబాబుకు తగని భయం. పాత మ్యానిఫెస్టో ఫోబియా ఉందాయనకు! కొత్తగా ఎన్నికల ముందు తయారుచేసే మ్యానిఫెస్టోల్లో ఇసుమంత కూడా సృజనశీలత లేకపోవడం తెలుగుదేశం ప్రత్యేకత. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన అనంతరం తెలుగుదేశం పార్టీ తయారుచేసిన ఎన్నికల ప్రణాళికలన్నీ కాపీ, పేస్ట్ వంటకాలే. రాబోయే ఎన్నికల కోసం పార్టీ మ్యానిఫెస్టో నుంచి చిన్న టీజర్ అంటూ మొన్నటి మహానాడులో ప్రదర్శించిన పాచి పదార్థం హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువును రాష్ట్రమంతటా వెదజల్లింది.

జగన్ ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలను సైతం నిస్సిగ్గుగా పేర్లు మార్చి ప్రకటించుకున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలిచింది కనుక వారి మ్యానిఫెస్టో నుంచి ఓ రెండు స్కీములు తీసుకున్నారు. ఒకవేళ బీజేపీ గెలిచి వుంటే ఈ స్కీములను కచ్చితంగా తీసుకునేవారు కాదు. అప్పుడు బీజేపీ మ్యానిఫెస్టోనే కాపీ కొట్టేవారు. సినిమా ప్రపంచాన్ని కొంతకాలంపాటు ఫార్ములా జాడ్యం వెంటాడిన విషయం మనకు తెలిసిందే. ఏదైనా ఒక సినిమా హిట్ అయితే, అందులో ఎన్ని పాటలున్నాయి, ఎన్ని ఫైట్లున్నాయి, ఎన్ని మిల్లీమీటర్ల సెంటిమెంట్, ఎన్ని సెంటీమీటర్ల కామెడీ ట్రాక్ ఉన్నాయో లెక్కలేసుకుని సినిమాలు తీసేవాళ్లు. కానీ ఆత్మ లాంటి కథ సంగతి మాత్రం పట్టించుకునేవారు కాదు. చంద్రబాబు కూడా ఈ తరహా సక్సెస్ ఫార్ములా మ్యానిఫెస్టోల రూపకల్పనకు అలవాటుపడ్డారు. కనుక ఈ మ్యానిఫెస్టోలకు ప్రజా జీవితంతో సంబంధం ఉండదు. ప్రజల అవసరాలేమిటో, వారి ఆకాంక్షలేమిటో, వాటినెలా నెరవేర్చాలో అనే ఆలోచనా, వివేచన ఈ మ్యానిఫెస్టోల్లో ఉండదు. తమకు అధికారం కావాలి, అందుకోసం ఎన్ని వాగ్దానాలైనా చేయాలి. ఎంత పెద్ద పుస్తకమైనా అచ్చేయాలి. మళ్లీ వచ్చే ఎన్నికల నాటికి దాచేయాలి. ఇదీ చంద్రబాబు 'సైకిల్'.

మానవ సంబంధాల్లోంచి ఏరుకొని మట్టి పరిమళాలద్దిన అక్షరాలతో జగన్‌మోహన్‌రెడ్డి తన ఎన్నికల మ్యానిఫెస్టోను రాసుకున్నారు. ఈ సందర్భంగా దేవరకొండ బాలగంగాధర తిలక్ 'అమృతం కురిసిన రాత్రి'ని గుర్తు చేసుకోవచ్చు. 'నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయా పారావతాలు, నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు, నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' అంటాడు తిలక్. ప్రజల కోసం తన అక్షరాలను అంకితం చేసిన తీరిది. జగన్‌మోహన్‌రెడ్డి తయారుచేసుకున్న మ్యానిఫెస్టో కూడా అంతే! తన సుదీర్ఘ పాదయాత్ర, ఓదార్పు యాత్రల్లో ఆలకించిన జనకోటి గుండెచప్పుళ్ళ సందేశం మ్యానిఫెస్టోలోని అక్షరాల్లో నిక్షిప్తమై ఉన్నది. ఆ అక్షరాలకు అందుకే జవాబుదారీతనం ఉన్నది. ఆ బాధ్యతతోనే పాత మ్యానిఫెస్టోను జనం ముందుకు వైఎస్సార్‌సీపీ తీసుకొస్తున్నది. 'ఇదిగో ఇచ్చిన హామీలు 99 శాతం నెరవేర్చాము. మాకు ఎన్నికల పరీక్షలో 99 శాతం మార్కులు వేయండ'ని పార్టీ శ్రేణులు అడుగుతున్నాయి.

> కొత్తగా ఎన్నికల ముందు తయారుచేసే మ్యానిఫెస్టోల్లో ఇసుమంత కూడా సృజనశీలత లేకపోవడం తెలుగుదేశం ప్రత్యేకత. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన అనంతరం తెలుగుదేశం పార్టీ తయారుచేసిన ఎన్నికల ప్రణాళికలన్నీ కాపీ, పేస్ట్ వంటకాలే. రాబోయే ఎన్నికల కోసం పార్టీ మ్యానిఫెస్టో నుంచి చిన్న టీజర్ అంటూ మొన్నటి మహానాడులో ప్రదర్శించిన పాచి పదార్థం హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువును రాష్ట్రమంతటా వెదజల్లింది.
>
> జగన్ ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలను సైతం నిస్సిగ్గుగా పేర్లు మార్చి ప్రకటించుకున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలిచింది కనుక వారి మ్యానిఫెస్టో నుంచి ఓ రెండు స్కీములు తీసుకున్నారు. ఒకవేళ బీజేపీ గెలిచి వుంటే ఈ స్కీములను కచ్చితంగా తీసుకునేవారు కాదు. అప్పుడు బీజేపీ మ్యానిఫెస్టోనే కాపీ కొట్టేవారు. సినిమా ప్రపంచాన్ని కొంతకాలంపాటు ఫార్ములా జాడ్యం వెంటాడిన విషయం మనకు తెలిసిందే. ఏదైనా ఒక సినిమా హిట్ అయితే, అందులో ఎన్ని పాటలున్నాయి, ఎన్ని ఫైట్లున్నాయి, ఎన్ని మిల్లీమీటర్ల సెంటిమెంట్, ఎన్ని సెంటీమీటర్ల కామెడీ ట్రాక్ ఉన్నాయో లెక్కలేసుకుని సినిమాలు తీసేవాళ్లు. కానీ ఆత్మ లాంటి కథ సంగతి మాత్రం పట్టించుకునేవారు కాదు. చంద్రబాబు కూడా ఈ తరహా సక్సెస్ ఫార్ములా మ్యానిఫెస్టోల రూపకల్పనకు అలవాటు పడ్డారు. కనుక ఈ మ్యానిఫెస్టోలకు ప్రజా జీవితంతో సంబంధం ఉండదు.

మద్యనిషేధం, ఓపీఎస్ అనే రెండు విషయాల్లో చేయగలిగిన మేరకు చేసినప్పటికీ, చెప్పినంతగా చేయనందున రెండు అరమార్కులు తగ్గించి, 99 శాతం వేయండని పార్టీ శ్రేణులు అడుగుతున్నాయి. ఆ పార్టీ వాళ్ళు చెప్పినట్టుగా కాకుండా అక్కడక్కడా ఒకటో రెండో హామీలు ఇంకా మిగిలిపోయే ఉండవచ్చు. చేను కోసిన తర్వాత పరిగె మిగలడం సహజం. తమ ఇళ్ల స్థలాల హామీ అలాగే ఉండిపోయిందని జర్నలిస్టు సోదరులు గొణుగుతూనే ఉన్నారు. ఇటువంటి పరిగె ఇంకెక్కడైనా మిగిలిందేమో లోతుగా పరిశీలించే శక్తి ప్రజలకు ఉంటుంది. కనుక ఆ పార్టీ వారు అడుగుతున్నట్టు 99 శాతం కాకపోయినా 95 శాతమో, 90 శాతమో మార్కులు వేసేందుకు జనం సిద్ధంగా ఉన్నారని క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. 86 శాతం మార్కులతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం బాధ్యతాయుతంగా పనిచేసి జనం నమ్మకాన్ని నిలబెట్టున్నందువలన ఆ మాత్రం ఇంక్రిమెంటు సహజంగానే ఉండవచ్చు. గత ఎన్నికల్లో టీడీపీ వారు పాత మ్యానిఫెస్టోను దాచిపెట్టినప్పటికీ జనం గుర్తుపెట్టుకుని 13 శాతం (23 సీట్లు) మార్కులే వేశారు. ఈసారి అమల్లో ఉన్న మ్యానిఫెస్టోను కాపీ కొడుతూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయినందు వలన ఇక భవిష్యత్తులో ఎన్నికల పరీక్ష రాయకుండా డీబార్ శిక్ష పడినా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు.

అమలుచేసిన మ్యానిఫెస్టోను జనం ముందు పెట్టి తీర్పు చెప్పవలసిందిగా జనాన్ని అభ్యర్థిస్తూ దేశ రాజకీయాల్లో జగన్ మోహన్‌రెడ్డి ఒక కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టబోతున్నారు. ఈసారి వైసీపీ ఎన్నికల విజయం తర్వాత మిగిలిన పార్టీల మీద ఆయా రాష్ట్రాల ప్రజలు మ్యానిఫెస్టో అమలుపై వివరణ కోరవచ్చు. ఇక ముందు ఏ పార్టీ కూడా ఈ జవాబుదారీతనాన్ని తప్పించుకోలేని పరిస్థితి ఏర్పడవచ్చు. దాదాపు యాభయ్యేళ్ల కింద విడుదలైన సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్ సినిమా 'దీవార్' చాలామంది చూసి ఉంటారు. ఆ సినిమా మర ఫిరంగిలా పేల్చిన డైలాగ్ 'మేరే పాస్ మా హై'! ఇప్పటికీ ఆ డైలాగ్ జనంలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నది. ఇకముందు రాజకీయ పార్టీలు పాత మ్యానిఫెస్టోలను దాచిపెట్టకుండా 'మేరే పాస్ మ్యానిఫెస్టో హై' అని ధైర్యంగా జనం తీర్పు కోరే పరిస్థితులు ఏర్పడితే స్వాగతించవలసిందే.

మ్యానిఫెస్టోను పవిత్ర గ్రంథంగా ప్రకటించి ఒక కొత్త ట్రెండ్‌కు జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకోసం శ్రీకారం చుడుతున్నారు? చేసిన హామీలను అమలుచేసి జవాబుదారీతనానికి టార్చ్ బేరర్‌గా నిలవాలని ఆయన ఎందుకు భావిస్తున్నారు?

> జగన్ ముఖ్యమంత్రి కాకముందు నుంచీ చేస్తున్న రాజకీయ ప్రసంగాల్లో ఒక తాత్విక భూమిక మనకు కనిపిస్తుంది. ఈ చెడిపోయిన రాజకీయ వ్యవస్థలో మార్పు తీసుకురావడం అత్యవసరమని తన ప్రతి ప్రసంగంలో చెప్పేవారు. ఉన్నత లక్ష్యాలతో ఏర్పడిన రాజ్యాంగం ఆధారంగా మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటైంది. దేశంలోని సకల జనులకూ సామాజిక – ఆర్థిక న్యాయం జరగాలనీ, భావప్రకటనా స్వేచ్ఛ అందరికీ సమానంగా ఉండాలనీ, సమాన హోదా అందరికీ సిద్ధించాలనీ, సౌభ్రాతృత్వంతో అందరూ సమస్కంధులుగా నిలబడగలగాలనీ పేర్కొన్న రాజ్యాంగ మౌలిక లక్ష్యాలు మాత్రం నెరవేరలేదు. పైపెచ్చు అసమానతలు పెరిగిపోయాయి. ఇందుకు కారణం రాజకీయ వ్యవస్థ మీద పెత్తందారీ వర్గాలకున్న పట్టు. అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం లభించడం, సమాన అవకాశాలు లభించడం వల్ల ఈ వర్గాల ప్రయోజనాలు దెబ్బతింటాయి. అందువల్ల పేదలను మరింత పేదలుగా మార్చే విధానాలు మన దేశంలో అమలవుతున్నాయి. ఈ విధానాల్లో పూర్తిస్థాయి మార్పులను విజయవంతంగా తీసుకురాగలగాలి. అదే 'ఆర్ట్ ఆఫ్ పాలిటిక్స్' అవుతుంది.

ఆయన ముఖ్యమంత్రి కాకముందు నుంచీ చేస్తున్న రాజకీయ ప్రసంగాల్లో ఒక తాత్విక భూమిక మనకు కనిపిస్తుంది. ఈ చెడిపోయిన రాజకీయ వ్యవస్థలో మార్పు తీసుకురావడం అత్యవసరమని తన ప్రతి ప్రసంగంలో చెప్పేవారు. ఉన్నత లక్ష్యాలతో ఏర్పడిన రాజ్యాంగం ఆధారంగా మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటైంది. దేశంలోని సకల జనులకూ సామాజిక – ఆర్థిక న్యాయం జరగాలనీ, భావప్రకటనా స్వేచ్ఛ అందరికీ సమానంగా ఉండాలనీ, సమాన హోదా అందరికీ సిద్ధించాలనీ, సౌభ్రాతృత్వంతో అందరూ సమస్కంధులుగా నిలబడగలగాలనీ పేర్కొన్న రాజ్యాంగ మౌలిక లక్ష్యాలు మాత్రం నెరవేరలేదు. పైపెచ్చు అసమానతలు పెరిగిపోయాయి. ఇందుకు కారణం రాజకీయ వ్యవస్థ మీద పెత్తందారీ వర్గాలకున్న పట్టు. అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం లభించడం, సమాన అవకాశాలు లభించడం వల్ల ఈ వర్గాల ప్రయోజనాలు దెబ్బతింటాయి. అందువల్ల పేదలను మరింత పేదలుగా మార్చే విధానాలు మన దేశంలో అమలవుతున్నాయి.

ఈ విధానాల్లో పూర్తిస్థాయి మార్పులను విజయవంతంగా తీసుకురాగలగాలి. అదే 'ఆర్ట్ ఆఫ్ పాలిటిక్స్' అవుతుంది. ప్రస్తుతం మనం పెత్తందారీ వర్గ ప్రయోజనాల పరిధిలోనే జరిగే ఫిరాయింపులనూ, అధికారం నిలబెట్టుకోవడాన్నీ, మ్యానిపులేషన్ననూ ఆర్ట్ ఆఫ్ పాలిటిక్స్‌గా భ్రమిస్తున్నాం. అసలైన ఆర్ట్ ఆఫ్ పాలిటిక్స్ వ్యవస్థాగతమైన ప్రక్షాళనలోనే ఉన్నది. అయితే అదంత సులభసాధ్యం కాదు. పెత్తందారీ వర్గాల తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవలసి వస్తుంది. అవసరమైతే భారీ మూల్యాన్ని చెల్లించుకోవలసి రావచ్చు. అందుకు సిద్ధపడే మనోధైర్యం కావాలి. ప్రక్షాళన జరగాలంటే పరిపాలనలో పారదర్శకత పెరగాలి. అందుకు రాచమార్గం పాలనా వికేంద్రీకరణ. పేదలందరికీ ఉచితంగా నాణ్యమైన ఇంగ్లిషు విద్య, మెరుగైన వైద్యం లభించాలి. కుల, మత, లింగ వివక్ష లేకుండా అందరికీ అవకాశాలు సమానంగా ఉండాలి. ధనికుల పిల్లలతో పోటీపడగల నైపుణ్య శిక్షణ పేద పిల్లలకు అందజేయగలగాలి. చిన్న రైతులకు కూడా వ్యవసాయాన్ని లాభసాటి చేయగల విధానాలను అనుసరించాలి. మహిళను సాధికారశక్తిగా మలచాలి. చిన్నతరహా పరిశ్రమలకు ఊతమిచ్చి మధ్యతరగతి పేదవర్గాల నుంచి నయా సంపన్నశ్రేణిని సృష్టించాలి. రాష్ట్ర సహజ బలాలను (వ్యవసాయం, సముద్ర తీరం) గుర్తించి పూర్తిస్థాయిలో వినియోగించుకోగలగాలి. కేవలం నాలుగేళ్ల వ్యవధిలోనే ఈ మార్గాలన్నింటిలో అడుగులు వేయడమే కాదు, పరుగులు తీయవచ్చని జగన్ సర్కార్ నిరూపించింది. ఈ పరుగులకు కరదీపికగా దారి చూపింది మాత్రం కచ్చితంగా 'నవరత్న' ఖచితమైన మ్యానిఫెస్టోనే! ఇటువంటి మ్యానిఫెస్టోను అమలు చేయడం పెత్తందార్ల ప్రయోజనాలకు వ్యతిరేకం కనుక వాళ్లు కత్తి కట్టడంలో ఆశ్చర్యం లేదు. ఈ పెత్తందారీ కుట్రలపై పేదల్ని జాగృతం చేయడంలో కూడా జగన్ సర్కార్ విజయం సాధించినట్టే కనిపిస్తున్నది.

vardhelli1959@gmail.com

# నక్షత్రాకాశం మాయం కానున్నదా?



విశ్లేషణ

కె.బి. గోపాలం

చిన్నతనంలోనూ, కొన్నేళ్ల క్రితం కూడా పల్లెకు వెళ్లి ఆరుబయట పడుకుంటే ఆకాశంలో నక్షత్రాలు ధాన్యం ఆరబోసినట్టు చిక్కగా కనిపించేవి. పట్నం చేరిన తరువాత నక్షత్రాలు కనిపించడం కరువైపోయింది. ఇందుకు కారణం 'కాంతి కాలుష్యం' అని సులభంగానే చెప్పవచ్చు. మనుషులు ఏర్పాటు చేసుకున్న వెలుగులు ఆకాశంలోకి కూడా వెదజల్లబడి అక్కడ చుక్కలను మనకు కనిపించకుండా చేస్తున్నాయి.

నక్షత్రాలనూ, అంతరిక్షంలోని ఇతర అంశాలనూ పరిశీలించే ఖగోళ శాస్త్రజ్ఞులకు ఇదంతా పెద్ద సమస్యగా చాలా కాలంగానే తెలుసు. కనుక అంతరిక్షంలో నుంచి ఈ కాంతి కాలుష్యాన్ని కొలతలు వేసి చూశారు. అయితే అంతరిక్షంలోని ఉపగ్రహాలు కాంతిని మనిషి కళ్ళు చూసినట్టు చూడలేవు. కనుక వాటికి కనిపించే అంశాలు మనకు కనిపించే అంశాల కంటే వేరుగా ఉంటాయి. మనిషి సృష్టించిన వెలుగులు ఆకాశంలో ఎటువంటి ప్రభావాలను చూపిస్తున్నాయి అన్న ప్రశ్న గురించి పరిశోధనలు మొదలయ్యాయి.



జర్మనీ దేశంలో క్రిస్టఫర్ కైబా అనే పరిశోధకుని నాయకత్వంలో ఒక జట్టు ఈ అంశం గురించి బాగా పరిశీలిస్తున్నది. నక్షత్ర పటాలను వారు తయారు చేస్తున్నారు. ఒక పట్టణంలో బాగా వెలుతురుంటే పెద్ద నక్షత్రాలు మాత్రమే కనిపిస్తాయి. అటువంటి ప్రదేశాలతో ఒక పటం తయారు చేస్తారు. ఆ తరువాత అంతగా వెలుగులేని నక్షత్రాలు కూడా కనిపించే పటం ఒకటి ఉంటుంది. వాటిని మామూలుగా మనిషి కళ్ళు కూడా చూడగలుగుతాయి.

2011వ సంవత్సరంలో మొదలయ్యి మొన్న మొన్నటి దాకా సాగిన ఈ ప్రయత్నంలో ప్రపంచమంతటా కనీసం 50,000 మంది పౌర పరిశోధకులు పాల్గొన్నారు. ఎక్కడికక్కడ ఆకాశంలో వెలుగులను, నక్షత్రాలను వాళ్లంతా లెక్కలు వేశారు. ప్రాంతానికీ ప్రాంతానికీ మధ్య తేడాలు ఉండడం పెద్ద ఆశ్చర్యం ఏమీ కాదు. యూరోప్ ఖండంలో కాంతి కాలుష్యం ఏటేటా ఆరున్నర శాతం పెరుగుతున్నదని వాళ్లంతా లెక్క తేల్చారు. అటు ఉత్తర అమెరికాలో ఈ కాలుష్యం 10 శాతం కంటే ఎక్కువగా ఉంది. అవును మరి, అక్కడ వెలుగులు కూడా చాలా ఎక్కువ కదా! మొత్తానికి మొత్తం ప్రపంచంలో సగటున ఏటేటా తొమ్మిది శాతం వరకు కాంతి కాలుష్యం పెరుగుతున్నట్టు కనుగొన్నారు.

మామూలుగా ఆలోచిస్తే ఇదేమంత గొప్ప విషయం కాదు అనిపించవచ్చు. కానీ దాని ప్రభావం మాత్రం అంచెలంచెలుగా పెరిగిపోతుంది. ఏటా పది శాతం కాంతి కాలుష్యం అంటే ప్రతి ఏడు ఎనిమిది సంవత్సరాలకు నక్షత్రాలు కనిపించడం సగానికి సగం తగ్గుతుంది అని అర్థమట. అసలు కొంతకాలం పోతే ఆకాశంలో నక్షత్రాలు కనిపించనే కనిపించవేమో అంటున్నారు పరిశోధకులు. టెక్నాలజీలో వస్తున్న మార్పుల కారణంగా ఈ కాలుష్యం బాగా పెరుగుతున్నది అని పరిశోధకులు తేల్చారు.

నివాసాల దగ్గర ఉండే వెలుగు ప్రభావం అక్కడ ఉండే మనుషుల మీద చాలా ఉంటుంది. అక్కడి జంతువులు, మొక్కల మీద కూడా ఈ వెలుగు ప్రభావం బాగా ఉంటుంది. వెలుగు వల్ల గజిబిజిపడ్డ పక్షులు తమ వలస మార్గాలను సరిగ్గా అనుసరించలేకపోతాయి. చివరకు మిణుగురు పురుగులు కూడా ఈ వెలుగుకు తికమక పడతాయి. మనుషులకు కలిగే ఆరోగ్య ప్రభావాలలో నిద్రలేమి అన్నిటికంటే ముఖ్యంగా ఉంటుంది. కాంతి కాలుష్యాన్ని ఎవరికి వారు తగ్గించడానికి కొన్ని సూచనలు చేస్తున్నారు నిపుణులు.


'అంతర్జాతీయ చీకటి ఆకాశం సంఘం' అనేది ఒకటి తయారై ఉందని, అది తీవ్రంగా పనిచేస్తున్నదని మామూలు మనుషులకు తెలియకపోవచ్చు. వెలుగులను మరింత తెలివిగా వాడుకోవాలని వారు ఎక్కడికక్కడ ప్రచారం చేస్తున్నారు. వీధి దీపాల కాంతి పైకి పోకూడదు, కిందకు మాత్రమే రావాలి అని వారు సలహా ఇస్తున్నారు. విద్యుత్తును ఆదా చేయగల బల్బులను వాడాలని కూడా చెబుతున్నారు.

వెలుగు కాలుష్యం గురించి అందరికీ తెలియజేయడం చాలా అవసరం. ఇంటి బయట రాత్రంతా అనవసరంగా వెలుగుతున్న బల్బులను స్విచ్ ఆఫ్ చేయడం మంచిది. ఇటువంటి ఏర్పాట్లను ఎక్కడికక్కడ స్థానికంగా చర్చించి, అక్కడి పరిస్థితులకు అనుకూలంగా ఏర్పాటు చేసుకోవాలి. దాని అర్థం అందరూ చీకటిలో బతకండి అని మాత్రం కానే కాదు.

కాంతి కాలుష్యం వల్ల కలిగే ప్రభావాలను తక్కువగా అంచనా వేయడానికి లేదు. ప్రకృతి అందం పాడవకుండా ఈ వెలుగులను వాడాలి. రాత్రిపూట ఆకాశం అన్నిటికన్నా అందమైన దృశ్యం. దాన్ని చేతనైనంతవరకు కాపాడుకోవాలి. చుక్కలు అంటే ఉల్కలు రాలిపడడం, చంద్రగ్రహణం వంటి వాటిని అందమైన దృశ్యాలుగా గుర్తించి పరిశీలించాలి. రాత్రిపూట ప్రకృతిని పరిశీలించే అదృష్టం గలవారు ఆ అందం గురించి ఎంతైనా చెప్పగలుగుతారు. రాత్రి ఆకాశం నిజంగా అందమైనది. ముందు తరాలకు అందమైన నక్షత్రాకాశాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.

వ్యాసకర్త సైన్స్ అంశాల రచయిత । మొబైల్: 9849062055

# తెలుగు టాకీకి ఆదిగురువు




సందర్భం

హెచ్. రమేష్ బాబు

తెలుగు సినిమా చలన గతిని మార్చిన తొలి తరం మహనీయులలో ముందుగా రఘుపతి వెంకయ్య– ప్రకాష్‌లను చెప్పుకుంటే, ఆ తర్వాత ప్రస్తావించుకోదగిన వారు హెచ్ఎమ్ రెడ్డి. మాట్లాడే తెలుగు సినిమాకు తొలుత ప్రాణం పోసిన వారాయన. ఈనాడు తెలుగు సినిమా ప్యాన్ ఇండియా స్థాయికి ఎదగడానికి 90 ఏళ్ల క్రితం ఆయన వేసిన బీజాలే మూలం.

1892 జూన్ 12న బెంగళూరులో పుట్టిన ఆయన పూర్తి పేరు హనుమప్ప మునియప్ప రెడ్డి. 1927లో బొంబాయికి మకాం మార్చారు. బొంబాయిలో శారదా ఫిలిమ్స్ కంపెనీలో చేరారు. అక్కడ రిఫ్లెక్టర్ బాయ్ మొదలుకొని సహదర్శకుని స్థాయికి ఎదిగారు. 1929లో ఇంపీరియల్ ఫిలిం కంపెనీలో చేరారు. వీరికి 'విజయకుమార్' (30), 'ఏ వేజర్ ఆఫ్ లవ్' (31) మూకీలను డైరెక్ట్ చేశారు. 'సినిమా గర్ల్' అనే మూకీలో చిన్న వేషం వేశారు. తొలి భారతీయ టాకీ 'ఆలంఆరా'కు అసిస్టెంట్‌గా పని చేశారు. అక్కడే ఆయనకు ఎల్వీ ప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. 1931 మార్చి 14న విడుదలైన 'ఆలం ఆరా' సినిమా విజయం తర్వాత తమిళ్ 'కాళిదాస్'కు దర్శకత్వం వహించారు. ఆ తర్వాత కృష్ణాఫిలిమ్స్ వారికి 'భక్త ప్రహ్లాద' తీయ సంకల్పించారు. నిర్మాత మాణిక్ లాల్ పటేల్. అంతా అనుకున్నట్లుగా అర్దేషిర్ ఇరానీ కాదు. 'సురభి' నాటక సమాజాన్ని బొంబాయికి తీసుకెళ్లి ధర్మవరం రామకృష్ణమాచార్యుల నాటకం ఆధారంగా హిరణ్యకశ్యపునిగా మునిపల్లె సుబ్బయ్య, లీలావతిగా సురభి కమలాబాయి, ప్రహ్లాదునిగా బాలనటుడు కృష్ణాజీరావు సిందే, మొద్దబ్బాయిగా ఎల్వీ ప్రసాద్ లతో 20 రోజుల్లో 18వేల బడ్జెట్‌తో తయారయింది ప్రహ్లాద. పాటలు రాసింది చందాల కేశవదాసు. గోవర్ధన్ భాయ్ పటేల్ సినిమాటోగ్రఫీ నిర్వహించారు. అలా పూర్తి తెలుగు మాటలు, పాటలతో తయారైన 'భక్త ప్రహ్లాద' 1932 ఫిబ్రవరి 6న బొంబాయి లోని కృష్ణా థియేటర్‌లో విడుదల అయింది. కానీ చాలాకాలంగా ఈ చిత్రం 1931 సెప్టెంబర్ 15ననే విడుదలైనట్లు రాసుకున్నాము. కానీ ఇందుకు ఎలాంటి ఆధారాలూ లేవు. సినీ పరిశోధకులు రెంటాల జయదేవ పూనుకుని 'భక్త ప్రహ్లాద', 1932 జనవరి 22న సెన్సార్ అయిందనీ, ముందుగా బొంబాయిలో, ఆ తర్వాత రాజమండ్రి కృష్ణా టాకీస్‌లో, ఏప్రిల్‌లో మద్రాసు నేషనల్ పిక్చర్ ప్యాలెస్‌లో విడుదలైనట్లు తన పరిశోధనలో నిగ్గు తేల్చారు. 'భక్త ప్రహ్లాద' తర్వాత హెచ్.ఎం.రెడ్డిని అంతా 'టాకీపులి'గా పిలవనారంభించారు.



హెచ్.ఎమ్.రెడ్డి

మద్రాసులో బీఎస్ రెడ్డి, మూలా నారాయణస్వామి, కన్నాంబ, తదితరులతో 'రోహిణి పిక్చర్స్' నెలకొల్పి కాంచనమాల, కన్నాంబ ప్రధాన పాత్రలుగా 'గృహలక్ష్మి' (38) తీసి తెలుగు నాట సాంఘిక చిత్రాలకు ఒక కొత్త ఒరవడి కల్పించారు. ఈ చిత్రంలో చిత్తూరు నాగయ్య తొలిసారిగా నటించారు. ఆ తర్వాత తన మాతృ సంస్థ రోహిణి పక్షాన డీఎల్ రామచందర్ దర్శకత్వంలో 'బొండాంపెళ్ళి', 'చదువుకున్న భార్య'(40) అనే రెండు చిన్న చిత్రాలు నిర్మించారు. ఆ తర్వాత ఎల్వీ ప్రసాద్ హీరోగా 'తెనాలి రామకృష్ణ'(41), 'ఘరానా దొంగ' (42) తీశారు. 1951లో 'నిర్దోషి' చిత్రం ఆయన డైరెక్షన్ లో వచ్చిన ఆఖరిది. ఆ తర్వాత వైఆర్ స్వామి దర్శకత్వంలో కాంతారావు, రాజనాలను వెండితెరకు పరిచయం చేస్తూ 'ప్రతిజ్ఞ' తీశారు. ఆ తర్వాత మూడు భాషల్లో 'గజదొంగ' చిత్రాన్ని ప్రారంభించి అది పూర్తవకుండానే 1960 జనవరి 15న కన్నుమూశారు. తెలుగు సినిమాకు మాటలు, నడకలు నేర్పిన మాస్టారుగా ఆయనది ఒక చరిత్ర.

వ్యాసకర్త సినీ చరిత్ర పరిశోధకులు (రేపు హెచ్.ఎమ్. రెడ్డి జయంతి)

## క్లుప్తంగా...

### ధరణి వైఫల్యాలకు కీసర భూములే ఉదాహరణ



సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ విషయంలో సీఎం కేసీఆర్ ప్రజలను మాయ మాటలతో ప్రలోభాలకు గురిచేస్తున్నాడని మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు విమర్శించారు. శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ..ధరణి పోర్టల్ వల్ల అంతా బాగానే ఉందని కేసీఆర్ చెబుతున్న మాటలు అబద్ధాలేనని విమర్శించారు. ఇందుకు కీసర సమీపంలో భూముల ఉదంతమే నిదర్శనమని అన్నారు. రాజీవ్‌గాంధీ హయాంలో అక్కడ 100 ఎకరాల భూమిని పేదలకు పంచారని, ఇప్పుడు ఈ భూమిని ధరణి పోర్టల్ ద్వారా భూస్వాములకు రెవెన్యూ అధికారులు కట్టబెట్టారని ఆరోపించారు. రూ.500 కోట్ల విలువైన భూమిని ఈ పోర్టల్‌లోని లోపాల ఆధారంగానే పేదల నుంచి దూరం చేశారని మండిపడ్డారు. ఈ భూమి విషయంలో వాస్తవాలు నిగ్గు తేల్చేందుకు గాను ఈ నెల 12న నిజనిర్ధారణ బృందాన్ని అక్కడకు తీసుకెళ్లనున్నట్టు ఆయన వెల్లడించారు.

### దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజల సొమ్ము దుర్వినియోగం



కోదాడ అర్బన్: ప్రజాధనం పేదల సంక్షేమానికి ఉపయోగించాలే తప్ప.. దశాబ్ది ఉత్సవాల పేరుతో విందులు, వినోదాలకు ఖర్చు చేయడం సరైంది కాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. శనివారం ఆయన సూర్యాపేట జిల్లా కోదాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఉత్సవాల పేరుతో చేస్తున్న ఖర్చును అనాథ పిల్లల సంక్షేమానికి వెచ్చించాలన్నారు. దుబారా ఖర్చులు ఆపేసి దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఇచ్చే సామాజిక పింఛన్లను రూ.6వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుబారా చేయడం ఓట్ల కోసం గాలం వేయడమేనన్నారు. రాష్ట్రంలో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు ప్రభుత్వమే తల్లిదండ్రులుగా ఉంటుందని ముఖ్యమంత్రి చెప్పి తొమ్మిదేండ్లు అవుతున్నా వారిని ఆదుకోవడం లేదన్నారు. హామీలు అమలు చేయనందుకు నిరసనగా ఈనెల 23న అన్ని జిల్లా కేంద్రాల్లో దీక్షలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. సమావేశంలో నాయకులు ఏపూరి రాజు, రాము, వెంకటేశ్వర్లు, విజయరావు, కుటుంబరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### మొరాయించిన 108... రోగి మృతి



రోగి అంత్యక్రియలు జరుగుతున్న సమయంలోనూ అక్కడే ఉన్న 108 వాహనం

చెన్నారావుపేట: ఆపదలో ఉన్న వ్యక్తిని రక్షించడానికి వచ్చిన 108 అంబులెన్స్ మొరాయించడంతో.. ఆస్పత్రికి తరలించాల్సిన రోగి ప్రాణాలు కోల్పోయాడు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన శామంతుల కుమార్ అనారోగ్యంతో ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో కుటుంబ సభ్యులు శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయంలో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 30 నిమిషాల తర్వాత 108 వాహనం వచ్చీ రాగానే గేర్ లాక్ అవడంతో కదిలేందుకు మొరాయించింది. దీంతో కుమార్‌ను ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా ప్రాణాలు పోయాయి. శుక్రవారం రాత్రి 8 గంటలకు 108 వాహనానికి గేర్ లాక్ కాగా.. శనివారం సాయంత్రం అంత్యక్రియల సమయం వరకు కూడా మరమ్మతులు చేయలేదని గ్రామస్తులు విమర్శించారు.

### అమెరికా నాసా కాన్ఫరెన్స్‌కు ఎంపికైన 101 మంది శ్రీ చైతన్య విద్యార్థులు

మాదాపూర్: అమెరికాలోని డల్లాస్ నగరంలో అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఐఎస్‌డీసీ కాన్ఫరెన్స్‌కు 225 మంది విద్యార్థులు హాజరుకాగా, వీరిలో 101 మంది విద్యార్థులు తమ స్కూల్‌కు చెందిన వారేనని శ్రీ చైతన్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. మాదాపూర్‌లోని ఎస్‌సీసీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, భారత దేశం నుంచి పాల్గొన్న 105 మందిలో 101 మంది శ్రీ చైతన్య విద్యార్థులేనని తెలిపారు. ఇండియాలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా గత 12 సంవత్సరాలుగా ఐఎస్‌డీసీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఘనత శ్రీ చైతన్యదే అన్నారు. అమెరికాలోని టెక్సాస్ స్టేట్, డల్లాస్‌లో మే 22 నుంచి జూన్ 4వ తేదీ వరకు నిర్వహించిన నాసా, ఐఎస్‌డీసీ కాన్ఫరెన్స్‌లో 101 మంది శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు పాల్గొని, అమెరికా టూర్ విజయవంతంగా పూర్తిచేసుకుని ఈ నెల 6వ తేదీన ఇండియాకు వచ్చినట్టు తెలిపారు. విద్యార్థులు వివిధ అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారని వెల్లడించారు.. విద్యార్థులు హూస్టన్ స్పేస్ సెంటర్‌లోని లాంచింగ్ ప్యాడ్, స్టార్స్ అండ్ స్టెమ్ వర్క్‌షాప్‌లను సందర్శించారు.

# ధరణి రద్దు చేస్తే.. బ్రోకర్ల రాజ్యమే

- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దళారులు, పైరవీకారులదే పెత్తనం
- పక్కనున్న ఆంధ్రప్రదేశ్ ఎల్లెంకల పద్దది..: హరీశ్‌రావు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. పైరవీకారులు, బ్రోకర్ల రాజ్యం అవుతుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. సుపరిపాలన పోయి., లంచాల పద్ధతి వస్తుందని, దరఖాస్తులు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతుందని దుయ్యబట్టారు. ధరణి కారణంగానే ఇప్పటివరకు 60 లక్షల మంది రైతులకు రూ.60 వేల కోట్ల రైతుబంధు డబ్బులు వారి ఖాతాల్లో జమయ్యాయని వివరించారు. శనివారం హరీశ్‌రావు సంగారెడ్డిలో జరిగిన సుపరిపాలన దినోత్సవంలో ప్రసంగించారు. ధరణిపై అబద్ధాలను ప్రచారం చేస్తున్న ప్రతిపక్ష పార్టీల తీరును ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు.

**ఆంధ్రప్రదేశ్ ఎల్లంకల పద్దది..**

'సుపరిపాలన అంటే.. గతంలో ఒక లీడరుండె... అంతా హైటెక్.. అంతా సుపరిపాలననే.. మాట మాట్లాడితె హైటెక్ అంటుండె. ఇగ నా అంత అడ్మిన్స్ట్రేటరే ఈ దేశంల లేడంటుండే. ఏమైంది ఇప్పుడు ఆంధ్రప్రదేశ్... ఎల్లంకెల పద్దది. ఇతని పుణ్యమా అని ఇయ్యాల ఎల్లంకెల పద్దది ఆంధ్రప్రదేశ్. కానీ ఇవాళ కేసీఆర్‌గారు మాటలు తక్కువ... మనవి చేతలెక్కువ. కానీ వాళ్లయెట్లుండంటె మాటలు కోటలు దాటినయ్. చేతలు మాత్రం పకోడీలాగుండె వాళ్ల పరిస్థితి. కానీ మన కేసీఆర్ హయాంలో మాటలకంటే చేతల్లోనే కేసీఆర్ ఎక్కువగ దృష్టి పెట్టిండు. మనది ప్రచారం తక్కువ. పని ఎక్కువ. కానీ ఆ ప్రచారం కేసీఆర్‌గారు చెయ్యరు. మనం చెయ్యాలె. లబ్ధిపొందిన మనం, దాని ద్వారా లాభాలు పొందిన మనం, ఈ నిజాలను ప్రచారంలో పెట్టాలె. అందుకే మళ్లొక్కసారి అంటున్న.. ఏం లబ్ధిపొందినమనేది పక్క రాష్ట్రం పొయ్యి చూసొస్తే అర్థమయితది' అని హరీశ్ అన్నారు.

**తాను తప్పు చేశానని లగడపాటి అన్నారు**

తెలంగాణను వ్యతిరేకించి తాను తప్పు చేశానని లగడపాటి రాజగోపాల్ ఇటీవల ప్రకటించినట్లు తాను విన్నానని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అద్భుతమైన పాలన అందిస్తున్న కారణంగా లగడపాటి అలాంటి వ్యాఖ్యలు చేసి ఉంటారని తాను భావిస్తున్నానని అన్నారు.

# ధరణి నా పాలిట శాపమైంది

- రైతుబంధు సమన్వయ సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి
- మంత్రి సబిత సమక్షంలోనే లోపాలు ఏకరువు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ధరణి పోర్టల్ తన పాలిట శాపంగా పరిణమించిందని రంగారెడ్డి జిల్లా రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షుడు వి.లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన సుపరిపాలన దినోత్సవాల్లో మంత్రి సబితారెడ్డి, కలెక్టర్ హరీశ్, ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. ఈ సందర్భంగా రైతుబంధు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి కల్పించుకుని తన పట్టా భూమికి పాసు బుక్కులు కూడా వచ్చాయని.. కుమార్తెకు కట్నంగా రెండెకరాలు రాసి ఇవ్వాలని నిర్ణయించానని తెలిపారు.



లక్ష్మారెడ్డి

కుమార్తె పేరున భూమి బదిలీ చేసేందుకు వెళ్తే వక్ఫ్‌బోర్డుగా చూపిస్తోందని.. బిడ్డ పేరున రిజిస్ట్రేషన్ చేయడం సాధ్యం కావడం లేదని వాపోయారు. నిజానికి అక్కడ ఎలాంటి వక్ఫ్‌భూమి లేకున్నా.. ధరణిలో అలా ఎలా నమోదైందో అర్థం కావడం లేదన్నారు. రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్‌లోనూ నిషేధిత జాబితాలోనే ఉందని వివరించారు. మంత్రి సబితారెడ్డి జోక్యం చేసుకుని ఈ అంశంపై మరోసారి మాట్లాడదామని సర్ది చెప్పగా.. కలెక్టర్ హరీశ్ వ్యక్తిగతంగా వచ్చి తనను కలవాలని సూచించారు. మొత్తానికి అధికార పార్టీ నేత ధరణి పోర్టల్ లోపాలను ఎత్తిచూపడం తీవ్ర చర్చనీయాంశమైంది.

# గోశాలలో రక్తం చిందిస్తే పాపం చుట్టుకుంటుందని..

- నర్కుడలోని ఓ వెంచర్‌కు తీసుకెళ్లి అప్సరను హత్యచేసిన సాయికృష్ణ
- మూడుసార్లు హత్యకు విఫలయత్నం, నాలుగోసారి సఫలం
- హత్య ఎలా చేయాలని గూగుల్‌లో వెతికిన నిందితుడు
- హత్య కేసులో వెలుగులోకి సంచలన విషయాలు

శంషాబాద్: సంచలనం సృష్టించిన కనుగంటి అప్సర (30) హత్య కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. వృత్తిరీత్యా ఆలయ పూజారి అయిన నిందితుడు అయ్యగారి వెంకట సూర్య సాయికృష్ణ అప్సరను తొలుత సుల్తాన్‌పూర్‌లోని గోశాలలో అంతమొందించాలని భావించాడు. అయితే, గోశాలలో రక్తం చిందిస్తే పాపం చుట్టుకుంటుందని భావించి... కారును 2 కి.మీ. దూరం తీసుకెళ్లి నర్కుడలోని ఓ వెంచర్‌లో హత్య చేసినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. హత్య ఎలా చేయాలో గూగుల్‌లో సెర్చ్ చేసి సాయికృష్ణ ప్రణాళిక వేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. అప్సర హత్యకు మూడుసార్లు విఫలయత్నం చేసిన సాయికృష్ణ.. నాలుగోసారి ఆమెను అంతమొందించాడు.

**కోయంబత్తూరు టూర్ అడ్డుపెట్టుకొని..**

సరూర్‌నగర్‌లోని బంగారు మైసమ్మ గుడికి వెళ్తున్న క్రమంలో సాయికృష్ణ, అప్సరలకు పరిచయం ఏర్పడింది. రోజూ ఇద్దరు ఫోన్‌లో కాల్స్‌తోపాటు వాట్సాప్‌లో చాటింగ్ చేసుకునే వాళ్లు. గత నవంబర్‌లో అప్సర, సాయికృష్ణ గుజరాత్‌లోని సోమనాథ్, ద్వారక ఆలయాలను దర్శించుకుని, అక్కడే ఇద్దరూ ఒక్కటైనట్లు పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో తనను పెళ్లి చేసుకోకపోతే వ్యక్తిగత ఫొటోలు సోషల్ మీడియాలో పెడతానని, సంఘాల్లో చెప్పి పరువు తీస్తానని అప్సర బ్లాక్ మెయిల్ చేయడం మొదలు పెట్టింది. దీంతో ఆమెను అంతమొందించాలని సాయికృష్ణ నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో కోయంబత్తూరుకు తీసుకెళ్లాలని పలుమార్లు అప్సర కోరడంతో హత్యకు ఇదే అదనుగా భావించాడు. ఈనెల 3న శంషాబాద్ నుంచి కోయంబత్తూరుకు ఆఖరి బస్సు రాత్రి 11 గంటలకు ఉందని, టికెట్ కూడా బుక్ చేశానని నమ్మించి, ఆమెను ఇంటి నుంచి కారులో ఎక్కించుకొని తీసుకెళ్లాడు. రెండు గంటల పాటు శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో తిప్పాడు. కోయంబత్తూరుకు వెళ్లడం ఏమైందని అప్సర ప్రశ్నించడంతో.. తాను టికెట్ బుక్ చేయలేదని చెప్పాడు. సుల్తాన్‌పల్లిలోని గోశాలకు వెళ్దామని ఆమెను ఒప్పించాడు. తర్వాత నర్కుడ వైపు వెళ్లి కారు కవర్‌ను అప్సర తలకు చుట్టి ఊపిరాడకుండా చేసి, బండరాయితో తలపై మోది హత్య చేశాడు. తర్వాత కారు కవర్, అప్సర చెప్పులు, బండరాయిని నిర్మానుష్య ప్రాంతంలో విసిరేశాడు.



అప్సర



సాయికృష్ణ

అప్సర మృతదేహాన్ని పాతిపెట్టిన మ్యాన్‌హోల్ నుంచి దుర్వాసన వస్తుండటంతో ఎల్బీనగర్ నుంచి రెండు టిప్పర్ల ఎర్ర మట్టిని తెప్పించి పోశాడు. తమ్ముడు అయ్యవారి సత్యప్రసాద్ ద్వారా టిప్పర్ డ్రైవర్ అశోక్‌కు నగదు ఫోన్ పే ద్వారా రూ.16 వేలు వేశాడు. మరుసటి రోజు కూడా మ్యాన్‌హోల్ వద్ద దుర్వాసన వస్తుండటంతో మ్యాన్‌హోల్ కాంక్రీట్ మూతతో పూడ్చేశాడు.

**14 రోజులు రిమాండ్‌కు...**

పోలీసులు సాయికృష్ణను రాజేంద్రనగర్ కోర్టు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించారు. సాయికృష్ణ కస్టడీ కోరుతూ పోలీసులు సోమవారం కోర్టులో పిటిషన్ వేయనున్నారు. అప్సర తల మీద బండరాయితో బలంగా మోదడంతో అధికంగా రక్తస్రావం జరిగి మరణించిందని ఉస్మానియా వైద్యులు వెల్లడించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### సీసీటీవీ కెమెరాలతో దొరికాడు..

అప్సరను హత్య చేసిన తర్వాత సాయికృష్ణ అమాయకుడిలా ఆర్జీఏఐ పోలీసు స్టేషన్‌కు వెళ్లి తన మేనకోడలు కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశాడు. అనుమానం వచ్చిన పోలీసులు శంషాబాద్ బస్టాండ్ వద్ద సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. దీంతో హంతకుడు సాయికృష్ణనే అని నిర్ధారణకు వచ్చారు. అయితే పక్కా సాక్ష్యాధారాలు సేకరించిన తర్వాతే అరెస్టు చేయాలని భావించారు. ఈనెల 3న కోయంబత్తూరు వెళ్తున్నామని అప్సరను కారులో తెచ్చిన సాయికృష్ణ రాత్రి 10 గంటల సమయంలో శంషాబాద్ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కారు ఆపి కిందికి దిగాడు. ఇంతలోనే ఓ బస్సు అటుగా వెళ్లడంతో కారు ఎటువైపు వెళ్లిందనేది సీసీ ఫుటేజీ తొలుత లభించలేదు. ఆ తర్వాత రాళ్లగూడ వరకు వెళ్లి ఒక్కడే ఫాస్ట్‌ఫుడ్ తిన్నాడు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద కూడా అప్సర ఓసారి కారు దిగింది. వాంతి చేసుకున్న తర్వాత తిరిగి కారులో కూర్చున్నట్లు అక్కడి సీసీ కెమెరా ఫుటేజీల్లో స్పష్టంగా నమోదైంది. హత్య చేసిన తర్వాత తిరిగొస్తున్న క్రమంలో కారులో ఒక్కడే ఉన్న సీసీ ఫుటేజీ కూడా పోలీసులకు దొరికింది. అప్సర నుంచి చివరి ఫోన్ కాల్ సాయికృష్ణకు చేసినట్లు పోలీసులు గుర్తించారు.

# 'గూడెం'లో నేడే ప్రజాగర్జన

- సీపీఐ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ
- లక్ష మంది జన సమీకరణ లక్ష్యం
- హాజరుకానున్న పార్టీ జాతీయ కార్యదర్శి రాజా

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న ప్రజాగర్జన బహిరంగ సభకు సర్వం సిద్ధమైంది. సాయంత్రం పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో జరిగే సభకు పార్టీ జాతీయ కార్యదర్శి డి.రాజా ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ఈ ఏడాది ఏప్రిల్ 14న సీపీఐ ఆధ్వర్యంలో ప్రజాపోరు యాత్రలు చేపట్టి గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడికక్కడ సభలు, సమావేశాలు నిర్వహించారు. పోడు సాగుదారులకు పట్టాల పంపిణీ, సింగరేణి ప్రైవేటీకరణ, రాజ్యాంగ, లౌకిక వ్యవస్థల పరిరక్షణ తదితర అంశాలపై విస్తృతంగా ప్రచారం చేశారు.

**ఎర్ర జెండా రెపరెపలతో..:** ప్రజాగర్జన బహిరంగ సభ నేపథ్యంలో కొత్తగూడెం పట్టణం ఎరుపెక్కింది. ప్రకాశం స్టేడియంలో భారీ వేదిక ఏర్పాటు చేశారు. బహిరంగ సభకు లక్ష మంది జన సమీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి తగ్గట్టే గత నెలరోజులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో విస్తృత ప్రచారం నిర్వహించారు.

**బెల్లంపల్లి నుంచి ప్రత్యేక రైలు..:** కొత్తగూడెంలో నిర్వహించే బహిరంగ సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ప్రధానంగా జన సమీకరణ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం వెయ్యి బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి కూడా 300 చొప్పున బస్సుల్లో కార్యకర్తలు తరలివస్తారని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని తెలిపారు. ఒక్క కొత్తగూడెం నియోజకవర్గం నుంచే 25 వేల మందికి పైగా ప్రజలను తరలించేందుకు వాహనాలను సిద్ధం చేశామని, భద్రాచలం, పినపాక, ఇల్లెందు, అశ్వారావుపేట నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరానున్నారని చెప్పారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాలైన ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి వేలాదిగా కార్మికులు వచ్చేందుకు బెల్లంపల్లి నుంచి ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాల నుంచి కూడా కార్యకర్తలు పెద్దఎత్తున తరలివస్తారని వివరించారు.



ప్రజాగర్జన సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కూనంనేని

**హాజరుకానున్న రాజా..:** ఈ సభకు జాతీయ కార్యదర్శి డి.రాజాతో పాటు సీపీఐ జాతీయ నాయకులు కె.నారాయణ, అజీజ్ పాషా, చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, వాసిరెడ్డి సీతారామయ్య, ప్రముఖ కళాకారులు గోరటి వెంకన్న, వందేమాతరం శ్రీనివాస్ తదితరులు హాజరుకానున్నారు.

### తెలంగాణ భవన్‌లో దివ్యాంగుల సంబరాలు

పెన్షన్ వెయ్యి రూపాయల పెంపుదలపై హర్షం

సాక్షి, హైదరాబాద్: దివ్యాంగుల పింఛను కోసం రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లలో రూ.10వేల కోట్లు ఖర్చు చేసిందని, దివ్యాంగుల సంక్షేమం విషయంలో కేసీఆర్ మానవీయ పాలన, నిబద్ధతకు ఇది నిదర్శనమని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి అన్నారు. దివ్యాంగుల పెన్షన్‌ను కొత్తగా రూ.1,000 పెంచుతూ మొత్తంగా రూ.4,116 ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటనపై శనివారం బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో సంబరాలు చేసుకున్నారు. డాక్టర్ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులు కేక్ కట్ చేసి..కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

### వెబ్‌సైట్‌లో 'హార్టికల్చర్ ఆఫీసర్' అభ్యర్థుల హాల్ టికెట్లు

సాక్షి, హైదరాబాద్: ఉద్యానవన శాఖ పరిధిలోని హార్టికల్చర్ ఆఫీసర్ ఉద్యోగాల అర్హత పరీక్షను ఈనెల 17వ తేదీ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. సీబీఆర్టీ పద్ధతిలో నిర్వహించే ఈ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు కమిషన్ వెబ్‌సైట్‌లో ఆదివారం సాయంత్రం 5గంటల నుంచి అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షా కేంద్రాన్ని పరిశీలించుకోవాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది. అభ్యర్థుల సౌకర్యార్థం కమిషన్.. మాక్‌టెస్ట్‌ను నిర్వహించనుంది. కమిషన్ వెబ్‌సైట్ ద్వారా ఈ పేజీని ఓపెన్ చేయచ్చని వెల్లడించింది.

## 15 నిమిషాల ముందే గేట్లు బంద్

▶ మొదటి పేజీ తరువాయి

సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రిలిమినరీ పరీక్షను తిరిగి నిర్వహించనున్నట్లు వెల్లడించిన టీఎస్‌పీఎస్సీ... ఈనెల 11న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షను నిర్వహించనుంది. ఈమేరకు ఏర్పాట్లు పూర్తి చేసిన కమిషన్... పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.

**పోటీ తీవ్రమే...**

వివిధ ప్రభుత్వ శాఖల్లో 503 ఉద్యోగ (గ్రూప్-1) ఖాళీలున్నాయి. వీటికి 3,80,081 మంది దరఖాస్తు చేసుకోగా, గత అక్టోబర్ 16న నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షకు 2,86,051 మంది హాజరయ్యారు. అనంతరం మెయిన్ పరీక్షలకు అర్హత సాధించిన వారి వివరాలను టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. కానీ ప్రశ్నపత్రాల లీకేజీతో ఈ పరీక్షను రద్దు చేయాల్సి వచ్చింది. ప్రిలిమినరీ పరీక్షను మరోమారు నిర్వహిస్తుండడంతో అభ్యర్థులు సైతం మరింత కఠినంగానే సిద్ధమవుతున్నారు. ఇందులోభాగంగా శనివారం సాయంత్రానికి 3,00,836 మంది అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు కమిషన్ వెల్లడించింది. 33 జిల్లాల పరిధిలో 994 కేంద్రాల్లో పరీక్ష జరగనుంది. ప్రతి జిల్లా కలెక్టర్‌ను జిల్లా అథారిటీగా కమిషన్ నియమించింది.

**చెప్పులు వేసుకొస్తేనే అనుమతి**

అభ్యర్థులు ఒరిజినల్ హాల్‌టికెట్‌తో హాజరుకావాలి. హాల్‌టికెట్‌పై ఫొటో సరిగ్గా లేకుంటే మూడు ఫొటోలపై గెజిటెడ్ అధికారి సంతకంతో కూడిన హాల్‌టికెట్‌తో హాజరుకావాలి. అభ్యర్థులు తప్పకుండా గుర్తింపు కార్డు (పాన్, ఆధార్, ఓటర్ ఐడీ తదితరాలు)ను వెంట తెచ్చుకోవాలి. పరీక్షా హాల్లోకి అభ్యర్థులను అనుమతించే విషయంలో కమిషన్ కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. పరీక్షా సమయానికి 15 నిమిషాల ముందే గేట్లు వేసేస్తారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. అభ్యర్థులు కేవలం చెప్పులు మాత్రమే ధరించాలి. బూట్లు ధరించకూడదు. బెల్టు ధరించిన అభ్యర్థులను సైతం పక్కాగా పరిశీలించిన తర్వాతే అనుమతిస్తారు. పరీక్ష తీరును పరిశీలించేందుకు టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సైతం ఏర్పాటు చేసినట్లు కమిషన్ వెల్లడించింది.

## 1.60 కోట్ల మందికి కంటి పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: మారిన జీవన విధానం, పనుల ఒత్తిళ్ల కారణంగా అనేక మంది ప్రజలు కంటి సమస్యలతో సతమతమవుతున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో ఏ ఒక్కరూ కంటి సమస్యలతో బాధ పడకూడదని సీఎం కేసీఆర్ కంటి వెలుగు పథకానికి శ్రీకారం చుట్టారని శనివారం ఒక ప్రకటనలో సమాచారశాఖ తెలిపింది. కంటివెలుగు పథకం ద్వారా ఇప్పటివరకు 1.60 కోటి మందికి పరీక్షలు నిర్వహించారని, ఇందులో 75.62 లక్షల మంది పురుషులు, 85.06 లక్షల మంది మహిళలు, 11,584 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారని వెల్లడించింది. ఇందులో 22.44 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు అందించారని, 98.11 శాతం కంటి పరీక్షలు పూర్తయ్యాయని వివరించింది. 1.20 లక్షల మందికి ఎలాంటి సమస్యలేదని నిర్ధారణ అయిందని పేర్కొంది.

**అనుకున్న లక్ష్యానికి మించి..:** 'అనుకున్న లక్ష్యానికి మించి రెండు కోట్లకు చేరుకునే దిశగా కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. ఈ పథకాన్ని జూన్ 15 వరకు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఎప్పటికప్పుడు లోటుపాట్లు సవరించుకుంటూ కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు' అని సమాచారశాఖ తెలిపింది.

## 'రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం'

సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పుపై వెనక్కి తగ్గేదే లేదని, నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించిన అనంతరం నారాయణరెడ్డి మీడియాతో మాట్లాడారు. తమ డిమాండ్‌పై కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ కూడా రాశారని ఆయన వెల్లడించారు. భువనగిరి చుట్టుపక్కల రైతుల మెడకు రీజనల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ ఉచ్చులా మారిందన్నారు.

# ఖమ్మంలో అమిత్‌షా సభ అదిరిపోవాలి..

### టెలి కాన్ఫరెన్స్‌లో బీజేపీ శ్రేణులకు బండి సంజయ్ దిశానిర్దేశం

- ఖమ్మం సభ కోసం నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిల నియామకం

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ గుండెల్లో డప్పులు మోగేలా ఈనెల 15న ఖమ్మంలో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హాజరయ్యే బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపునిచ్చారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం 9 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను దేశవ్యాప్త ప్రచారం చేయడం లక్ష్యంగా 'మహా జన సంపర్క్ అభియాన్'పేరిట నిర్వహిస్తున్న బీజేపీ అగ్రనేతల పర్యటనల్లో భాగంగా ఈ సభను నిర్వహిస్తున్నారు. అమిత్‌షా సభ ఏర్పాట్లకు సంబంధించి శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉమ్మడి ఖమ్మం జిల్లా పోలింగ్ బూత్ కమిటీల సభ్యులతో సంజయ్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ''ఖమ్మంలో బీజేపీ ఎక్కడుంది? అక్కడ లక్ష మందితో బహిరంగ సభను నిర్వహించే సత్తా బీజేపీ నాయకులకు ఉందా? అంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. వారికి కనువిప్పు కలిగేలా, ఖమ్మం జిల్లా కాషాయ అడ్డా అని నిరూపించే సమయం వచ్చింది. ఐదు రోజులే గడువుంది. ప్రతి ఒక్కరూ కసితో పనిచేయాలి.. కనీవినీ ఎరుగని రీతిలో బహిరంగ సభను సక్సెస్ చేద్దాం.''అని సూచించారు. ఇంటింటికీ తిరిగి బొట్టు పెట్టి సభకు రావాలని ఆహ్వానించాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. 'నేను ఖమ్మం సభకు పోతున్నా.. మీరూ వస్తున్నారా?'అంటూ విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

**భద్రాద్రి రాములోరి దర్శనానికి అమిత్‌షా**

బహిరంగ సభకు 15న ఖమ్మం విచ్చేస్తున్న అమిత్‌షా భద్రాచలం వెళ్లి శ్రీ రాముల వారిని దర్శించుకుంటారు. ఈ పర్యటనలో భాగంగానే హైదరాబాద్‌లో పార్టీ పూర్వ కార్యకర్తలు, సీనియర్ కార్యకర్తలతో కూడా అమిత్‌షా ప్రత్యేకంగా భేటీ కానున్నారు. కాగా, మహా జనసంపర్క్ అభియాన్‌లో భాగంగా ఈ నెల 25న నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే బహిరంగసభలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొంటారు. ఈ నెలాఖరులో ప్రధాని మోదీ మేడ్చల్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో రోడ్‌షో, నల్లగొండ పట్టణంలో బహిరంగసభలో పాల్గొంటారు.

**లక్ష జనసమీకరణ లక్ష్యం**

ఖమ్మం పట్టణంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్నార్ మైదానంలో నిర్వహించే అమిత్ షా బహిరంగ సభకు జన సమీకరణపై బీజేపీ దృష్టి సారించింది. లక్ష మందికి తగ్గకుండా జనాన్ని సమీకరించి సభను సక్సెస్ చేయాలని నిర్ణయించింది. అందుకోసం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇంచార్జిలను నియమించారు. ఉమ్మడి జిల్లాలోని 47 మండలాలు, 3 మున్సిపాలిటీల తోపాటు ఖమ్మం కార్పొరేషన్ నుంచి భారీగా జన సమీకరణ చేయాలని నిర్ణయించారు. శనివారం రాత్రి పార్టీ కార్యాలయంలో నియమితులైన ఇంచార్జిలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ ఇన్‌చార్జిలు నియోజకవర్గాల్లోనే మకాం వేసి పోలింగ్ బూత్‌ల వారీగా సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్ రావు, మాజీ మంత్రి డాక్టర్ విజయరామారావు, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఏ నిర్ణయం తీసుకున్నా ఓకే

- పని చేసేందుకు సిద్ధం.. బిస్తర్ కూడా రెడీ
- మీడియా ప్రతినిధులతో బండి సంజయ్
- అధ్యక్ష మార్పుపై మీడియా వార్తలు పట్టించుకోవడం లేదని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: పార్టీ జాతీయ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్నా , ఏ బాధ్యతలు అప్పగించినా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ స్పష్టం చేశారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా తనను మారుస్తారని మీడియాలో వచ్చిన వార్తలు పట్టించుకోవడం లేదన్నారు. అవన్నీ కేవలం ప్రచారం మాత్రమేనన్నారు. ఐతే ఏ నిర్ణయం తీసుకున్నా బిస్తర్ రెడీగా పెట్టుకున్నానని వ్యాఖ్యానించారు. శనివారం రాత్రి పార్టీ కార్యాలయంలో బండి సంజయ్ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ''కేంద్ర మంత్రి పదవి ఇస్తారని, రాష్ట్ర అధ్యక్ష పదవి తొలగిస్తారని ప్రచారం జరుగుతోంది. మా పార్టీలో అలాంటి లీకులకు తావుండదు''అని స్పష్టం చేశారు. గతంలో కేంద్ర మంత్రి పదవి దక్కినప్పుడు వారి పేర్లు బయటకు వచ్చాయా? అని ప్రశ్నించారు. తాను పార్టీ లైన్‌కు కట్టుబడి పనిచేస్తాననీ, బీజేపీలో ఏ పదవీ శాశ్వతం కాదన్నారు. బీజేపీలో జాయినింగ్స్ కోసం ఎవరో వస్తారని తాము ఎదురుచూడమని బండి స్పష్టం చేశారు.



**బీఆర్ఎస్‌కి బీజేపీతోనే పోటీ**

బీఆర్ఎస్‌తోనే బీజేపీకి ప్రధాన పోటీ తప్ప కాంగ్రెస్‌తో కాదని సంజయ్ అభిప్రాయపడ్డారు. కేసీఆర్ చేయించుకున్న సర్వేలోనే బీజేపీకి ఆదరణ పెరిగినట్టు తేలిందని చెప్పారు. ఇంటెలిజెన్స్ రిపోర్ట్ కూడా అదే తేల్చిందన్నారు. అందుకే కేసీఆర్ బీజేపీకి భయపడి కాంగ్రెస్‌ను జాకీలు పెట్టి లేపాలని ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ కోసం బీజేపీలో పెద్ద ఎత్తున పోటీ ఏర్పడితే, బీఆర్ఎస్‌కు భవిష్యత్‌లో అభ్యర్థులే కరువయ్యే పరిస్థితి ఏర్పడుతుందని వ్యాఖ్యానించారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి కర్ణాటకలో కాంగ్రెస్ ఇబ్బంది పడుతోందన్నారు. కాంగ్రెస్ లో ఇక్కడి నుంచి కాకపోతే పాకిస్తాన్ నుంచి అయినా చేర్చుకోనివ్వండి.. మాకేం ఇబ్బంది లేదన్నారు. కవితపై ఈడీ, సీబీఐ విచారణ జరుగుతోందని చెప్పారు. చార్జిషీట్ లో పేరు లేకుంటే బీజేపీకి, బీఆర్ఎస్‌కు మధ్య ఒప్పందం కుదిరినట్లా అని బండి ప్రశ్నించారు. తప్పు చేసిన వారు కాస్త ఆలస్యమైనా జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.

## క్లుప్తంగా...

### మణిపూర్‌లో శాంతి స్థాపనకు కేంద్రం కమిటీ

న్యూఢిల్లీ: మణిపూర్‌లో జాతుల మధ్య వైరాన్ని రూపుమాపి శాంతిని స్థాపించేందుకు, వివిధ వర్గాల మధ్య చర్చలు జరిపేందుకు కేంద్రం శాంతి కమిటీని ఏర్పాటు చేసింది. గవర్నర్ సారథ్యంలోని ఈ కమిటీలో ముఖ్యమంత్రి, కొందరు మంత్రులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు పౌరసంఘాలకు ప్రాతినిధ్యం ఉంటుందని శనివారం హోం శాఖ తెలిపింది. ఇటీవల మణిపూర్‌లో పర్యటన సమయంలో హోం మంత్రి అమిత్ షా శాంతి కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. మణిపూర్‌లో నెల రోజులుగా జరుగుతున్న ఘర్షణల్లో ఇప్పటి వరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, మరో 300 మంది గాయపడ్డారు.

### గుజరాత్‌కు 'బిపర్‌జోయ్' ముప్పు లేనట్లే: ఐఎండీ

అహ్మదాబాద్: గుజరాత్‌కు 'బిపర్‌జోయ్' తుపాను ముప్పుతప్పినట్లేనని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసింది. ఈ తుపాను మరో 12 గంటల్లో అత్యంత భీకర తుపానుగా మారే ప్రమాదముందని తెలిపింది. ప్రస్తుతం ఇది గుజరాత్‌లోని పోర్‌బందర్‌కు 600 కిలోమీటర్ల దూరంలో అరేబియా సముద్రంలో కేంద్రీకృతమై ఉందని తెలిపింది. రానున్న 24 గంటల్లో ఈశాన్య దిశగాను, ఆ తర్వాత మూడు రోజుల్లో ఉత్తర–వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని వివరించింది. దీంతో, వచ్చే అయిదు రోజుల్లో గుజరాత్‌కు తుపాను ముప్పు తప్పినట్లేనని వెల్లడించింది. దీని ప్రభావంతో కచ్–సౌరాష్ట్ర ప్రాంతంలో బలమైన గాలులు వీస్తాయని పేర్కొంది.

### సరిహద్దుకు ఎటువైపైనా దీటైన జవాబివ్వగలం

ససరాం: దేశ సరిహద్దుకు లోపల, వెలుపలా రక్షణ సన్నద్ధత, సామర్థ్యం విషయంలో భారత్‌కు తిరుగులేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పునరుద్ఘాటించారు. బాలాకోట్‌లో ఉగ్రస్థావరంపై వైమానిక దాడులు, పాక్ ఆక్రమిత కశ్మీర్ భూభాగంపై సర్జికల్ దాడులే భారత సత్తాకు సాక్ష్యాలన్నారు. బిహార్‌లోని రోహ్‌తాస్ జిల్లాలో ఓ ప్రైవేట్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణకు దిగినపుడు భారతీయ విద్యార్థులు చిక్కుకుపోయారని తెల్సి మోదీ వెంటనే రష్యా, ఉక్రెయిన్, అమెరికా అధ్యక్షులతో ఒక్కటే మాట చెప్పారు. అంతే. నాలుగు గంటలపాటు యుద్ధం స్తంభించింది. విద్యార్థులను వెనక్కి తెచ్చేశాం. మోదీ ఘనత చూసి ప్రపంచమే నోరెళ్లబెట్టింది' అని అన్నారు.

బొగొటా: దక్షిణ అమెరికాలోని కొలంబియాలో దట్టమైన అమెజాన్ అడవుల్లో ఒక అద్భుతం జరిగింది. విమాన ప్రమాదంలో చిక్కుకొని అడవుల్లో తప్పిపోయిన నలుగురు చిన్నారులు ఏకంగా 40 రోజుల తర్వాత మృత్యుంజయులుగా బయటపడ్డారు. విమాన ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడడమే ఒక అద్భుతమైతే, క్రూరమృగాలు తిరిగే అడవుల్లో 40 రోజులు ప్రాణాలతో ఉండడం మరో అద్భుతం. దట్టమైన అటవీ ప్రాంతంలో సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్న సైనికులు వారిని క్షేమంగా వెనక్కి తీసుకువచ్చి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పౌష్టికాహార లోపంతో బాగా బలహీనపడిపోవడంతో పాటుగా ఆ చిన్నారుల శరీరంపై పురుగు పుట్రా చేసిన కాట్లు ఉన్నాయి. ఒకే తల్లి బిడ్డలైన నలుగురు చిన్నారుల్లో 13, 9. 4 ఏళ్లతో పాటుగా ఏడాది వయసున్న బాబు కూడా ఉన్నాడు.



# అమెజాన్ అడవుల్లో అద్భుతం

**మృత్యుంజయులుగా బయటకి వచ్చిన నలుగురు చిన్నారులు • విజయవంతంగా ఆపరేషన్ హోప్**

#### చరిత్రలో నిలిచిపోతారు : అధ్యక్షుడు పెట్రో

అడవుల్లో కనిపించకుండా పోయిన నలుగురు చిన్నారులు క్షేమంగా వెనక్కి తిరిగి రావడంతో దేశంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో మృత్యుంజయులు అన్న మాటకి వీరంతా ఉదాహరణగా నిలుస్తున్నారని అన్నారు. వీరు ప్రాణాలతో ఉండడం చరిత్రలో నిలిచిపోతుందని వ్యాఖ్యానించారు. దేశంలో ఇదొక మేజికల్ డే అని సైనికులు చేసిన కృషిని అభినందించారు.

#### అసలేం జరిగింది?

అమెజాన్ అటవీ ప్రాంతం పరిధిలో అరారాక్యూరా నుంచి శాన్‌జోస్ డెల్ గ్వావియారే ప్రాంతానికి గత నెల మే 1న ఒక సింగిల్ ఇంజిన్ విమానం బయల్దేరింది. నలుగురు చిన్నారులు, వారి తల్లి, ఒక గైడ్, ఒక పైలెట్‌తో విమానం బయల్దేరింది. విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతిక లోపం తలెత్తి ఇంజిన్ విఫలం కావడంతో దట్టమైన కీకారణ్యంలో కుప్పకూలిపోయింది. విమానం రాడార్ నుంచి అదృశ్యం కావడంతో అధికారులు వారిని కాపాడేందుకు సైన్యాన్ని రంగంలోకి దించారు. ఆపరేషన్ హోప్ పేరుతో సహాయ చర్యలు మొదలు పెట్టారు. విమాన ప్రమాదం జరిగిన రెండు వారాల అనంతరం మే 16న అధికారులు విమాన శకలాలను గుర్తించగలిగారు. అక్కడ పైలెట్, గైడ్, చిన్నారుల తల్లి మృతదేహాలు మాత్రమే లభించడంతో పిల్లలు నలుగురు సజీవంగా ఉన్నారని నిర్ధారణకి వచ్చారు. పిల్లలు క్షేమంగానే ఉన్నారనడానికి సైనికుల గాలింపుల్లో పాలసీసా, సగం తిని పారేసిన పండు, జడకు కట్టుకునే రిబ్బన్ వంటివి దొరకడంతో సహాయ చర్యలు మరింత ముమ్మరం చేశారు. పిల్లల అడుగు జాడలు కూడా చాలా చోట్ల కనిపించాయి. వాటి ఆధారంగా దాదాపుగా 150 మంది సైనికులతో పాటుగా జాగిలాల సాయంతో దట్టమైన అడవుల్లో గాలించారు. అడవుల్లో ఉండే గిరిజన తెగలు వారికి సహకారం అందించారు. మొత్తానికి ప్రమాదం జరిగిన 40 రోజుల తర్వాత అధికారులు ఆ పిల్లల జాడ కనిపెట్టగలిగారు. హెలికాప్టర్‌లో రాజధాని బొగొటాలో ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు.

### ఎలా మనుగడ సాగించారు?

అభం శుభం తెలియని ఆ చిన్నారులు ఇన్నాళ్లూ పులులు, పాములు ఇతర క్రూరమృగాల మధ్య ఎలా మనుగడ సాగించారో వివరాలు తెలియాల్సి ఉంది.ఆ పిల్లలు హ్యూటోటో అనే స్థానిక తెగకు చెందినవారు. పుట్టినప్పట్నుంచి అటవీ ప్రాంతాల్లోనే వారు నివాసం ఉంటున్నారు. అడవుల్లో చెట్లకు కాసే ఏ పళ్లు తినాలో , క్రూర మృగాల బారిన పడకుండా ఎలా తమని తాము కాపాడుకోవాలో కొంతవరకు వారికి అవగాహన ఉంది. . అందుకే కీకారణ్యంలో తప్పిపోయినా ప్రాణాలు నిలబెట్టుకున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సహాయ కార్యక్రమాల్లో భాగంగా హెలికాప్టర్ల ద్వారా జారవిడిచిన ఆహార పొట్లాలు బహుశా పిల్లలను కాపాడి ఉంటాయని సైనికాధికారులు భావిస్తున్నారు. పిల్లలు క్షేమంగా తిరిగిరావడంతో వారి బామ్మ ఫాతిమా వాలెన్సియా ఆనందానికి హద్దులే లేవు. పిల్లల తల్లి పనిలో ఉన్నప్పుడు పెద్దమ్మాయి మిగిలిన చిన్నారుల ఆలనాపాలనా చూసేదని, అదే ఇప్పుడు అడవుల్లో వాళ్లు ఇన్నాళ్లు గడపడానికి ఉపయోగపడిందని చెప్పారు.

### ఎంపీ పదవికి బోరిస్ జాన్సన్ రాజీనామా

- పార్టీగేట్ నివేదికపై యూకే మాజీ ప్రధాని నిర్ణయం
- తనను వేధిస్తున్నారంటూ ఆరోపణ



లండన్: బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజకీయ ప్రత్యర్థులు తనను వేధిస్తున్నారని, పార్లమెంట్ నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. పార్టీగేట్ వ్యవహారంపై విచారణ చేపట్టిన పార్లమెంటరీ ప్రివిలేజెస్ కమిటీని ఆయన 'కంగారూ కోర్టు'గా అభివర్ణించారు. ప్రధానిగా ఉండగా డౌనింగ్ స్ట్రీట్‌లోని కార్యాలయంలో కోవిడ్ లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘిస్తూ జరిపిన విందులను పార్టీగేట్‌గా పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై జాన్సన్ పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించారని పార్లమెంటరీ కమిటీ తప్పుబట్టింది. ఈ మేరకు రూపొందించిన నివేదికను జాన్సన్‌కు పంపించింది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఆయన ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ఉద్దేశపూర్వకంగా, నిర్లక్ష్యంగా కమిటీని తప్పుదోవ పట్టించినట్లుగా ఒక్క రుజువు కూడా చూపలేకపోయిందని ఆయన అనంతరం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తను అబద్ధం చెప్పలేదన్న విషయం కమిటీకి కూడా తెలుసునన్నారు. ఆ నివేదికను తప్పులతడక, పక్షపాతపూరితం అని ఆరోపించారు. బ్రెగ్జిట్ ఒప్పందం చేసుకున్నందుకే తనపై కక్షగట్టారన్నారు. వాస్తవాలతో సంబంధం లేకుండా మొదట్నుంచీ తనను దోషిగా నిలబెట్టడమే కమిటీ లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. ప్రధాని రిషి సునాక్ ప్రభుత్వాన్ని కూడా జాన్సన్ తప్పుపట్టారు. ఇటీవలి కాలంలో జరిగిన ఎన్నికల్లో కేవలం కొన్ని సీట్లను మాత్రమే అధికార కన్జర్వేటివ్ పార్టీ నిలబెట్టుకోగలిగిందని విమర్శించారు. నాలుగేళ్ల క్రితం భారీ విజయం నమోదు చేసుకున్న పార్టీ భవితవ్యం ఇప్పుడు ప్రమాదంలో పడిందన్నారు.

## విదేశీ గడ్డపై స్వదేశాన్ని విమర్శించడం తగదు: అమిత్ షా

పటన్: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల సమయంలో దేశాన్ని విమర్శించడం, అంతర్గత రాజకీయాలను గురించి మాట్లాడటాన్ని హోం మంత్రి అమిత్ షా తప్పుపట్టారు. ఇటువంటి వాటిపై రాహుల్ తన పూర్వీకుల నుంచి నేర్చుకోవాలని, దేశ ప్రజలు గమనిస్తున్నారని తెలుసుకోవాలని హితవు పలికారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 9 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గుజరాత్‌లోని పటన్ జిల్లా సిద్ధ్‌పూర్‌లో శనివారం జరిగిన ర్యాలీలో అమిత్ షా ప్రసంగించారు. 'దేశభక్తి ఉన్న ఎవరైనా భారత రాజకీయాల గురించి భారత్‌లోనే మాట్లాడాలి. ఏ రాజకీయ పార్టీ నేత అయినా సరే విదేశాల్లో ఉండగా దేశాన్ని విమర్శించడం, దేశ రాజకీయాలపై చర్చించడం సరికాదు. రాహుల్ బాబా.. దేశ ప్రజలు ఈ విషయాన్ని నిశితంగా గమనిస్తున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోండి'అని ఆయన పేర్కొన్నారు. 'వేసవి తీవ్రత నుంచి తప్పించుకునేందుకు రాహుల్ బాబా విదేశాలకు విహారయాత్రకు వెళ్తున్నారు. అక్కడున్న సమయంలోనూ దేశాన్ని విమర్శిస్తున్నారు. ఇది సరికాదన్న విషయాన్ని తన పూర్వీకుల నుంచి నేర్చుకోవాలని రాహుల్‌కు సలహా ఇస్తున్నా'అని అమిత్ షా వ్యాఖ్యానించారు. రాహుల్ ఇటీవల అమెరికా పర్యటన సందర్భంగా మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేసిన విషయం తెలిసిందే. మోదీ ప్రభుత్వ హయాంలో దేశంలో పెను మార్పులు చోటుచేసుకున్నా కాంగ్రెస్ మాత్రం భారత్ వ్యతిరేక వ్యాఖ్యలు ఆపలేదని విమర్శించారు.

## మోదీ హయాంలో 3 రెట్లు పెరిగిన దేశ అప్పు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ తిరోగమన పాలనా విధానాల వల్లే దేశ అప్పు గత 9 ఏళ్ల బీజేపీ పాలనలో మూడు రెట్లు పెరిగిందని కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రస్తుతం దేశ ఆర్థిక స్థితిగతులపై శ్వేతపత్రం విడుదలచేయాలని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ డిమాండ్‌చేసింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ శనివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. 'మోదీ పాలనలో దేశ అప్పు ఈ 9 ఏళ్లలో మూడు రెట్లు ఎగసి రూ.155 లక్షల కోట్లకు చేరింది. 2014లో ఈ ప్రభుత్వం వచ్చిననాటి నుంచి లెక్కిస్తే అదనంగా రూ.100 లక్షల కోట్ల అప్పు పెరిగింది. గుజరాత్‌కు సీఎంగా ఉన్న కాలంలో మోదీ.. అసమర్థులు, అవినీతిపరులు, సత్తాలేని వాళ్లు అంటూ ఇతర పార్టీల ప్రభుత్వాలను విమర్శించేవారు. వాస్తవానికి ఈ గుణాలు మోదీకే సరిగ్గా సరిపోతాయి. దేశార్థికాన్ని దారుణంగా దెబ్బతీసి నిరుద్యోగం, ధరల్ని పెంచేశారు. గత 67 ఏళ్లలో 14 మంది ప్రధానులు మొత్తంగా రూ.55 లక్షల కోట్లు అప్పు చేస్తే మోదీ ఒక్కరే రూ.100 లక్షల కోట్లు పెంచేశారు. ఆర్థికవ్యవస్థను సరిదిద్దడమంటే జాతీయమీడియాలో పతాక శీర్షికలకు ఎక్కడం, టెలీప్రాంప్టర్ సాయంతో సుదీర్ఘ ప్రసంగాలు దంచేయడం, వాట్సాప్‌లో సందేశాలు ఫార్వార్డ్ చేయడం లాంటి పనికానే కాదు' అని అన్నారు. ఆదాయ అంతరాలను ఈ ప్రభుత్వం పెంచేసింది. జనాభాలో కేవలం 10 శాతమున్న సంపన్నుల వద్ద ఏకంగా 80 శాతం సంపద పోగుబడింది. జీఎస్టీ వసూళ్లలో వీరి వాటా మూడు శాతమేనన్నారు.



విన్యాసాల్లో పాల్గొన్న యుద్ధ నౌకలు

## సత్తా చాటిన భారత నౌకాదళం

న్యూఢిల్లీ: ఇటీవలికాలంలో ఎన్నడూలేనంతగా భారత నౌకా దళం ఒకేసారి భారీ సంఖ్యలో నౌకలు, జలాంతర్గాములతో యుద్ధవిన్యాసం చేసి ఔరా అనిపించింది. అరేబియా సముద్రం ఇందుకు వేదికైంది. ట్విన్ క్యారియర్ బ్యాటిల్ గ్రూప్(సీబీజీ) ఆపరేషన్స్ పేరిట నిర్వహించిన ఈ యుద్ధవిన్యాసం నౌకాదళ పోరాట పటిమను ప్రపంచానికి మరోమారు తెలియజెప్పిందని భారత నౌకాదళ తర్వాత ఒక వీడియోను ట్విట్‌చేసింది. యుద్ధవిమాన వాహకనౌకలైన ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్‌లుసహా పలు రకాల యుద్ధనౌకలు, జలాంతర్గాములు, 35కుపైగా యుద్ధవిమానాలను సమన్వయం చేసుకుంటూ ఏకకాలంలో ఈ ఆపరేషన్స్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు భారత నౌకాదళం ప్రకటించింది. మిగ్–29కే, ఎంహెచ్ 60ఆర్, కమోవ్, అధునాతన తేలికపాటి హెలికాప్టర్లు సైతం ఈ విన్యాసాల్లో పాలుపంచుకున్నాయని నేవీ అధికారులు శనివారం చెప్పారు. అయితే ఈ ఆపరేషన్స్‌ను ఎప్పుడు నిర్వహించారో వెల్లడించలేదు. సముద్ర ఆధారిత గగనతల శక్తిసామర్థ్యాలు, హిందూమహా సముద్ర జలాలు, ఆవల సైతం భద్రతా భాగస్వామిగా భారత కీలకపాత్రను ఈ ఆపరేషన్ చాటిచెప్పిందని నేవీ ప్రతినిధి వివేక్ మధ్వాల్ వ్యాఖ్యానించారు. దేశీయ తయారీ ఐఎన్ఎస్ విక్రాంత్‌ను సెప్టెంబర్‌లో విధుల్లోకి తీసుకున్నాక చేపట్టిన తొలి భారీ విన్యాసమిది. యుద్ధవిమాన వాహకనౌకలు, జలాంతర్గాములు, ఫ్రిగేట్, డెస్ట్రాయర్, ఇతర నౌకలు, హెలికాప్టర్లు, విమానాలు ఇలా అన్నింటి కలుపుకుంటూ కదనరంగంలోకి దిగితే ఈ బృందాన్ని క్యారియర్ బ్యాటిల్ గ్రూప్(సీబీజీ)/ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్ అంటారు.

## కొనసాగుతున్న భీకర పోరు

**ఉక్రెయిన్‌లో జపొరిజియా ప్లాంట్‌లో చివరి రియాక్టర్ ఆఫ్**

కీవ్: ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధం నిరంతరం కొనసాగుతూనే ఉంది. ఖేర్సన్ దక్షిణ ప్రాంతం, జపొరిజియా పరిధిలో రష్యా సేనలు స్వీయ రక్షణలో పడ్డాయని ఉక్రెయిన్ సైన్యం శనివారం ప్రకటించింది. ఇరాన్ తయారీ షాహీద్ డ్రోన్లు, క్షిపణులు, శతఘ్ని, మోర్టార్ దాడులు పెరిగాయని ఉక్రెయిన్ తెలిపింది. పలు చోట్ల జరిగిన దాడుల్లో శనివారం నలుగురు మరణించారని వెల్లడించింది. ఒడెసాలోని నౌకాశ్రయం వద్ద జరిగిన దాడిలో ముగ్గురు మరణించారు. 24 మంది గాయపడ్డారు. 20కిపైగా షాహీద్ డ్రోన్లు, ఎనిమిది క్షిపణులను కూల్చేశామని ఉక్రెయిన్ తెలిపింది. మరోవైపు యూరప్‌లోనే అతిపెద్ద అణువిద్యుత్‌కేంద్రం జపొరిజియా న్యూక్లియర్‌పవర్ ప్లాంట్‌లో చివరి రియాక్టర్‌ను అధికారులు షట్‌డౌన్ చేశారు. ప్లాంట్ సమీపంలో బాంబుదాడుల బెడద ఎక్కువవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉక్రెయిన్ అణుఇంధన సంస్థ ఎనర్జియాటమ్ తెలిపింది. కేంద్రక విచ్ఛిత్తి చర్య, అత్యధిక ఉష్ణోద్భవం, పీడనాలను ఆపేందుకు ఆరింటిలో చిట్టచివరిదైన ఐదో రియాక్టర్‌లో కూలింగ్ రాడ్లను కోర్‌లోకి దింపేశామని తెలిపింది. దీంతో విద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది. ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఉక్రెయిన్ ఇంధన వ్యవస్థకు సరఫరా చేసే విద్యుత్ లైన్లు దాడుల కారణంగా దెబ్బతిన్నాయి. దీంతో ప్లాంట్ నుంచి బయటకు విద్యుత్ సరఫరా అసాధ్యం. రియాక్టర్ షట్‌డౌన్‌కు ఇదీ ఒక కారణమేనని ఎనర్జియాటమ్ వివరించింది. ఈ ప్రాంతాన్ని ఆక్రమించాక ప్లాంట్ నిర్వహణ బాధ్యత రష్యా చేతికొచ్చింది. మరోవైపు కఖోవ్కా డ్యామ్ పేల్చివేతతో వరదమయమైన ఖేర్సన్‌లో ఇంకా నీరు 4.5 మీటర్ల ఎత్తులో నిలిచే ఉంది. ఈ వారంలో భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో ముంపు ప్రజలకు సహాయక చర్యలకు విఘాతం కలగొచ్చని ఆ ప్రాంత గవర్నర్ ఒలెక్సాండర్ ప్రొకుడిన్ హెచ్చరించారు. దాదాపు 7 లక్షల మంది తాగునీటి కోసం అల్లాడుతున్నారని ఐక్యరాజ్యసమితి సహాయక విభాగం అధిపతి మార్టిన్ ఆందోళన వ్యక్తంచేశారు.

## లుథియానాలో రూ.7 కోట్ల దోపిడీ

**సీఎంఎస్ సెక్యూరిటీ సంస్థ నుంచి ఎత్తుకెళ్లిన దుండగులు**

లుథియానా: పంజాబ్‌లోని లుథియానాలో భారీ దోపిడీ జరిగింది. బ్యాంకులకు సేవలందించే సీఎంఎస్ సెక్యూరిటీస్ కార్యాలయం నుంచి సుమారు రూ.7 కోట్ల నగదును ఆగంతకులు ఎత్తుకుపోయారు. న్యూ రాజ్‌గురు నగర్‌లో ఉన్న సంస్థ ఆఫీసులోకి శనివారం అర్ధరాత్రి దాటాక సుమారు 10 మంది ముసుగులు ధరించిన దుండగులు ప్రవేశించారు. భద్రతా సిబ్బందిని తుపాకీతో బెదిరించి, గదిలో బంధించారు. వారి సెల్‌ఫోన్లను ధ్వంసం చేశారు. అనంతరం అక్కడ దొరికిన సుమారు రూ.7 కోట్ల నగదుతో సీఎంఎస్‌కు చెందిన వ్యానులోనే ఉడాయించారు. సీసీ టీవీ కెమెరాలను కూడా వెంట తీసుకెళ్లారు. చోరీ సమాచారం ఉదయం 7 గంటల సమయంలో పోలీసులకు అందింది. లుథియానా పోలీస్ కమిషనర్ మన్‌దీప్ సింగ్ సిద్ధు ఘటనాస్థలిని పరిశీలించారు. తీసుకెళ్లిన వ్యానును ముల్లన్‌పూర్ దాఖా వద్ద దొంగలు వదిలేసి వెళ్లారని, అందులో రెండు ఆయుధాలు కూడా లభ్యమయ్యాయని ఆయన తెలిపారు. 'సీఎంఎస్ సంస్థ నిర్లక్ష్యం వల్లే దోపిడీ జరిగింది. లాకర్లలో భద్రపరచాల్సి ఉండగా నగదును వ్యానుల్లోనూ, కార్యాలయం గదిలోనూ అజాగ్రత్తగా వదిలేసినట్లు తేలింది. ఘటన సమయంలో సంస్థ సిబ్బందిలో ఇద్దరి వద్ద ఆయుధాలు కూడా ఉన్నాయి. ఎంత నగదు పోయిందనే విషయంలో బాధిత సంస్థ నుంచి ఇంకా స్పష్టత రాలేదు. ఘటనలో లోపలి వ్యక్తుల ప్రమేయం పైనా దర్యాప్తు జరుపుతున్నాం'అని తెలిపారు. కేసును ఛేదించేందుకు యాంటీ గ్యాంగ్‌స్టర్ టాస్క్‌ఫోర్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ సాయం కూడా తీసుకుంటున్నామన్నారు.

### కెనడాలో భారతీయ విద్యార్థులకు ఊరట

**తిరిగి భారత్‌కు పంపడం వాయిదా**

ఒట్టావా: కెనడాలో నిరసన ప్రదర్శనలు చేస్తున్న భారతీయ విద్యార్థులకు గొప్ప ఊరట లభించింది. పంజాబ్‌కు చెందిన లవ్ ప్రీత్ సింగ్ సహా 700 మంది భారతీయ విద్యార్థుల్ని తిరిగి మన దేశానికి పంపడాన్ని కెనడా ప్రభుత్వం వాయిదా వేసింది. తదుపరి నోటీసులు అందేవరకు వారు కెనడాలో ఉండవచ్చునని స్పష్టం చేసింది. ఫోర్జరీ ఆఫర్ లెటర్‌లతో విద్యావకాశాలకు అనుమతి సంపాదించి లవ్ ప్రీత్ సహా ఇతర విద్యార్థులు కెనడాకి వచ్చారని కెనడియన్ బోర్డర్ సర్వీసు ఏజెన్సీ (సీబీఎస్ఏ) విచారణలో తేలింది. దీంతో జూన్ 13లోగా కెనడా వీడి వెళ్లిపోవాలంటూ లవ్ ప్రీత్ సింగ్‌తో పాటు 700 మంది వరకు విద్యార్థులకు నోటీసులు అందాయి. ఒక సంస్థ చేసిన మోసానికి గురైన తాము బాధితులమే తప్ప మోసగాళ్లము కాదని తాము ఎందుకు దేశం విడిచి వెళ్లాలంటూ విద్యార్థులు నిరసన ప్రదర్శనలకి దిగారు. జలంధర్‌కు చెందిన కన్సల్టెంట్ బ్రిజేష్ మిశ్రా కెనడాలోని పెద్ద పెద్ద కాలేజీలు, యూనివర్సిటీల నుంచి తప్పుడు ఆఫర్ లెటర్లు సృష్టించి ఆ విద్యార్థుల్ని ఆరేళ్ల క్రితమే కెనడాకు పంపారు. రాయబార కార్యాలయం కూడా కాలేజీలు ఇచ్చిన లెటర్స్ ఫోర్జరీ అని గుర్తించలేకపోయింది. విద్యార్థులు ఆయా కాలేజీలకు వెళ్లేవరకు అవి ఫేక్ అని తెలియలేదు. ఆ తర్వాత వేరే కాలేజీల్లో సీటు ఇప్పిస్తానని మిశ్రా నమ్మబలికాడు. కెనడాలో శాశ్వత నివాసం కోసం ఆ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నప్పుడు ప్రభుత్వం జరిపించిన విచారణలో కాలేజీల ఆఫర్ లెటర్స్ ఫోర్జరీ అన్న విషయం బయటపడింది. దీంతో బ్రిజేష్ మిశ్రాకు చెందిన ఎడ్యుకేషన్ అండ్ మైగ్రేషన్ సర్వీసెస్‌ను రద్దు చేశారు. అప్పట్నుంచి ఆ విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగానే మారింది.

### ఎన్సీపీకి కొత్తగా కార్యనిర్వాహక అధ్యక్షుల నియామకం



సుప్రియ



ప్రఫుల్

న్యూఢిల్లీ: పార్టీ పగ్గాలు పట్టుకోలేనని శరద్ పవార్ తెగేసి చెప్పడం, అనక విన్నపాలతో వెనక్కి తగ్గిన నేపథ్యంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలోకి కొత్త పదవులు వచ్చాయి. పార్టీ కార్యనిర్వాహ అధ్యక్షులు(వర్కింగ్ ప్రెసిడెంట్) పేరిట సృష్టించిన ఈ పదవులను పవార్ కూతురు, ఎంపీ సుప్రియా సూలే, పార్టీ నేత ప్రఫుల్ పటేల్‌లకు కట్టబెట్టారు. శనివారం ఢిల్లీలో జరిగిన ఎన్సీపీ 24వ పార్టీ వ్యవస్థాపక దినోత్సవంలో శరద్ పవార్ ఈ ప్రకటన చేశారు.

**అజిత్ పవార్ సమక్షంలోనే..**

శరద్ పవార్ తర్వాత పార్టీలో నంబర్ 2గా పేరొందిన సీనియర్ నేత అజిత్ పవార్‌కు ఈ పదవి దక్కుతుందని అంతా భావించారు. అనూహ్యంగా సుప్రియ, ప్రఫుల్ పేర్లు తెరమీదకొచ్చాయి. అజిత్ సమక్షంలోనే శరద్ ఈ ప్రకటన చేశారు. ప్రకటన సమయంలో అజిత్ ముఖంలో అసంతృప్తి కనిపించింది. దీంతో వెంటనే ఆయన మీడియాతో మాట్లాడకుండానే హడావిడిగా వెళ్లిపోయారు. 'పవార్ నిర్ణయంతో ఆశ్చర్యానికి గురయ్యా. అయినాసరే పార్టీ కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తా. పార్టీని మరింత బలోపేతం చేస్తా' అని ప్రఫుల్ పటేల్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పటేల్‌కు మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్తాన్, జార్ఖండ్, గోవా, రాజ్యసభ వ్యవహారాల బాధ్యతలు అప్పజెప్పారు. సుప్రియకు మహారాష్ట్ర, హరియాణా, పంజాబ్, మహిళ, యువత, విద్యార్థి, లోక్‌సభ వ్యవహారాల బాధ్యతలు ఇచ్చారు.

**ఇప్పుడైతే ఖాళీ లేదు**

సుప్రియకు పదవి దక్కడంపై అజిత్ పవార్ అసంతృప్తిగా ఉన్నాడన్న వార్తపై శరద్ పవార్ స్పష్టతనిచ్చారు. 'పదవికి సుప్రియ పేరును సిఫార్సు చేసిందే అజిత్. అలాంటపుడు ఇందులో అజిత్ సంతోషపడ్డారు, అసంతృప్తిగా ఉన్నారు అనే మాటే లేదు. ఇది పార్టీ నిర్ణయం. నా నిర్ణయం కాదు. నా సొంత నిర్ణయమే అయితే ఇన్నాళ్లు ఎందుకు ఆగుతాను?' అని పవార్ అన్నారు. భవిష్యత్తులో పార్టీ చీఫ్‌గా ఎవరు ఉంటారన్న మీడియా ప్రశ్నకు బదులిచ్చారు. 'ప్రస్తుతమైతే అలాంటి ఖాళీలైతే లేవు. ఖాళీ ఏర్పడినప్పుడు మనం ఈ విషయం మాట్లాడుకుందాం' అని అన్నారు.

# బెడ్ రూమ్ నుంచి బాత్‌రూమ్ వరకు

- రహస్య పత్రాలను గుట్టలు గుట్టలుగా దాచిన ట్రంప్
- అభియోగాలతో పాటు ఫొటోలు కోర్టుకు సమర్పణ



ట్రంప్ ఎస్టేట్‌లోని బాత్‌రూంలో పత్రాల బాక్సులు

మయామి: అమెరికా రహస్య పత్రాల కేసులో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై నమోదైన నేరాభియోగాల్లో ఎన్నో ఊహకందని అంశాలు చోటు చేసుకున్నాయి. ట్రంప్ తనతో పాటు గుట్టలు గుట్టలుగా రహస్య పత్రాలను కార్డ్‌బోర్డ్ బాక్సుల్లో ఉంచి ఫ్లోరిడాలోని మార్ ఏ లాగో ఎస్టేట్‌లో ఉంచారు. ఆ ఎస్టేట్‌లో ఆయన ఆ పత్రాలను ఉంచని స్థలమే లేదంటే అతిశయోక్తి కాదు. బెడ్ రూమ్, బాల్‌రూమ్ (డ్యాన్సులు చేసే గది), బాత్‌రూమ్, ఆఫీసు రూమ్, స్టోరేజీ రూమ్ ఇలా ప్రతీ చోటా దాచి ఉంచారు. చివరికి టాయిలెట్‌లో షవర్‌పైన, సీలింగ్‌లో ఆ బాక్సుల్ని ఉంచడం ఫొటోల్లో కనిపించింది. కీలకమైన పత్రాలను కూడా ట్రంప్ నిర్లక్ష్యంగా నేలపై పడేశారని అభియోగాల్లో వివరించారు. మొత్తం 13 వేలకు పైగా రహస్య పత్రాలు ట్రంప్ ఎస్టేట్‌లో లభిస్తే, అందులో 300 పత్రాలు అత్యంత రహస్యమైనవి ఉన్నాయి. ప్రాసిక్యూషన్ ట్రంప్‌పై 37 అభియోగాలను నమోదు చేసింది.

**ఆ పత్రాల్లో ఏముందంటే..?**

ప్రభుత్వానికి చెందిన అత్యంత రహస్య ప్రాంతాల్లో దేశ భద్రత, సైనిక వ్యవస్థకి సంబంధించిన కీలక సమాచారం ఉంది. అమెరికా అణు కార్యక్రమాలు, అమెరికా, ఇతర దేశాలకు సంబంధించిన ఆయుధ సంపత్తి, అమెరికా దాని మిత్రదేశాలకు పొంచి ఉన్న మిలటరీ ముప్పు, ప్రతీకారంగా చేయబోయే ఎదురు దాడులకు సంబంధించిన వ్యూహరచనలు వంటివి ఉన్నాయి. ట్రంప్ శ్వేతసౌధం ఖాళీ చేసి వెళ్లిన తర్వాత ఏడాది పాటు ఆ పత్రాలన్నీ ఎస్టేట్‌లోనే ఉన్నాయని, రోజూ వేలాది మంది అతిథులు వచ్చే ఆ ఎస్టేట్‌లో ప్రభుత్వ రహస్యాలు ఎన్ని బయటకు పొక్కాయోనని ప్రాసిక్యూటర్ ఆందోళన వ్యక్తం చేశారు. వైట్ హౌస్ ఖాళీ చేసే సమయంలో ట్రంపే ఆ పత్రాలన్నీ బాక్సుల్లో సర్దినట్టు ప్రాసిక్యూషన్ ఆరోపిస్తోంది.

**ప్రైవేటు వ్యక్తులతో పంచుకున్నారా ?**

ఒక ప్రైవేటు పార్టీలో ట్రంప్ రహస్య పత్రాల్లోని సమాచారాన్ని కూడా పంచుకున్నట్టుగా అభియోగాల్లో పేర్కొన్నారు. ఇరాన్‌పై అమెరికా దాడికి సన్నాహాలు చేస్తోందంటూ సున్నితమైన సమాచారాన్ని ట్రంప్ తన పొలిటికల్ యాక్షన్ కమిటీలో ఉన్న వ్యక్తులతో 2021లో జరిగిన ఒక పార్టీలో పంచుకున్నట్టుగా అభియోగాల్లో పేర్కొన్నారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో అమెరికా మిలటరీ ఆపరేషన్ చేపట్టాలనుకుంటున్న ఒక దేశం మ్యాప్‌ను చూపిస్తూ ఏదో మామూలు సమాచారమంటూ షేర్ చేసుకున్నట్టు అభియోగాలు నమోదయ్యాయి.

**ఆడియో సంభాషణలతో బిగుస్తున్న ఉచ్చు?**

ట్రంప్‌పై నమోదైన అభియోగాలతో పాటు సాక్ష్యాల కింద వీడియోలు, ట్రంప్ అనుచరులతో మాట్లాడిన ఆడియో సంభాషణలు, ఫోన్ మెసేజ్‌లు ప్రాసిక్యూషన్ కోర్టుకు సమర్పించింది. ఆ ఆడియో టేపుల్లో ట్రంప్ ''ఆ బాక్సుల్ని ఎవరూ చూడొద్దు. అసలు ఇక్కడ ఏమీ లేవని వారికి చెబితే సరి. వారి ప్రశ్నలకు బదులివ్వకపోతే ఇంకా మేలు. వారితో ఆడుకోవడం మంచిది కాదు'' వంటివి ఉన్నాయి.



**విగ్రహావిష్కరణ**

కరీంనగర్‌కల్చరల్: పద్మశ్రీ శ్రీభాష్యం విజయ సారథి విగ్రహాన్ని శనివారం యజ్ఞవరాహ క్షేత్రం లోని ఆవరణలో వేదపండితులు ఆవిష్కరించారు.



**లక్ష రుణం దక్కేనా?**

జీసీ బంధు పథకానికి రేషన్ కార్డు అవరోధంగా మారింది. ఆన్‌లైన్ దరఖాస్తులో ఆధార్ కార్డుకు రేషన్‌కు లింకు లేకపోవడంతో అనర్హులుగా రిజెక్టు అవుతున్నాయి. 8లో▸

**గరిష్టం/కనిష్టం 41.0/28.0**

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమవుతుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### కరీంనగర్ డివిజన్ తపాలా శాఖకు అవార్డులు



అవార్డు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ డివిజన్ తపాలా శాఖ బెస్ట్ ఓవరాల్ పర్ఫామెన్స్‌లో రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచి అవార్డు దక్కించుకుంది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ (సీపీఎంజీ) కె.ప్రకాష్, పోస్ట్ మాస్టర్ జనరల్ (పీఎంజీ) పీవీఎస్ రెడ్డి, శ్రీలత చేతుల మీదుగా కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు అవార్డు స్వీకరించారు. అలాగే ఐపీపీబీ జనరల్ ఇన్సూరెన్స్ పర్ఫామెన్స్‌లో కూడా కరీంనగర్ డివిజన్ పోస్టల్ శాఖ అవార్డు సాధించింది.

### ధరణితో సమస్యలు పెరిగాయి

- ప్రొఫెసర్ కోదండరాం



సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

విద్యానగర్(కరీంనగర్): ధరణితో సమస్యలు మరింత పెరిగాయని, రాష్ట్రవ్యాప్తంగా లక్ష యాభైవేల కుటుంబాలు నష్టపోయాయని తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. శనివారం కరీంనగర్ ఫిలింభవన్‌లో ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఆధ్వర్యంలో 'ధరణి ఒక చీడ–పీడ' పేరుతో రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భూముల రిజిస్ట్రేషన్లలో అవినీతికి అడ్డుకట్ట వేయడం దేవుడెరుగు మరింత అవినీతి పెరిగిందన్నారు.హైదరాబాద్‌కు చెందిన సాధిక్ ఫౌండేషన్ బాధ్యుడు, సామాజిక వేత్త సాధిక్ అలీ మాట్లాడుతూ ధరణి ఒక చీడగా పీడగా మారిందన్నారు. ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ మాట్లాడుతూ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి మాట్లాడుతూ ధరణి సమాజానికి ఉపయోగపడేది కాదన్నారు.

### ఉదయించే సూర్యుడు గురువు



మాట్లాడుతున్న చినజీయర్‌స్వామి

కరీంనగర్‌కల్చరల్: ప్రతి గురువు ఉదయించే సూర్యుడి లాంటివాడని, విద్యార్థుల భవిష్యత్‌ను ప్రకాశింపజేయాలని త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. శనివారం వీకన్వెన్షన్ హాల్‌లో వికాస్ తరంగిణి, ట్రస్మా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యావేత్తల సమ్మేళనంలో మాట్లాడారు. సూర్యుడు వారం రోజుల కనిపించకుంటే ప్రపంచమే చీకటిలా మారుతుందన్నారు. అదే సూర్యుడు వారం తరువాతే బయటికి వస్తే ప్రతి ఒక్కరిలో నూతన ఉత్తేజం వస్తుందన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించినప్పుడే భవిష్యత్‌కు మంచి సమాజాన్ని అందించగలుగుతామన్నారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలను కరీంనగర్ జిల్లా నుంచి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఇ.ప్రసాదరావు, రమణారావు, శ్రీనివాస్‌రావు, సొగాని కొమురయ్య, దాసరి శ్రీపాల్‌రెడ్డి, ట్రస్మా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### 12న పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 2కే రన్

కరీంనగర్‌క్రైం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు ఆధ్వర్యంలో ఈ నెల 12న 2కే రన్ నిర్వహించనున్నట్లు కరీంనగర్ టౌన్ ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు ప్రకటనలో తెలిపారు. 2కే రన్ అంబేద్కర్ స్టేడియంలో ప్రారంభమై కరీంనగర్ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ముగుస్తుందని పేర్కొన్నారు. అందరూ రన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. 2కే రన్‌కు మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వివరించారు.

సండే స్పెషల్

# కుడి ఎడమైతే.. ప్రమాదమేనోయ్!

- ఇండియాలో కుడి, విదేశాల్లో ఎడమ డ్రైవింగ్
- పెరుగుతున్న అంతర్జాతీయ లైసెన్స్‌లు
- ఐటీ, విదేశీ విద్యతో అధికమవుతున్న డిమాండ్




- వాహనదారులకు, పౌరులకు రోడ్డు భద్రతపై ప్రచారం, అవగాహన కల్పించే ఓ రవాణాశాఖ అధికారి విదేశాలకు వెళ్లినప్పుడు డ్రైవింగ్ చేశాడు. యూటర్న్ తీసుకుని అలవాటు ప్రకారం వాహనాన్ని ఎడమకు తిప్పారు. అది 150 కిలోమీటర్ల స్పీడ్ ఉన్న రోడ్డు అదృష్టం కొద్దీ ఎదురుగా ఏ వాహనం రాలేదు.
- ఇటీవల విదేశాల నుంచి ఇండియాకు వచ్చిన ఓ వాహనదారుడు విదేశాల అలవాటు ప్రకారం కరీంనగర్ రోడ్డుపై కుడివైపు నుంచి కారును నడిపి భారీ ప్రమాదానికి కారణమయ్యాడు.



### కొత్తలో గందరగోళం

కొత్తలో డ్రైవింగ్ చేసేటప్పుడు సహజంగా కొంత భయం ఉన్నప్పటికీ సరిగానే నడపగలిగా. ఒకసారి నా కారు ఇంకో కారును తాకినప్పటికీ పెద్దగా నష్టం జరగలేదు. ఇండియాలో వాహనానికి కుడి పక్కన స్టీరింగ్ ఉంటే అమెరికాలో ఎడమ పక్కన స్టీరింగ్ ఉంటుంది. కొత్తగా అమెరికా వచ్చిన వారికి కొంత కన్ఫ్యూజన్ ఉంటుంది. ఇక్కడి నిబంధనల ప్రకారం ముందుగా ఆన్‌లైన్ టెస్ట్ అయ్యాక డ్రైవింగ్ టెస్ట్ కోసం రోడ్డుపై వాహనం నడపాల్సి ఉంటుంది. సరిగా నడుపుతున్నారా పరిశీలిస్తారు. సరిగ్గా చేస్తేనే లైసెన్స్ జారీ చేస్తారు.

– నంగునూరి సాయి రతన్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, సిటీ బ్యాంక్, డల్లాస్

### అమెరికాకు వెళ్లే ముందు..



మాది కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మక్తపల్లి. 2011లో ఉద్యోగరీత్యా అమెరికా వచ్చా. అమెరికాకు వచ్చే ముందు తిమ్మాపూర్‌లోని రవాణా కార్యాలయంలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న. ఐదేళ్ల వ్యాలిడిటీ ఇచ్చారు. తర్వాత అమెరికాలో డ్రైవింగ్ లైసెన్స్ పొందా. మూడేళ్లకోసారి వీసాకాలం ముగిసేసరికి రెన్యూవల్ చేయించుకుంటున్న. ఇండియాలో కుడివైపు డ్రైవింగ్ స్టీరింగ్ ఉంటే అమెరికాలో ఎడమ వైపు ఉంటుంది. అందుకే ఇక్కడ లైసెన్స్‌కు ప్రాధాన్యత ఉంది.

– చింతం నరేందర్, అమెరికా

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కుడి, ఎడమైతే పొరపాటు లేదోయ్..ఓడిపోలేదోయ్ అన్నాడో సినీ కవి. కానీ...అంతర్జాతీయ డ్రైవింగ్ విషయంలో అలాకాదు.. కుడి ఎడమైనా.. ఎడమ కుడి అయినా.. ప్రమాదాలు జరుగుతాయ్..ప్రాణాలు పోతాయ్.. అంటున్నారు రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారులు. తాజాగా ఒడిశాలోని రైలు ప్రమాదం కూడా ఇదేవిధంగా ఒక ట్రాక్‌లో వెళ్లాల్సిన రైలు మరో ట్రాకుపై వెళ్లడంతోనే జరిగిందని ప్రచారం జరుగుతున్న వేళ.. ఒక దిశలో వెళ్లాల్సిన వాహనం మరో దిశలో పొరపాటునో, గ్రహపాటునో వెళ్తే ఎంతటి భారీ ప్రమాదం జరుగుతుంది? ఎన్ని ప్రాణాలు గాలిలో కలుస్తాయో చెప్పకనే చెప్పింది. కొన్నేళ్లుగా ఉద్యోగాల కోసం హైదరాబాద్, పలు జిల్లాల నుంచి ఐటీ నిపుణులు, ఉన్నత విద్య కోసం విద్యార్థులు విదేశాల బాట పడుతున్నారు. అగ్రరాజ్యాలు కాబట్టి అక్కడ వ్యక్తిగత వాహనాల వినియోగం అధికం. అక్కడ డ్రైవింగ్ చేసేందుకు వీలుగా మనవాళ్లు ఇక్కడే అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలి. కాబట్టి, విదేశాలకు వెళ్లే వారంతా అక్కడ డ్రైవింగ్ చేసేందుకు వీలుగా అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సులు తీసుకుంటున్నారు. కొన్నేళ్లుగా వీటికి డిమాండ్ పెరిగింది. ఈనేపథ్యంలో రోడ్డు నిబంధనలు కూడా ముఖ్యమే అన్న సంగతి చాలామంది మరిచిపోతున్నారు. దీంతో విదేశాల్లో డ్రైవింగ్ చేసే సమయంలో చిన్న పొరపాటు చేసినా దిద్దుకోలేని తప్పుగా మారే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### ముందు సాధన చేయాలి



విదేశాలకు వెళ్లిన ప్రతీ భారతీయుడికి మొదట్లో ఎదురయ్యే సమస్యే ఇది. చూసేందుకు చిన్నదిగా కనిపించినా క్షణాల్లో భారీ ప్రాణనష్టం జరిగే ప్రమాదం అధికం. ముందుగా అక్కడి రోడ్డు నిబంధనలు అలవాటు అయ్యే వరకు అక్కడ వాహనాలపై సాధన చేయాలి. అక్కడి రోడ్డు నిబంధనలపై పట్టు వచ్చాకే డ్రైవింగ్ చేయాలి.

– పుప్పాల శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్, ఆర్టీఏ

### జత చేయాల్సిన పత్రాలు

ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, వెళ్లాలనుకునే దేశం జారీచేసిన వీసా(తప్పనిసరి కాదు), రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఫారం–1ఎ పత్రాలు, రూ.1700 ఆన్‌లైన్‌లో చెల్లించిన రసీదు

**ఏడాది వ్యవధిలో జారీ అయిన లైసెన్స్‌లు**

2022 మేలో 34, జూన్‌లో 70, జూలైలో 142, ఆగస్టులో 167, సెప్టెంబర్‌లో 92, అక్టోబర్‌లో 42, నవంబర్‌లో 44, డిసెంబర్‌లో 160, ఈ ఏడాది జనవరిలో 84, ఫిబ్రవరిలో 48, మార్చిలో 32, ఏప్రిల్‌లో 59, మేలో 77 లైసెన్స్‌లు జారీ అయ్యాయి.

### ఏంటి సమస్య?



సాధారణంగా ఇండియా రోడ్డు నిబంధనల ప్రకారం రోడ్డుకు ఎడమ వైపు వాహనాలు ప్రయాణిస్తాయి. అందుకే మనం 'ఆల్వేస్ కీప్ లెఫ్ట్'' అన్న సూచికలు పెడుతుంటాం. రోడ్డు భద్రత విద్యలో భాగంగా పాఠ్యపుస్తకాల్లోనూ ఎడమవైపు వెళ్లాలనే చదువుకున్నాం. ఇక్కడ పుట్టి పెరిగిన వారంతా వాహనాలను ఎడమ వైపు నడుపుతారు. ఇండియాలో పుట్టి పెరిగిన కొందరు విదేశాల్లో కొన్నిరోజులు ఉండాల్సి వచ్చినప్పుడు డ్రైవింగ్ అనివార్యమవుతుంది. పైగా మనకు అక్కడి పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉంటుంది. అక్కడ రహదారులు 120, 150 కిమీల వేగానికి అనుగుణంగా రూపొందించి ఉంటాయి. అక్కడ డ్రైవింగ్ చేసే సమయంలో పొరపాటున ఎడమవైపు వెళ్లారో ఇక అంతే.. భారీ విషాదానికి మీరే బాధ్యులుగా మిగిలిపోతారు. ఇక రెండో రకం సమస్య ఏంటంటే.. ఇండియాలో పుట్టి పెరిగి విదేశాల్లో స్థిరపడ్డ వారిలో కొందరు సెలవులకు ఇండియాకు వచ్చిన సమయంలో పొరపాటున కుడి వైపునకు వాహనాలను జోరుగా దూకిస్తారు. ఫలితంగా జరగరాని అనర్థాలు క్షణాల్లో జరిగిపోతాయి. ఏ దేశానికి వెళ్లినా ముందుగా అక్కడ రోడ్డు నిబంధనల ప్రకారం సాధన చేయాలి. డ్రైవింగ్ వచ్చు కదా అని తొందరపడితే భారీ మూల్యం చెల్లించకతప్పదని ఆర్టీఏ అధికారులు హెచ్చరిస్తున్నారు.

### అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఎందుకు?

విదేశాల్లో విద్య, ఉపాధి కోసం వలస వెళ్లే వారికి ఈరోజుల్లో అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. వీటిని దేశంలో ఎక్కడైనా తీసుకోవచ్చు. ఈ డ్రైవింగ్ లైసెన్స్‌ను చూపించి ప్రపంచంలో ఎక్కడైనా దాదాపు ఏడాదికాలం అక్కడి రోడ్డు నిబంధనల ప్రకారం డ్రైవింగ్ చేసుకునే వీలు కలుగుతుంది. అన్ని దేశాల్లో వెంటనే వాహనం తీసేందుకు అంగీకరించరు. కొందరు ముందుగా స్థానికంగా తమ రోడ్లపై నడపగలరు అని నిరూపించుకునేందుకు కొన్ని పరీక్షలు పాసవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాతే డ్రైవింగ్‌కు అనుమతిస్తారు. ఏడాదిపాటు వ్యాలిడిటీ ఉండే ఈ లైసెన్స్‌ను కాల పరిమితి ఆధారంగా రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు పరివాహన్.గవ్.ఇన్ (https://www. parivahan.gov.in) హెచ్‌టీటీపీఎస్: //డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీఏఆర్ఐవీఏహెచ్ఏఎన్.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా ఆర్టీఏ కార్యాలయంలో పలు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

## లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

- అదనపు జిల్లా జడ్జి శ్రీవాణి




మాట్లాడుతున్న జడ్జి శ్రీవాణి

కరీంనగర్‌క్రైం: లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించుకుంటే సత్వర న్యాయం లభిస్తుందని మొదటి అదనపు జిల్లా జడ్జి శ్రీవాణి అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కోర్టులో దాఖలై ఉన్న కేసుల్లో ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగడం కన్నా రాజీ ద్వారా పరిష్కరించుకుంటే డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. ప్రజల్లో లోక్ అదాలత్‌లపై అవగాహన పెరిగి ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించుకుంటున్నారని వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, న్యాయమూర్తి అరుణ మాట్లాడుతూ, పట్టింపులకు పోకుండా ఇరు పార్టీలవారు లోక్ అధాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. న్యాయమూర్తులు కుమార్, వివేక్, లక్ష్మి కుమారి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు మాట్లాడారు. అదనపు జిల్లా జడ్జి సాధన, ఏసీపీ మదన్‌లాల్, ఏపీపీ గౌరు రాజిరెడ్డి, కక్షిదారులు పాల్గొన్నారు.

**1,851 కేసులు పరిష్కారం**

జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లలో 1,851 కేసులు పరిష్కారం అయినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, జడ్జి అరుణ తెలిపారు. వీటిలో క్రిమినల్ కేసులు 1,779, సివిల్ 6, ప్రీ లిటిగేషన్ 36, మోటారు యాక్సిడెంట్ పరిహారం 30 కేసులు ఉన్నాయి. మోటార్ యాక్సిడెంట్ పరిహారం కేసుల్లో బాధితులకు రూ.1.66 కోట్లు ఇచ్చేందుకు ఇన్సూరెన్స్ కంపెనీలు అంగీకరించాయి.

## చెత్తను తగ్గించే 'పునరాలోచన'

- ప్రతి శనివారం కార్యక్రమం
- బల్దియాలో సెంటర్ ప్రారంభం



ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: ఇళ్లలోని నిరుపయోగ వస్తువులు డ్రైనేజీలు, డంప్‌యార్డుల్లోకి చేరకుండా రీయూజ్, రీసైకిల్ ద్వారా చెత్తను తగ్గించే ఆలోచనల్లోంచి వచ్చిన 'పునరాలోచన' కార్యక్రమానికి శనివారం నగరపాలకసంస్థ శ్రీకారం చుట్టింది. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఇకనుంచి ప్రతి శనివారం ఈ పునరాలోచన దినం పాటించనున్నారు. ఇప్పటికే ఉన్న రెడ్యూజ్, రీయూజ్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) సెంటర్లకు కొనసాగింపుగా ఈ పునరాలోచన (రీ థింకింగ్) చేపట్టారు. ఇళ్ల నుంచి సేకరించిన పాత, చెత్త సామగ్రిని అవసరమైన మేర రీయూజ్ చేస్తారు. అవసరం ఉన్న నిరుపేదలకు దుస్తులు, వస్తువులు అందజేస్తారు. మిగిలిన సామగ్రిని రీసైకిల్‌కు అప్పగిస్తారు. నగరపాలక కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ విభాగాల అధి కారులు, శానిటేషన్, మెప్మా సిబ్బందితో మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రతిజ్ఞ చేయించారు.

**142 కిలోల సామగ్రి సేకరణ**

పునరాలోచన సెంటర్ ద్వారా శనివారం ఒక్కరోజు 32 కిలోల ప్లాస్టిక్, 46 కిలోల పాత దుస్తులు, 26 కిలోల పుస్తకాలు, 38 కిలోల చెప్పులు, షూ సేకరించారు. ఇందులో నుంచి దుస్తులను అవసరమైన నిరుపేదలకు అందజేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇతరత్రా దుస్తులు, ప్లాస్టిక్ డబ్బాలు, బ్యాగులు, చెప్పులు, ఎలక్ట్రికల్ వస్తువులను రీయూజ్, రీసైకిల్ కోసం సంబంధిత నిర్వాహకులకు అప్పగించారు.

**సెంటర్లలో అప్పగించాలి: మేయర్ సునీల్‌రావు**

ఇళ్లలో ఉండే నిరుపయోగ వస్తువులను ఆర్ఆర్ఆర్, పునరాలోచన సెంటర్లలో అప్పగించాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు నగర ప్రజానీకానికి పిలుపునిచ్చారు. శనివారం నగరపాలక కార్యాలయంలో పునరాలోచన సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. నగరంలో ఆర్ఆర్ఆర్ సెంటర్లను నిరంతరం కొనసాగిస్తూ నిరుపయోగ వస్తువులను సేకరించడం జరుగుతుందని తెలిపా రు. రీయూజ్, రీసైకిల్ ప్రక్రియను సమర్థవంతంగా కొనసాగించినందున రాష్ట్ర ప్రభుత్వం నగరపాలికకు అవార్డు ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ ప్రక్రియ ద్వారా పర్యావరణ పరిరక్షణకు సహకరించిన వాళ్లమవుతామన్నారు. ఏటా వర్షకాలం వచ్చిందంటే రూ.లక్షలు వెచ్చించి సిల్టు తొలగిస్తున్నామని, సిల్ట్ తొలగించే సమయంలో చాలా వస్తువులు డ్రైనేజీల్లో రావడం జరుగుతుందన్నారు. అలా డ్రైనేజీలు, పరిసరాల్లో వస్తువులను పడేయకుండా ఆర్ఆర్ఆర్, పునరాలోచన సెంటర్‌కు అప్పగించాలన్నారు. కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్లు తోట రాములు, షరీఫొద్దీన్, అదనపు కమిషనర్ స్వరూపరాణి, డిప్యూటీ కమిషనర్ త్రయంభకేశ్వర్, అసిస్టెంట్ కమిషనర్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు నుంచి వైద్య కళాశాల తరగతులు

- మంత్రి గంగుల కమలాకర్



సుపరిపాలన వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి కమలాకర్

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ వైద్య కళాశాల తరగతులను వంద మంది విద్యార్థులతో ఆగస్టు నుంచి ప్రారంభించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. కళాశాల తాత్కాలిక తరగతి గదుల కోసం కొత్తపల్లిలోని సీడ్ కంపెనీ గోదాంల్లో చేపడుతున్న ఆధునీకరణ పనులను శనివారం కలెక్టర్ కర్ణన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, త్వరలోనే శాశ్వత భవన నిర్మాణ పనులు చేపట్టి వైద్య కళాశాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కళాశాలతో హైదరాబాద్, వరంగల్ తర్వాత కరీంనగర్ మెడికల్ హబ్‌గా మారనుందని పేర్కొన్నారు. లక్షల రూపాయలు వెచ్చించి వైద్య విద్యను అభ్యసించలేని నిరుపేదలకు ఇది ఒక వరం అన్నారు. మేయర్ సునీల్‌రావు, జెడ్పీ సీఈఓ ప్రియాంక కర్ణన్, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేని మధు పాల్గొన్నారు.

**స్వరాష్ట్రంలో సుపరిపాలన**


ఉమ్మడి పాలనలో వెనకబడ్డ తెలంగాణ స్వరాష్ట్రంలో సుపరిపాలనతో అద్భుత ఫలితాలు సాధిస్తోందని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కొత్తపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సుపరిపాలన వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. కొత్తపల్లి మండలంగా ఏర్పడక ముందు ఎలా ఉండేది, ప్రస్తుతం ఎలా ఉందో కళ్లకు కట్టినట్లు కనిపిస్తోందన్నారు. స్వయం పాలనలో తీసుకున్న చర్యలతో కొత్తపల్లి మండలం రెండుసార్లు అవార్డు అందుకోవడం సంతోషదాయకమన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన చేరుకుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్, జెడ్పీటీసీ పిట్టల కరుణరవీందర్, జెడ్పీ కోఆప్షన్ సాబీర్ పాషా, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, డీటీ శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం అధికారులను ఎంపీపీ, ఎంపీడీఓలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సన్మానించారు.

### రూ.2వేల కోట్లతో నగర అభివృద్ధి

కరీంనగర్ కార్పొరేషన్: తెలంగాణ వచ్చాక సుమారు రూ.2 వేల కోట్ల నిధులతో కరీంనగర్ నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. శనివారం నగరంలోని 20, 21 డివిజన్‌ల పరిధిలో రూ.10 లక్షలతో చేపట్టే ముదిరాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి, 23వ డివిజన్ ఆదర్శనగర్‌లో రూ.32 లక్షలతో నిర్మించనున్న మహిళా సంఘ భవన రెండో అంతస్తు, మౌలిక వసతుల కల్పన పనులకు మేయర్ సునీల్‌రావుతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కరీంనగర్‌పై ఉన్న ప్రత్యేక అభిమానంతో సీఎం కేసీఆర్ భారీగా నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. కార్పొరేటర్లు తుల రాజేశ్వరి బాలయ్య, జంగిలి సాగర్, అర్ష కిరణ్మయి మల్లేశం, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్–1 పరీక్షలకు 16,829 మంది

- జిల్లాలో 34 కేంద్రాలు
- సెంటర్ల వద్ద 144 సెక్షన్
- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

సప్తగిరికాలనీ(కరీంనగర్): జిల్లాలో నేడు జరగనున్న గ్రూప్– 1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 34 కేంద్రాలను సిద్ధం చేశామని, 16,829 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, 10.15 గంటల లోపు అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలని, తర్వాత అనుమతించరాదని ఆదేశించారు. కేంద్రానికి వచ్చే లైజనింగ్ అధికారి, చీఫ్ సూపరింటెండెంట్ మినహా మిగతా సిబ్బంది, అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్‌లు తీసుకురావొద్దన్నారు. సీపీ సుబ్బారాయుడు మాట్లాడుతూ, కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రతి అభ్యర్థి హాల్ టికెట్, గుర్తింపు కార్డులను పరిశీలించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ జగత్‌సింగ్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**క్షుణ్ణంగా తనిఖీ చేయాలి**

కరీంనగర్‌క్రైం: గ్రూప్– 1 పరీక్ష రాసే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపాలని అదనపు డీసీపీ (లాఅండ్‌ఆర్డర్) ఎస్.శ్రీనివాస్ అన్నారు. బందోబస్తు డ్యూటీ నిర్వహించే పోలీసులకు శనివారం కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఆవరణలో పలు సూచనలు చేశారు. పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులను ఉదయం 10.15 గంటల లోపు కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. పరీక్ష జరుగుతున్న ప్రాంతాల్లో ధర్నాలు, సమావేశాలు నిర్వహించకూడదని, ఏదైనా అవసరం ఉంటే సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీలు తుల శ్రీనివాసరావు, కరుణాకర్‌రావు, ఎస్బీఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ సురేష్, సీఐలు తిరుమల్, పుల్లయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గుండెపోటుతో వృద్ధుడి మృతి

- డీసీసీ అధ్యక్షుడి పుట్టినరోజు వేడుకల్లో ఘటన


మల్లేశం మృతదేహం

మానకొండూర్: డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పుట్టినరోజు వేడుకల్లో ఓ వృద్ధుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మానకొండూర్ మండలంలోని ముంజంపల్లి శివారు ఓ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ నాయకులు శనివారం సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా వేడుకలు నిర్వహించారు. అక్కడే ఉన్న తిమ్మాపూర్ మండలంలోని అల్గునూర్‌కు చెందిన ఆవునూరి మల్లేశం(60) అస్వస్థతకు గురై, గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### పీజీఈసెట్‌లో 'వాగేశ్వరి' విద్యార్థుల ప్రతిభ

తిమ్మాపూర్(మానకొండూర్): పీజీఈసెట్‌లో వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎం.ఫార్మసీ కోర్సులో ప్రవేశానికి రాష్ట్రస్థాయిలో మే 29న పరీక్ష నిర్వహించగా ఫలితాలు ఈ నెల 8న విడుదలయ్యాయి. కళాశాలకు చెందిన హారిక-22, వెంకటసాయిలక్ష్మి-292, చీకిత-502, సామ సుల్తానా-726, శ్రీవిద్య-878, వైశాలి-899, అక్షిత-902, లత-913, ఆఫ్రిన్ బేగం-957 ర్యాంకులు సాధించారని కళాశాల సెక్రటరీ డాక్టర్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను అభినందించారు. సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు ప్రకాశ్‌రెడ్డి, వినోద్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి కోసం నిరసన



శంకరపట్నం(మానకొండూర్): తాడికల్‌లో శనివారం తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. స్థానిక 5వ వార్డుకు తాగునీరు సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కోసం ఇబ్బంది పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం స్పందించి, ట్యాంకర్ ద్వారా నీటిని తీసుకురావడంతో శాంతించారు.

# లక్ష రుణం దక్కేనా?

- బీసీ బంధుకు రేషన్ కార్డు లింకు
- ఆన్‌లైన్‌లో యాక్సెప్ట్ కాని దరఖాస్తులు
- వేలమంది యువతలో ఆందోళన

"'కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌కు చెందిన కోడూరు నవీన్ ఇటీవల ఆదాయ ధ్రువీకరణ పత్రం తీసుకున్నారు. వృత్తి పనుల కింద ప్రభుత్వం ఇస్తున్న లక్ష రుణానికి దరఖాస్తు చేసేందుకు మీసేవకు వెళ్తే ఆధార్ కార్డు ఆప్షన్ వద్ద లింక్ చేస్తే రేషన్ కార్డు లేదని, పథకానికి అనర్హుడివని దరఖాస్తు రిజెక్ట్ అయింది. ఇదెక్కడి అన్యాయమని అధికారులను కలిస్తే ఆన్‌లైన్‌లో ఉన్న నిబంధనల ప్రకారమే చేయాలని ఉచిత సలహానిచ్చారు. ఇది ఒక నవీన్ సమస్య కాదు.. జిల్లాలో వేలమంది యువత ఎదుర్కొంటున్న సమస్య. నాలుగేళ్లుగా రేషన్‌కార్డుల జారీ లేకపోవడం పెను సమస్యగా మారింది'."

కరీంనగర్ అర్బన్: బీసీ బంధు పథకానికి రేషన్ కార్డు ప్రధాన అవరోధంగా మారింది. నాలుగేళ్లుగా కొత్త కార్డుల జారీ లేకపోవడంతో వేలమంది అరిగోస పడుతున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులో ఆధార్ కార్డుకు రేషన్ కార్డుకు లింకు లేకపోవడంతో అనర్హులుగా రిజెక్టు అవుతున్నాయి. కార్డు ఉంటేనే పథకానికి అర్హులు కాగా ఆశతో వచ్చిన యువతకు రిక్తహస్తమే ఎదురవుతోంది. నిబంధనలను మార్చితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరనుండగా ఆన్‌లైన్‌లో దిద్దుబాటు చర్యలు చేపట్టాలని యువత కోరుతోంది.

#### జాడలేని కొత్త కార్డులు

రేషన్ కార్డు అందని ద్రాక్షగా మారింది. దరఖాస్తు చేయడం, ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం, ఆపై కార్యాలయాల చుట్టూ తిరిగి నిరాశగా వెనుదిరగడం తంతుగా మారింది. ఏళ్ల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. బోగస్ కార్డుల ఏరివేతకు 2019లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా అప్పటి నుంచి కొత్తకార్డుల జారీకి బ్రేక్ పడింది. జిల్లాలో 2019వరకు రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 34,293 కాగా, మంజూరైనవి 15,114 మాత్రమే. 18వేల మందికి పైగా కార్డులు రాకపోగా కరోనా సమయంలోనూ వీరంతా రేషన్‌కు దూరమే. ఇదిలా ఉండగా మీసేవలో రేషన్ కార్డులకు దరఖాస్తు చేసే అవకాశం లేదు. సైట్ తెరుచుకోకపోగా దరఖాస్తు చేసుకునేవారి సంఖ్య మరో 15వేల వరకు ఉంటుందని అంచనా.



#### తొలగింపులో శ్రద్ధ.. మంజూరులో ఏదీ?

పేదలకు ప్రామాణికం రేషన్ కార్డు. రేషన్ సరుకులతో పాటు వైద్య సేవలు, ఇతర పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి. ఈ క్రమంలో దరఖాస్తు చేయడమే తరువాయి క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం కార్డు మంజూరు చేయాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం వెంటాడటం విడ్డూరం. అయితే కొత్త కార్డులు, కార్డులో పేర్ల చేర్పు వంటి వాటికి నాలుగేళ్లుగా అవకాశం లేకపోగా తొలగింపుల ప్రక్రియ ఏటా సాగుతోంది. మరణించిన వారి యూనిట్లను ఇప్పటికి మూడుసార్లు డ్రైవ్ నిర్వహించగా ఆసరాతో అనుసంధానించారు. పింఛన్‌దారు మరణిస్తే వాటి వివరాలతో ఆటోమెటిక్‌గా కార్డులో పేరు తొలగిస్తున్నారు. ఇక కొత్తగా పెళ్లయి మెట్టినింట అడుగుపెట్టిన కోడళ్లకు పుట్టినింట రేషన్ కార్డులో పేరు తొలగించారు. గ్రామాలు, పట్టణాల్లో కొత్తగా పెళ్లయిన వారి వివరాలు సేకరించి కార్డు నుంచి పేరు తొలగించారు. సదరు ప్రక్రియ ఇప్పటికి రెండుసార్లు చేపట్టారు. అలాగే రేషన్ కార్డు యజమానితో పాటు కార్డులోని సభ్యుల వివరాలతో ఆధార్ కార్డులను అనుసంధానించారు. ఇదంతా ప్రక్రియ సాగుతుండగా కొత్త కార్డుల జారీ, పేర్ల చేర్పు లేకపోవడం ఆందోళనకర పరిణామం.

**జిల్లా మొత్తంగా నాలుగేళ్ల క్రితం నాటి గణాంకాలిలా.. (ఇప్పటికీ ఇంతే)**

| | |
|---|---|
| రేషన్‌కార్డుకు దరఖాస్తులు | :34,293 |
| తిరస్కరణ | :831 |
| మొత్తం పెండింగ్ | :18,348 |
| గిర్దావర్ వద్ద పెండింగ్ | :9,626 |
| తహసీల్దార్ వద్ద.. | :456 |
| డీఎస్వో కార్యాలయంలో.. | :8,266 |
| అవకాశమిస్తే కొత్తగా రానున్న దరఖాస్తులు(అంచనా) | :15,000 |

**మండలాల వారీగా వివిధ దశల్లో పెండింగ్..**

| మండలం | ఆర్ఐ | డీఎస్వో |
|---|---|---|
| చిగురుమామిడి | 257 | 495 |
| చొప్పదండి | 649 | 338 |
| ఇల్లందకుంట | 214 | 303 |
| గంగాధర | 323 | 562 |
| గన్నేరువరం | 179 | 250 |
| హుజూరాబాద్ | 1,001 | 382 |
| జమ్మికుంట | 603 | 677 |
| కరీంనగర్‌రూరల్ | 698 | 477 |
| కరీంనగర్‌అర్బన్ | 2,630 | 1,861 |
| శంకరపట్నం | 264 | 538 |
| కొత్తపల్లి | 988 | 251 |
| మానకొండూర్ | 206 | 590 |
| రామడుగు | 120 | 425 |
| సైదాపూర్ | 498 | 227 |
| తిమ్మాపూర్ | 385 | 564 |
| వీణవంక | 611 | 326 |
| మొత్తం | 9,626 | 8,266 |

# సమస్యలు రాజీమార్గంలో పరిష్కరించుకోండి

- సీనియర్ సివిల్ జడ్జి డి.వి.నాగేశ్వర్‌రావు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని కోర్టు సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి డి.వి.నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. సమస్యలను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. క్షణికావేశానికి లోనై, నేరాలకు పాల్పడవద్దని చెప్పారు. లోక్ అదాలత్‌లో 567 క్రిమినల్, బ్యాంక్‌కు సంబంధించిన 11 కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి స్వాతి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ సభ్యులు యత్పతి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పరిష్కార పత్రాలు అందిస్తున్న న్యాయమూర్తులు

# అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామి తెలంగాణ

- కాళేశ్వరం నీటితో సిరుల పంటలు
- అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- గన్నేరువరంలో ప్రగతి నివేదన సభ


జ్యోతిప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే బాలకిషన్

గన్నేరువరం: సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సుపరిపాలన దినోత్సవంగా సందర్భంగా గన్నేరువరంలో జెడ్పీటీసీ సభ్యుడు మాడుగుల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రగతి నివేదన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆలోచనతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో సిరుల పంటలు పండుతున్నాయని అన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవన్నీ కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నాలుగు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, 500 పడకలతో నిర్మిస్తున్నామని చెప్పారు. పేద విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు జ్యోతిరావు పూలే విదేశీ విద్య పథకాన్ని ప్రవేశపెట్టి, రూ.20 లక్షలు అందిస్తున్నామని తెలిపారు. రాజీవ్ రహదారి గుండ్లపల్లి నుంచి రాజన్నసిరిసిల్ల వెంకట్రావుపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి 15 రోజుల్లో టెండర్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. మెట్ట ప్రాంతమైన గన్నేరువరం మండలానికి కాళేశ్వరం జలాలను అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. రూ.200 పింఛన్ నుంచి రూ.2,116 అందిస్తున్నామని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద రూ.1,00,016 ఇస్తున్నామని అన్నారు. మిషన్ కాకతీయ పథకంలో చెరువులను అభివృద్ధి చేశామని, దేశంలోనే గన్నేరువరం గ్రామ పంచాయతీని నాలుగో స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, రైతుబంధు సమితి జిల్లా, మండల కో-ఆర్డినేటర్లు గూడెల్లి తిరుపతి, బద్దం తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ న్యాత స్వప్న, సర్పంచ్ పుల్లెల లక్ష్మి, తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో స్వాతి, ఏవో కిరణ్మయి తదితరులున్నారు.

#### ఎందుకీ ప్రగతి నివేదన?

మండలానికి డబుల్ రోడ్డు వేయనందుకా, 30 పడకల ఆసుపత్రి నిర్మించనందుకా, రుణమాఫీ చేయనందుకా, పక్కా ప్రభుత్వ భవనాలు నిర్మించనందుకా.. ఎందుకీ ప్రగతి నివేదన సభ నిర్వహిస్తున్నారంటూ బీజేపీ నాయకులు గన్నేరువరంలో పోస్టర్లు ఏర్పాటు చేశారు.

# అన్ని రంగాలపై అవగాహన ఉండాలి

- రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ వి.లక్ష్మీకాంతారావు
- కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మాట్లాడుతున్న మాజీ ఎంపీ లక్ష్మీకాంతారావు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ప్రిన్సిపాల్ శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. కళాశాల చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ వి.లక్ష్మీకాంతారావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాల సర్వతోముఖాభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయాల్సిన పనులు ఎన్నో ఉన్నాయని అన్నారు. విద్యాసంస్థ ఉన్నత స్థితిలో ఉంటే అందులో చదివే విద్యార్థులకు ఎక్కువ వసతులు సమకూరి, మంచి ఉద్యోగం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో అభివృద్ధి వేగంగా జరుగుతోందని, వాటిపై అందరికీ అవగాహన ఉండాలని చెప్పారు. పూర్వ విద్యార్థులు, విద్యార్థులు కళాశాలలో ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సెంటర్ల ఆధునీకరణకు సహాయం చేయాలని సూచించారు. అనంతరం కళాశాలలో ఎగ్జిబిరెన్స్ ముగింపు కార్యక్రమం జరిపారు. దీనికి ఎన్ఐటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీఎస్ ఆర్కే ప్రసాద్ హాజరై, మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులతో పాసవడమే కాకుండా సాంస్కృతిక, సాంకేతిక పోటీల్లో పాల్గొని పరిపూర్ణ వ్యక్తిత్వం సంపాదించాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. సమన్వయకర్తలుగా అధ్యాపకులు బి.వేణుగోపాల్, ఎన్.శశికళ, సిల్వర్ జూబ్లీ అధ్యాపక సమన్వయకర్తలు ఎస్.రాజేంద్రప్రసాద్, బి.హారతి, వీవీ.శ్రీనివాసరావు, కాకతీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ శమిత తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులు అన్ని రంగాల్లో రాణించాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి కమలాకర్, పక్కన మేయర్ సునీల్‌రావు, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, నృత్యం చేస్తున్న చిన్నారులు

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్
- ముగిసిన బాలభవన్ వేసవి శిక్షణ తరగతులు

కరీంనగర్‌కల్చరల్: చిన్నారులు అన్ని రంగాల్లో రాణించాలని, కళలు మానసిక, శారీరక వికాసానికి దోహదపడుతాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా బాలభవన్ వేసవి శిక్షణ తరగతులు ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన చేసి, మాట్లాడారు. వేసవి సెలవుల నేపథ్యంలో బాలభవన్‌లో 900 మంది చిన్నారులు వివిధ అంశాల్లో శిక్షణ పొందడం అభినందనీయమని అన్నారు. నేర్చుకున్న కళలను నిత్యజీవితంలో ఉపయోగిస్తే ఇంకా అభ్యున్నతి, పేరుప్రఖ్యాతులు సాధిస్తారని చెప్పారు. శిక్షణ ఇచ్చిన గురువులను అభినందించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్ నాయక్ టీచర్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, మేయర్ సునీల్‌రావు, అడిషనల్ కలెక్టర్లు గరిమా అగర్వాల్, జీవీ.శ్యాంప్రసాద్‌లాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, వివిధ శాఖల అధికారులు, బాలభవన్ సూపరింటెండెంట్ కట్ట మంజులాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

#### సంతోషిమాత ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

కరీంనగర్‌లోని జ్యోతినగర్ హనుమాన్ సంతోషి మాత ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన మేయర్ సునీల్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఆలయంలో పూజల అనంతరం మంత్రి సమక్షంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. చైర్మన్‌గా కె.లక్ష్మీరాజం, సభ్యులుగా రాయనవేని నాగరాజు, సిరికోటి గోపాల్‌కృష్ణ, రాజశేఖర్, మేకల రేణుక ఇటీవల ఎన్నికయ్యారు. కార్యనిర్వహణాధికారి నాగుల అని ల్‌కుమార్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఉన్నారు.





# పల్లెలకూ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు

- అందించేందుకు నిర్ణయించిన కేంద్రం
- తుది దశకు 'గ్రామీణ్ సర్వే'
- ఈ నెల 15 వరకు ఆన్‌లైన్‌లో వివరాల నమోదు
- జిల్లాలో 313 గ్రామాలు

కరీంనగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ఇకనుంచి పారిశుద్ధ్య నిర్వహణలో ఉత్తమ గ్రామ పంచాయతీలకు స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాలు అందించాలని నిర్ణయించింది. ఇప్పటివరకు జిల్లాలను పరిగణలోకి తీసుకొని ర్యాంకు, స్కోరు ఆధారంగా అవార్డులు ప్రకటించారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2023కి గానూ కరీంనగర్ జిల్లాలో చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సర్వే చివరి దశకు చేరింది. జిల్లాలోని 313 గ్రామాల్లో జంబ్లింగ్ విధానంలో నియమించిన అధికారుల బృందాలు ఎంపిక చేసిన పల్లెల్లో పర్యటిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల వినియోగం, ఇంకుడు గుంతలు, చెత్త సేకరణ, డంపింగ్‌యార్డు, మురికి కాలువల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, సేంద్రియ ఎరువుల తయారీ, స్వచ్ఛతలో ప్రజల భాగస్వామ్యంపై వివరాలు సేకరిస్తున్నారు. ప్రాధాన్యత అంశాల్లోని ప్రగతిని ఇంటింటికీ తిరిగి పరిశీలిస్తున్నారు. ఈ నెల 15 వరకు సేకరించిన వివరాలను అధికారులు స్వచ్ఛభారత్ మిషన్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంది.


ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న అధికారులు

#### పోటీతత్వాన్ని పెంచేందుకు..

కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి పారిశుద్ధ్య నిర్వహణలో జిల్లాల మధ్య పోటీతత్వాన్ని పెంచేందుకు స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే ఈ ఏడాది నుంచి గ్రామాల్లోని స్వచ్ఛతపై సర్వే చేస్తున్నారు. అధికారులు మొత్తం 500 మార్కులకు వివిధ దశల్లో సర్వే చేసి, మార్కులు కేటాయిస్తారు.

#### మూడు కేటగిరీల్లో..

జనాభా ఆధారంగా మూడు కేటగిరీల్లో ఐదేసి పంచాయతీలను పురస్కారాలకు ఎంపిక చేస్తారు. మండల స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీ ఎంపికను జనాభా ప్రకారం 2 వేల కంటే తక్కువ, 2 వేల నుంచి 3 వేలలోపు, 5 వేల పైన ఉన్నవిగా విభజించారు. ప్రతీ కేటగిరీ నుంచి ఐదు చొప్పున మండలానికి 15 పంచాయతీలు ఉండాలని నిర్ణయించారు. అంతకంటే తక్కువ ఉన్న మండలాల్లో కేటగిరీ ప్రాతిపదికన ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేస్తున్నారు. జిల్లాస్థాయిలో 15 జీపీలను ఈ నెలాఖరు వరకు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసి, పంపిస్తారు. జూలై 15 నుంచి ఎంపిక చేసిన గ్రామాల్లో కేంద్ర బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఆయా అంశాలను పరిశీలిస్తాయి. సర్వే నివేదిక ఆధారంగా రాష్ట్రంలో 15 ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసి, అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున పురస్కారాలు అందిస్తారు.

#### దశాబ్ది ఉత్సవాలతో ఆటంకం..

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు సర్వేకు ఆటంకంగా మారాయి. ఈ నెల 3 నుంచి 21 వరకు వేడుకలు నిర్వహిస్తుండటంతో అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాల్సి వస్తోంది. దీంతో సర్వే పూర్తి చేసేందుకు వారు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో సర్వే చివరి దశకు వచ్చినప్పటికీ వివరాలను ఆన్‌లైన్ చేయాల్సి ఉంది.

#### చివరి దశలో సర్వే..

గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే చివరి దశలో ఉంది. ప్రతీ పంచాయతీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. జనాభా ఆధారంగా మూడు కేటగిరీల్లో 15 ఉత్తమ పంచాయతీలు రాష్ట్రస్థాయికి ఎంపిక వుతాయి.
– టి.రమేశ్, ఎస్‌బీఎం, జిల్లా కో–ఆర్డినేటర్

# కళలకు నిలయం కరీంనగర్



కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

కరీంనగర్‌కల్చరల్: 'కవిత్వం ఆనందాన్నిస్తుంది, చైతన్యపరుస్తుంది, సమ సమాజ నిర్మాణానికి పునాదులు వేస్తుంది' అని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ అధ్యక్షుడు పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్ అన్నారు. భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన ఉగాది కవి సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొని 'శోభకృత్ కవన వసంతం' కవితా సంకలనాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. 'కరీంనగర్‌తో తనకు సాహిత్య పరంగా ఎంతో అనుబంధం ఉందని, కవిత్వానికి, కళలకు కరీంనగర్ నిలయమన్నారు. విశిష్ట అతిథి, గనులు, భూగర్భశాఖ విశ్రాంత డైరెక్టర్ వీడీ రాజగోపాల్ మాట్లాడుతూ, 'కవిత్వ విహారంలో ఒంటరితనం దూరం అవుతుందన్నారు. సీనియర్ న్యాయవాది, కవి ఎర్రం రాజారెడ్డి మాట్లాడుతూ, కవుల రచనలను అందరూ చదవాలన్నారు. సంపత్‌కుమార్ శ్రీవత్స, అన్నాడి గజేందర్ రెడ్డి, తడిగొప్పుల కుమారస్వామి, సంకేపల్లి నాగేంద్ర శర్మ సభాధ్యక్షులుగా వ్యవహరించగా, వివిధ ప్రాంతాల నుంచి 70 మంది కవులు కవితా పఠనం చేశారు. నూజెట్టి రవీంద్రనాథ్, రాజేశ్వరరావు, ముదిగంటి సుధాకర్‌రెడ్డి, గంప ఉమాపతి, టి.నవనీతరావు, సీహెచ్ రజిత, విజయప్రసాద్ నలమాసు, తిరుకోవెల వెంకటరమణ, పోతుగంటి వీరాచారి, గజవెల్లి సత్యనారాయణ తదితరులున్నారు.

# సాంకేతిక శిక్షణలో నారీమణులు

● ఉత్సాహంగా పాల్గొంటున్న మహిళలు ● టైలరింగ్, డ్రాయింగ్, మ్యూజిక్‌లలో 42 రోజులు ట్రైనింగ్ ● నేటితో ముగియనున్న కోర్సు


శిక్షణలో తాము తయారు చేసిన క్రాఫ్ట్ వస్తువులతో మహిళలు

సప్తగిరికాలనీ(కరీంనగర్): చిన్నప్పటి కలలను ఇప్పుడు సాకారం చేసుకుంటున్నామని... నేర్చుకుంటున్న కళను ఇంకా మెరుగుపర్చుకుందామని... స్కూల్‌లో పిల్లలకు పెట్టే టాస్క్‌లో మేము సైతం సాయం చెద్దామని... ఉపాధి కోసమని... ఉద్యోగం సాధించాలని.. పది మందికి ఉపాధి కల్పించాలని ఇలా ఎవరికి వారు తమ ఆశయాలను, లక్ష్యంను సార్థకం చేసుకునేందుకు సిద్ధమయ్యారు నారీమణులు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తూ....కళలకు వయస్సుతో సంబంధం లేదని సార్థకం చేస్తూ కరీంనగర్ మంకమ్మతోటలోని ధన్గర్‌వాడీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహింస్తున్న సాంకేతిక ఉపాధ్యాయ శిక్షణ కోర్సు (టీటీసీసీ)లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు మహిళలు. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్నికల్ టీచర్ ట్రెనింగ్ సర్టిఫికేట్ కోర్సులో పెద్ద సంఖ్యలో హాజరై శిక్షణ పొందుతున్నారు. సుమారు 42 రోజులు కోర్సు నిర్వహిస్తుండగా నేటితో కోర్సు పూర్తవుతోంది. ఈక్రమంలో శిక్షణ పొందిన మహిళలు వారి అనుభవాలను, భవిష్యత్ కార్యచరణపై ప్రత్యేక కథనం...

## 42 రోజుల శిక్షణ

కరీంనగర్ మంకమ్మతోటలోని ధన్గర్‌వాడీ పాఠశాలలో నిర్వహిస్తున్న టెక్నికల్ టీచర్ ట్రెనింగ్ సర్టిఫికేట్ కోర్సులో 553 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. మే 1న కోర్సు ప్రారంభించగా నేటితో ముగియనుంది. హాజరైన విద్యార్థులకు 3 విభాగాల్లో టైలరింగ్, డ్రాయింగ్, మ్యూజిక్ లలో 42 రోజులు శిక్షణ అందించారు. టైలరింగ్‌లో 246, డ్రాయింగ్‌లో 293 మ్యూజిక్‌లో 14మంది విద్యార్థులు శిక్షణ పొందారు. శిక్షణ కోర్సు డైరెక్టర్ శంకర్, కోర్స్ కోఆర్డినేటర్ కోట లక్ష్మారెడ్డి పర్యవేక్షణలో టీటీసీసీ శిక్షణ పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. 2016, 2017, 2018లో విజయవంతంగా ట్రెనింగ్ పూర్తిచేసుకుని ప్రాక్టికల్స్, రాత పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి కరీంనగర్ సెంటర్ నమోదు ఎంచుకోవడం ఈ కేంద్రం ప్రత్యేకత.


డ్రాయింగ్, క్రాఫ్ట్ ప్రాక్టీస్ చేస్తున్న దృశ్యం


క్రాఫ్ట్‌లో మెలకువలు నేర్పిస్తున్న ట్రైనర్స్

### క్రాఫ్ట్, టైలరింగ్‌లో...


మాది తీగలగుట్టపల్లి. క్రాఫ్ట్ వర్క్ అంటే చాలా ఇష్టం. టీటీసీసీలో టైలరింగ్‌తో పాటు క్రాఫ్ట్ వర్క్ నేర్చుకున్న. ఇంట్లో టైలరింగ్ వర్క్ చేయడంతో పాటు మా పాపకు క్రాఫ్ట్‌వర్క్‌లో సాయంగా ఉండేందుకు శిక్షణ తీసుకోవడం ఆనందగా ఉంది.
– బాలసాని స్వప్న

### డ్రాయింగ్‌లో నైపుణ్యం సాధించా


మాది కరీంనగర్. ఎంఏబీఈడీ చేశా. ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న. డ్రాయింగ్ అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. 8వ తరగతి నుంచి డ్రాయింగ్ చేస్తున్నాను. పిల్లలను డ్రాయింగ్‌లో తీర్చిదిద్దేందుకు శిక్షణ తీసుకుంటున్న. ట్రెనింగ్ చాలా బాగుంది. కొత్త తరహాలో ఎన్నో మెళకువలు నేర్చుకున్న.
– ఎం.తేజస్విని

### సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తూ మ్యూజిక్‌పై ప్రేమతో


మాది కరీంనగర్. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాను. సంగీతంపై ఇష్టంతో నేర్చుకునేందుకుఆరునెలలు సెలవుపెట్టి మరీ ఇక్కడికి వచ్చి శిక్షణ తీసుకున్నాను. మ్యూజిక్ క్లాస్‌లు చాలా బాగున్నాయి. ట్రెనింగ్ పూర్తి చేసిన తర్వాత మ్యూజిక్‌లో డిప్లమా చేస్తా.
– టి.జాగృతి

### హైదరాబాద్ నుంచి వచ్చా


ఎంసీఏ పూర్తిచేశాను. దీంతో పాటు సంగీతంలో డిప్లొమా కూడా చేశా. నాకు సంగీతం అంటే చాలా ఇష్టం. మా తల్లిగారిది కరీంనగర్ కావడంతో టీటీసీసీలో శిక్షణ తీసుకునేందుకు హైదరాబాద్ నుంచి వచ్చాను. సంగీతం మాస్టార్ చాలా బాగా నేర్పించారు. నేను శిక్షణ పొంది ప్రస్తుతం ఆన్‌లైన్‌లో మ్యూజిక్ క్లాస్‌లు చెబుతున్నాను. ఇంట్లో బాబుకు కూడా మ్యూజిక్ నేర్పిస్తున్నాను. – ఎస్. శైలజ

### పిల్లలకు ఉపయోగపడుతుందని


బీఈడీ చేశా. ప్రైవేటు స్కూల్‌లో పిల్లలకు పెయింటింగ్, డ్రాయింగ్, ఆర్ట్, క్రాఫ్ట్‌లలో టాస్క్‌లు ఇస్తున్న. పిల్లల ఆలోచనలకు తోడుగా నిలవాలని శిక్షణ తీసుకున్నాను. ఎంబ్రాయిడరీ, క్రాఫ్ట్‌తో పాటు డ్రాయింగ్ నేర్చుకున్న. మంచి మంచి బొమ్మలు వేస్తున్న. – జి.జ్యోతి

### ఉత్సాహంగా హాజరవుతున్నారు


టీటీసీసీ ట్రెనింగ్‌కు మహిళలు ఉత్సాహంగా హాజరవుతున్నారు. ప్రతీరోజు సుమారు 500 మందికి పైగా హాజరవుతున్నారు. ప్రస్తుతం నేను సైదాపూర్‌లోని కేజీబీవీ పాఠశాలలో క్రాఫ్ట్ టీచర్‌గా పనిచేస్తున్నాను. నాలుగేళ్లుగా టీటీసీసీలో క్రాఫ్ట్, ఎంబ్రాయిడరీ, టైలరింగ్‌లో శిక్షణనిస్తున్నాను.
– ఎ.వీణ, క్రాఫ్ట్ టీచర్

## క్లుప్తంగా

### కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

సప్తగిరికాలనీ: సీఎం కేసీఆర్ మంచిర్యాల సభలో దివ్యాంగులకు రూ.వెయ్యి పింఛన్ పెంచుతున్నట్లు ప్రకటించడాన్ని స్వాగతిస్తూ శనివారం స్థానిక తెలంగాణ చౌక్‌లో పలువురు దివ్యాంగులు సీఎం కేసీఆర్, మంత్రి గంగుల చిత్రపటాలకు క్షీరాభిషేకంచేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వన్నెల అంజనరెడ్డి, కొలకాని నరసయ్య, జక్కం సంపత్, కైరి అంజయ్య, మంచాల రాజేందర్, జంపాల బిక్షపతి, గోపి, కొత్తూరు స్వామి, వెన్నం శ్రీనివాస్, లింగమూర్తి, పర్శురాములు, కార్తీక్, కనకయ్య, రాజన్న, శంకర్, దివ్యాంగులు పాల్గొన్నారు.

### సర్పంచ్‌కు పరామర్శ


సర్పంచును పరామర్శిస్తున్న రవీందర్‌సింగ్

కరీంనగర్‌రూరల్: మండలంలోని బొమ్మకల్ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్ తల్లి మల్లమ్మ ఇటీవల మృతిచెందగా శనివారం రాష్ట్ర సివిల్‌సప్లై కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్ పరామర్శించారు. మల్లమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సాదవేణి శ్రీనివాస్, గుంజపడుగు హరిప్రసాద్, రాము, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్


బ్రెడ్ అందిస్తున్న క్లబ్ అధ్యక్షుడు కిషన్

కరీంనగర్‌రూరల్: మండలంలోని బొమ్మకల్‌కు చెందిన గౌరమ్మ అనే వృద్ధురాలికి లయన్స్ క్లబ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆస్పత్రిలో శనివారం ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించారు. అనంతరం బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు చింతల కిషన్, టెక్నిషియన్ ప్రభాకర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రజలకు పంచాలి

విద్యానగర్: భారత రాజ్యాంగాన్ని బోధించడంతో పాటు రాజ్యాంగ గ్రంథాన్ని దేశ ప్రజలకు పంచాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ.. విద్యా సంస్థల్లో ప్రతీ విద్యార్థికి భారత రాజ్యాంగాన్ని ఇవ్వాలని, పాఠ్యాంశంగా భారత రాజ్యాంగాన్ని చేర్చాలన్నారు. ప్రభుత్వం సమాచార, ప్రచార మాధ్యమాల ద్వారా రాజ్యాంగం గురించి, పౌరహక్కుల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో టి.జంపన్న, మల్లేశం, రాజు, బాబు, నర్సయ్య, లక్ష్మన్ పాల్గొన్నారు.

### 'బీసీలను మభ్యపెడుతున్నారు'


మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

సప్తగిరికాలనీ: బీసీలను మభ్యపెడుతూ ఎలక్షన్‌లో ఓట్లు రాబట్టేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎత్తులు వేస్తోందని బీసీల్లో 122 కులాలుంటే కేవలం 15 కులాలకు మాత్రమే కులవృత్తి దారుల పేరిట రూ.లక్ష సాయం అందిస్తామనడం ఎంతవరకు సమంజసం అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం ఎద్దేవా చేశారు. శనివారం బీసీ సంఘం జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతీ బీసీ కుటుంబానికి బీసీబంధు ప్రవేశపెట్టి రూ.10 లక్షలు ఇవ్వాలని, లేనిపక్షంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో గద్దె దింపుతామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్, చిగుర్ల శ్రీనివాస్, నేతికుంట అనూప్, లింగంపల్లి శ్రీనివాస్, అనుమసా నితీన్ పయ్యావుల మహేశ్, గుమ్మడి దారి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర అథ్లెటిక్ సంఘం ఉపాధ్యక్షుడు నందెల్లి మహిపాల్ జన్మదిన వేడుకలను శనివారం పెటా, క్రీడా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ చౌక్‌లో పెటా సంఘం అధ్యక్షకార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, ఎండీ యూనిస్ పాష కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు.

## ఉత్సవాలు, ప్రచారాలపై ఉన్న శ్రద్ధ అన్నదాతలపై లేదు

• ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోజిరెడ్డి


ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న అంబటి జోజిరెడ్డి

విద్యానగర్: కేసీఆర్‌కు ఉత్సవాలు, పార్టీ ప్రచారాలపై ఉన్న శ్రద్ధ అన్నదాతలపై లేదని ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి ఆరోపించారు. శనివారం కరీంనగర్‌లోని ఏఐఎఫ్‌బీ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతుల వద్ద వడ్లు కొనుగోలు చేసి 25రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు వారి ఖాతాల్లో డబ్బులు జమచేయలేదన్నారు. దేశానికి రైతు వెన్నుముక అనిచెప్పి రైతుల నడ్డి విరుస్తున్నారని, మూడు నెలల క్రితం రామడుగు మండలంలో నష్టపోయిన పంటలను పరిశీలించిన సీఎం కేసీఆర్ ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. ఉత్సవాల పేరుతో వందల కోట్లు ప్రజాధనాన్ని సీఎం కేసీఆర్ వృథాచేస్తున్నారని మండిపడ్డారు. ఏకకాలంలో రైతుల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ధర్నాలు, నిరాహార దీక్షలు చేపడతామని, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

### చిత్రకథ..



### దాహం తీర్చిన లీకేజీ

ఎండలు మండిపోతున్నాయి... బయటకు వస్తే గొంతెండుతోంది. నిర్వహణ లేని చలివేంద్రాలను ఎత్తివేశారు. దీంతో ఎక్కడ తడి దొరికినా చాలనే పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ నుంచి వేములవాడకు వెళ్తున్న ఓ లారీ డ్రైవర్ దాహం తీర్చుకునేందుకు అల్లాడిపోయాడు. దీంతో మానేరు తీరంలో మిషన్ భగీరథ పైప్ లీకేజీ కంట పడేసరికి లీకేజీ నీళ్లతో ఇలా దప్పిక తీర్చుకుని ప్రయాణం కొనసాగించాడు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

## ఘనంగా సుపరిపాలన దినోత్సవం


కొత్తపల్లిలో ర్యాలీ తీస్తున్న మున్సిపల్ సిబ్బంది, తదితరులు


మాట్లాడుతున్న ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి

కొత్తపల్లి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయంలో సుపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి సంఘం చౌరస్తా, బస్టాండ్, మార్కెట్‌రోడ్ వరకు ర్యాలీతీశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రుద్ర రాజు కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, కోఆప్షన్ సభ్యులు, మెప్మా సిబ్బంది, ఆర్పీలను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందించారు. కమిషనర్ కట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు వాసాల రమేశ్, మానుపాటి వేణుగోపాల్, గున్నాల విజయ రమేశ్, ఎస్నే నజియాబాబా, స్వర్గం వజ్రాదేవి నర్సయ్య, గండు రాంబాబు, చింతల సత్యనారాయణరెడ్డి, వేముల కవిత, కో ఆప్షన్ సభ్యులు ఎండీ.ఫక్రుద్దీన్, ప్రభాకర్, కట్ల మమతా, మెప్మా అధికారి మల్లీశ్వరి, సంధ్యారాణి,ఆర్పీలు, మహిళాసంఘం సభ్యులు, నాయకులు, అంగన్‌వాడీటీచర్లు, మున్సిపల్‌సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

**ప్రజలకు అందుబాటులో పాలన**

కరీంనగర్‌రూరల్: గ్రామపంచాయతీల పునర్విభజనతో పరిపాలన ప్రజలకు చేరువైందని ఎంపీడీవో సీహెచ్. జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ మండలంలో కొత్తగా ఏర్పాటైన దుబ్బపల్లి, తాహెర్‌కొండాపూర్ గ్రామపంచాయతీల్లో సుపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారులుసమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. దుబ్బపల్లిలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజలకు సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో కొత్త జిల్లాలు, మండలాలు, గ్రామపంచాయతీలను ఏర్పాటు చేశారన్నారు. పరిపాలన సౌలభ్యంతో అప్పటికప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ సమావేశాల్లో సర్పంచులు సిరిగిరి దుర్గ, మడికంటి మమత, ఎంపీటీసీ సభ్యుడు బుర్ర తిరుపతిగౌడ్, ఉపసర్పంచ్ శంకరయ్య, కరీంనగర్ సింగిల్‌విండో డైరెక్టర్ మారుతీ, పంచాయతీ కార్యదర్శులు మమత, సరిత తదితరులు పాల్గొన్నారు.

### పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: 33 కెవీ.నూతన విద్యుత్ లైన్ల పను లు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు 11 కె.వీ.ఇండస్ట్రీ యల్/పద్మానగర్ ఫీడర్ పరిధిలోని పద్మానగర్, ఇండస్ట్రీయల్ ఏరియా, ప్రగతినగర్, సాయిబాబా ఆలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.

## వరికొయ్యలు కాల్చితే కాలుష్యం


మొగ్దుంపూర్ శివారులో వరికొయ్యలకు నిప్పంటించిన రైతులు

కరీంనగర్‌రూరల్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులంతా ప్రస్తుతం వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. యాసంగిలో వేసిన వరిపంటను హార్వెస్టర్లతో కోయించి మిగిలిన వరి కొయ్యలకు నిప్పుపెడుతున్నారు. దీంతో పొలంలోని కీటకాలు, వ్యాధికారక సూక్ష్మజీవులు నశిస్తా యని పేర్కొంటున్నారు. కానీ వ్యవసాయాధికారు లు మాత్రం వరికొయ్యలు కాల్చకుండా కలియదున్నితే భూమి సారవంతమవుతుందని చెబుతున్నారు.

**భూసారానికి ప్రమాదం ...**

వరి కొయ్యలు కాల్చడంతో ఏర్పడిన పొగతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. సూక్ష్మ ధూళి కణాలు బూడిద రూపంలో గాలిలో కలిసి వాయుకాలుష్యం పెరగడంతోపాటు భూసారం నశిస్తుంది. నేల పొరల్లో తేమశాతం ఆవిరై పంట దిగుబడులపై ప్రభావం చూపుతుంది. కొయ్యలను కాల్చే సమయంలో పొలాల్లోని విద్యుత్‌స్టార్టర్లు, మోటారుపైపులు కాలిపోయిన ఘటలున్నాయి. అంతేకాకుండా పక్కనే ఉన్న రైతులకు సంబంధించిన ఇతర పంటలకు నిప్పంటుకుని ఆస్తినష్టం జరిగే అవకాశముంది. కొయ్యలను కాల్చకుండా పొలంలోనే కలియదున్నితే మేలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

### సూక్ష్మజీవులు నశిస్తాయి

వరికొయ్యలను కాల్చడంతో నేల కాలుష్యం, వాతావరణ కాలుష్యంతోపాటు భూమిలో సారవంతం పెంపొందించే సూక్ష్మజీవులు నశిస్తాయి. కొయ్యకాళ్లను కాల్చకుండా పొలం నిండా నీళ్లుపెట్టి ఎకరానికి 50 కిలోల సింగిల్ సూప్ ఫాస్పేట్ ఎరువును కలిపి కలియదున్నితే గడ్డి పొలంలోనే మురిగి నేల సారవంతమవుతోంది. నేల నీటి సామర్థ్యం పెరుగుతోంది. రైతులకు ఏమైనా సమస్యలుంటే వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలి. వ్యవసాయ అధికారుల సూచనలు తప్పక పాటిస్తే పంటల సాగులో అధిక దిగుబడులు సాధిస్తారు. – సత్యం, ఏవో

## ప్రజలకు చేరువైన మోదీ పాలన


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలన దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ అసెంబ్లీ పరిధిలో భారీ వాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. వాహన ర్యాలీ నగరంలోని ముఖ్య కూడళ్ల మీదుగా సాగింది. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్శెట్టి సంపత్, కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్‌రావు మాట్లాడుతూ, 2014లో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ ఆలోచన విధానంతో దేశంలోని యువతకు, ప్రజానీకానికి చేరువయిందని, దీంతో ప్రజలంతా మోదీ ప్రభుత్వ పనితీరుపై పూర్తి నమ్మకంతో ఉన్నారని తెలిపారు. తెలంగాణలో బీజేపీ ఎక్కడుంది అనే స్థాయి నుంచి విపక్ష పార్టీలు బీజేపీ కోసమే ఆలోచన చేసేలా పార్టీ ఎదిగిందన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు జశ్వంత్, తణుకు సాయి, జిల్లా కార్యదర్శి నికేష్, అధికార ప్రతినిధిరమేశ్, అనిల్, పొన్నాల రామ్, సతీశ్, మహేశ్, అరవింద్, ప్రవీణ్, వంశీ, రాజేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### కుంటను తలపిస్తున్న చౌరస్తా


మానకొండూర్ రూరల్: మండల కేంద్రంలోని తూర్పు దర్వాజ చౌరస్తా వద్ద ఇసుక వాహనాలతో రోడ్డు గుంతలమయమైంది. రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో నీరంతా గుంతల్లోకి చేరి కుంటను తలపిస్తోంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## క్లుప్తంగా...

### భారతీయ మూలాలు నేటి తరానికి ఎంతో అవసరం

సనాతన సంప్రదాయాలతో యువతరాన్ని తీర్చిదిద్దాలి: తమిళిసై



మద్దిలపాలెం(విశాఖ తూర్పు): మన భారతీయ మూలాలు, సనాతన సంప్రదాయాలను నేటి యువతరానికి అందించాల్సిన అవసరం పెద్దలపై ఉందని, ఆ దిశగా కృషి చేయాలని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. భారతీయత– అమృతకాలంపై రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్. వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో ప్రారంభమైంది. సద్గురు శివానందామూర్తి ఆశీస్సులతో సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయం ప్రపంచ దేశాలకు ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాయనీ అలాంటి మన మూలాలు నేటి తరానికి దూరం కాకుండా వారికి చేరువ చేయాలన్నారు. మన జీవన విధానంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పెను ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందనీ, ఇలాంటి తరుణంలో మన పూర్వీకులు పాటించిన ఆధ్యాత్మికత, ఆహారపు అలవాట్లను, సంప్రదాయాలను యువతరానికి అందించాలని సూచించారు. ఉదయం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత వైస్ అడ్మిరల్ రామన్ పూరి మాట్లాడుతూ మన భారతీయతను భావితరాలకు చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ప్రొఫెసర్ కె. సరస్వతి విద్యార్థిని రచించిన 'పద్మభూషణ్ డాక్టర్ శ్రీపాద పినకపాణి సంగీత నిధి'పుస్తకాన్ని ఆవిష్కరించారు.

### 23 మందితో తెలుగు మహిళ కమిటీ

సాక్షి, హైదరాబాద్: టీటీడీపీ అనుబంధ విభాగమైన తెలుగు మహిళ రాష్ట్ర కమిటీలో 23 మందికి చోటు కల్పించారు. వీరికి శనివారం తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా భవనం షకీలా రెడ్డి ఇప్పటికే నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ధనకాడ్ రాధిక (నల్గొండ పార్లమెంటు), అధికార ప్రతినిధిగా లక్ష్మి (నల్లగొండ పార్లమెంటు)తో పాటు ఆరుగురు కార్యనిర్వాహక కార్యదర్శులు, 15 మంది కార్యదర్శులు కొత్తగా నియమితులయ్యారు.

# ఉద్దానానికి ఊపిరి

## కిడ్నీ వ్యాధికి శాశ్వతంగా చరమగీతం పాడేలా ఏపీ ప్రభుత్వం చర్యలు

## రూ.700 కోట్లతో చేపట్టిన మంచి నీటి పథకం ట్రయల్ రన్‌కు సిద్ధం

- ఖర్చుకు వెనకాడకుండా ఏడాది పొడవునా నీటి సరఫరాకు ప్రాధాన్యత
- 100 కి.మీ దూరంలోని హీరమండలం నుంచి నీటి తరలింపు
- నదుల కింద, కొండలను తొలిచి భూగర్భ పైపులైన్ నిర్మాణం
- మొత్తంగా 1047 కి.మీ పొడవునా భూగర్భ పైపులైన్

గ్రౌండ్ రిపోర్ట్



మెలియాపుట్టి వద్ద నీటిని శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్‌లు

ఉద్దానం ప్రాంతం నుంచి మేడికొండ కోటిరెడ్డి, వడ్డే బాలశేఖర్: శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో ప్రజలు కిడ్నీ వ్యాధి బారిన పడి అల్లాడుతుంటే గత ప్రభుత్వాలు మాటలతో మభ్యపెడితే.. వైఎస్ జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో వేసిన అడుగులు ఫలితాలివ్వడానికి సిద్ధమయ్యాయి. నాలుగు దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న నీటి సమస్య పరిష్కారించడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే.. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రూ.700 కోట్లతో సమగ్ర రక్షిత మంచినీటి పథకం మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ప్రారంభోత్సవ దశకు చేరింది. హీరమండలం నుంచి తాగునీటిని తరలించే ప్రక్రియలో ఉపయోగించే నీటి మోటార్లకు మూడు, నాలుగు రోజుల్లో ట్రయల్ రన్ మొదలవ్వనుంది.

**దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యం**

ఉద్దానం ప్రాంతంలో అక్కడి భూగర్భ జలాలనే తాగునీటిగా ఉపయోగించడం వల్ల కిడ్నీ వ్యాధులు ప్రబలుతున్నాయనే వాదన ఉంది. ప్రజల్లో కూడా ఇదే విషయమై ఆందోళన ఉంది. అయితే ఇప్పుడు కూడా ఆ ప్రాంతంలో కొన్ని మంచినీటి పథకాలు ఉన్నా.. అవి ఎక్కువగా స్థానికంగా బోర్లు వేసి సరఫరా చేసేవే. మరోవైపు.. తక్కువ ఖర్చుతో ఉద్దానం ప్రాంత సమీపంలో ఉండే బహుదా, మహేంద్ర తనయ నదుల నుంచి రక్షిత నీటి సరఫరాకు అవకాశం ఉన్నా, వేసవిలో ఆ నదులు ఎండిపోతే ప్రజలు బోరు నీటిని తాగక తప్పదని జగన్ సర్కార్ ఆ ప్రతిపాదనను మొదట్లోనే పక్కన పెట్టింది. ఏడాది పొడవునా నీరు అందుబాటులో ఉండేలా ఖర్చు ఎక్కువైనా సరే వెనుకాడకుండా హీరమండలం రిజర్వాయర్ నుంచి నీటి తరలింపునకు పూనుకుంది. ఉద్దానం ప్రాంతం మొత్తానికి ఏడాది పొడవునా నీటి అవసరానికి ఒక టీఎంసీ కన్నా తక్కువ నీరే అవసరం ఉంటుంది. హీరమండలం రిజర్వాయర్ కనీస నీటి మట్టం 2.67 టీఎంసీలు ఉండటం వల్ల ఉద్దానం ప్రాంతానికి నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

**జగన్ ప్రభుత్వ 'భగీరథ'యత్నం**

హీరమండలం రిజర్వాయర్ నుంచి ఉద్దానం ప్రాంతానికి నీటి తరలింపు అషామాషీ కాకపోయినా ప్రభుత్వం పట్టుదలగా పనులు చేపట్టి పూర్తి చేసింది. ఈ ప్రక్రియలో ఏకంగా 1,047 కిలోమీటర్ల పొడవునా భూగర్భ పైపులైన్ల నిర్మాణం చేశారు. రోజూ 8.40 కోట్ల లీటర్ల మేర తాగునీరు ఆ భూగర్భ పైపు లైను ద్వారా వెళ్లేలా పనులు చేపట్టారు. కేవలం రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ మోటార్లు ఒక్కొక్కటి నిమిషానికి 28 వేలకు పైగా లీటర్ల నీటిని పంపింగ్ చేయగలవు. ఈ నీరు ఎగుడు దిగుడు కొండలు, మైదాన ప్రాంతాలు దాటుకుంటూ.. మధ్యలో మరే మోటార్ల అవసరం లేకుండా 32 కిలోమీటర్ల దూరంలోని మిలియపుట్టి శుద్ధి కేంద్రానికి చేరతాయి. అత్యవసర సమయాల్లో ఉపయోగించడానికి మూడో మోటార్‌ను అదనంగా ఏర్పాటు చేశారు. నీటి తరలింపు మార్గంలో వంశధార నది ఉండటంతో నదీ గర్భంలో దాదాపు అర కిలోమీటర్ మేర పైపు లైన్ నిర్మాణం చేశారు. కొన్ని చోట్ల కొండలను తొలిచి పైప్‌లైన్ వేశారు. ఒక్కసారిగా 73 మీటర్ల ఎత్తుకు.. ఆపై 50 మీటర్లు దిగువకు.. మళ్లీ 147 మీటర్ల ఎత్తున ఉండే కొండపైకి.. మళ్లీ దిగువకు పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. మరో మాటలో చెప్పాలంటే భగీరథ యత్నమే చేశారు.

**కరోనా లేకుంటే ఇప్పటికే అందుబాటులోకి..**

ఉద్దానం ప్రాంతంలో కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లోని గ్రామాల పరిధిలో కిడ్నీ సమస్య ఉంది. ఈ సమస్యకు అసలు కారణం ఏమిటన్నది ఇంత వరకు స్పష్టంగా నిర్ధారణ కానప్పటికీ.. ఆ ప్రాంత ప్రజలు తాగునీటి అవసరాలకు అక్కడి భూగర్భ జలాలు వినియోగించడం ఒక కారణం కావొచ్చనే నిపుణుల అనుమానాల మేరకే జగన్ ప్రభుత్వం నివారణ చర్యలు మొదలుపెట్టింది. సురక్షిత తాగునీటి సరఫరాకు ఉద్దేశించి ఈ మంచినీటి పథకానికి సీఎం జగన్ 2019 సెప్టెంబర్ 6న శంకుస్థాపన చేశారు. తర్వాతి సంవత్సరంలోనే కరోనా వ్యాప్తి మొదలైంది. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్ విధింపు, మరుసటి ఏడాది కూడా రెండో దశ కరోనా వ్యాప్తి కారణంగా ప్రపంచమే స్తంభించిపోయింది. ఈ ప్రభావం మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంపైనా పడింది. ఈ సమస్య లేకుంటే ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చి ఉండేది.

**బాబు, పవన్.. మాటలతోనే సరి**

గత చంద్రబాబు ప్రభుత్వం ఉద్దానం సమస్య పరిష్కారం పూర్తిగా పక్కన పెట్టిందనే చెప్పాలి. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక తొలి మూడు సంవత్సరాల పాటు ఈ సమస్యను పరిష్కరించేందుకు ఒక్క చర్యా చేపట్టలేదు. చివరి ఏడాది 2018లో కేంద్ర పరిశోధన సంస్థ ఐసీఎంఆర్, జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ సంస్థలతో ఉద్దానం కిడ్నీ సమస్యపై పూర్తి స్థాయి అధ్యయనం చేయిస్తామని ప్రకటించారు. అది కూడా ప్రకటనకే పరిమితమైంది. అప్పట్లో తెలుగుదేశం మిత్రపక్షంగా ఉన్న జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ 2018 మే లో ఒకట్రెండు రోజుల పాటు శ్రీకాకుళం జిల్లాలో దీక్షలంటూ హడావుడి చేశారు. ఆ తర్వాత అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఒకసారి సమావేశమై ఆ సమస్యను పూర్తిగా వదిలేశారు.

# కన్నకొడుకే కాలయముడా..?

- భద్రాద్రి జిల్లా సారపాకలో వ్యక్తి దారుణహత్య
- పెద్దసుత్తితో తలపై కొట్టి చంపిన వైనం
- డ్రగ్స్‌కు బానిసైన కుమారుడిపైనే అనుమానం



రఫీ (ఫైల్)

బూర్గంపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో శుక్రవారం అర్ధరాత్రి ఐటీసీలో కాంట్రాక్ట్ కార్మికుడైన సయ్యద్ రఫీ(38) ఇంట్లోనే హత్యకు గురయ్యాడు. ఈ కేసులో రఫీ కుమారుడి(15)పైనే పోలీసులు అనుమానిస్తున్నారు. రఫీకి, భార్య జీనత్‌కు మధ్య కుటుంబ కలహాలున్నాయి. వీరి కుమారుడు 9వ తరగతిలో చదువు మానేశాడు. ఏడాది కాలంగా గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి ఇంట్లో తండ్రితో గొడవపడుతుండేవాడు. 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆ బాలుడు శుక్రవారం ఉదయం తిరిగి వచ్చాడు. ఇన్ని రోజులు ఎక్కడికెళ్లావని తండ్రి నిలదీయగా, ఇద్దరి మధ్య గొడవ జరిగింది. శుక్రవారం ఐటీసీ డ్యూటీకి వెళ్లి వచ్చిన రఫీ ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో అతని కొడుకే పెద్ద సుత్తితో మోది హత్య చేశాడని స్థానికులు అనుమానిస్తున్నారు. పోలీసు జాగిలాలతో నిందితుల కోసం గాలింపు చేపట్టగా హత్యకు ఉపయోగించిన పెద్ద సుత్తి మోతె గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో లభించింది. అక్కడికి సమీపంలోనే రక్తపు మరకలతో ఉన్న రఫీ కుమారుడు దుస్తులను కూడా పోలీసు జాగిలాలు గుర్తించాయి. దీంతో రఫీ కొడుకును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, తన అన్నను ఆయన కుమారుడు, భార్య కలసి హత్య చేశారని మృతుడి సోదరుడు సయ్యద్ బాజీబాబా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పాల్వంచ డీఎస్పీ వెంకటేష్, సీఐ నాగరాజు, ఎస్సై సంతోష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

# ఖమ్మం మార్కెట్‌లో అగ్నిప్రమాదం

## రూ. 41.31 లక్షల విలువైన 1,519 బస్తాల పత్తి దగ్ధం



ఖమ్మం మార్కెట్‌లో దగ్ధమవుతున్న పత్తి నిల్వలు

ఖమ్మం వ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పత్తి యార్డులోని షెడ్డులో నిల్వ ఉంచిన ఓ ట్రేడర్ గ్రూపునకు చెందిన 1,519 బస్తాల పత్తి ఈ ఘటనలో అగ్నికి ఆహుతైంది. ఈ పత్తి విలువ రూ.41.31 లక్షలు ఉంటుందని అంచనా. శ్రీశివ గణేష్ కృష్ణ ట్రేడర్స్ వ్యాపారి చిత్తూరి శ్రీనివాస్ కొనుగోలు చేసిన 1,809 బస్తాల పత్తిని షెడ్డులో నిల్వ చేయగా శనివారం మధ్యాహ్నం నిప్పంటుకుంది. సిబ్బంది స్పందించి 290 బస్తాలను బయటకు లాగేసినప్పటికీ, 1,519 బస్తాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. పత్తి క్వింటాకు రూ.6,800 చొప్పున లెక్కించి రూ.41,31,680 విలువైన పత్తి అగ్ని ప్రమాదంలో కాలిపోయిందని అధికారులు వెల్లడించారు. షెడ్డులో నిల్వ చేసిన పత్తి బస్తాలకు నిప్పు ఎలా అంటుకున్నదీ తెలియడంలేదు. అగ్ని ప్రమాదం జరిగిన షెడ్డు వైపు సీసీ కెమెరాలు లేకపోవటంతో కారణాలు గుర్తించలేకపోతున్నారు. కాగా, నేలకొండపల్లి నుంచి అగ్నిమాపక యంత్రాన్ని కొద్ది నెలల క్రితం ఖమ్మం మార్కెట్‌కు కేటాయించారు. కానీ మే నెలలో మార్కెట్‌కు వేసవి సెలవులు ప్రకటించగా యంత్రాన్ని తిరిగి నేలకొండపల్లి పంపించారు. ఈనెల 6న మార్కెట్ పునఃప్రారంభమైనా యంత్రాన్ని రప్పించలేదు. ఖమ్మం, నేలకొండపల్లి నుంచి అగ్నిమాపక యంత్రాలు వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

# కిలో పెంచి పన్ను తప్పించి..!

- జీఎస్టీ తప్పించుకునేందుకు ఎత్తుగడ
- 25కు బదులు 26కిలోల బరువుతో అమ్మకం





మంచిర్యాలలోని స్టోర్‌లో 26కిలోల బియ్యం సంచి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నుంచి తప్పించుకునేందుకు వ్యాపారులు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. బియ్యం, కొన్ని ఆహార ఉత్పత్తులపైన 25కిలోలు, ఆలోపు ఉంటే కేంద్రం 5శాతం జీఎస్టీ విధిస్తోంది. అదే సమయంలో 25కిలోల కంటే ఎక్కువ ఉంటే జీఎస్టీ నుంచి మినహాయింపు లభిస్తోంది. ఇన్నాళ్లు 25కిలోల సంచుల్లోనే బియ్యం వస్తుండేది. గత కొద్దిరోజులుగా పన్ను తప్పించుకునేందుకు 26కిలోల బియ్యం సంచులు మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. ఇక వినియోగదారులకు 25కిలోలు అవసరమున్నా పన్ను తప్పించుకునేందుకు తప్పనిసరిగా కొత్తగా వస్తున్న ప్యాకింగ్ సంచులతో ఆ ధరలతోనే విక్రయించాల్సి వస్తోంది. లోకల్ మిల్లుల నుంచి రిటైల్ షాపులకు విక్రయిస్తున్న కొన్ని చోట్ల మాత్రం ఇంకా 25కిలోల చొప్పునే లావాదేవీలు సాగుతున్నాయి. జిల్లా నుంచి కాకుండా వేరే చోట్ల నుంచి వస్తున్న బియ్యం సంచులు కిలో అదనంగా బరువుతోనే వస్తున్నాయి. ఇందులో బ్రాండెడ్ లేబుల్ ఉన్న బియ్యానికి తప్పనిసరిగా కిలో అదనంగానే అమ్ముతున్నారు. బియ్యంపై జీఎస్టీ అమలులోకి రాకముందే వాణిజ్య, పన్నుల శాఖ నుంచి పన్ను వసూలు చేస్తున్నారు. ఈ విధానం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తీరుగా ఉండేది. జీఎస్టీ రాకతో ఒకే తరహా విధానం అమలవుతోంది. 47వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం తర్వాత అన్ని రాష్ట్రాల సమ్మతితోనే 5శాతం పన్ను నిర్ణయం తీసుకున్నారు. దీంతో పన్నుల రూపంలో భారీగా సర్కారు ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది. అదే సమయంలో వినియోగదారులపైనా భారం తగ్గుతోంది. కానీ కిలో అదనంగా కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇదే విషయమై మంచిర్యాల వాణిజ్య పన్నుల సహాయ శాఖ అధికారి శ్రీనివాస రావును 'సాక్షి' సంప్రదించగా జీఎస్టీ చట్ట సవరణ చేసి ఈ విధానాన్ని తెచ్చారని, బియ్యం 25కిలోల కంటే అధికంగా ఉంటే పన్ను వేసే అవకాశం లేదని తెలిపారు. అంతకంటే తక్కువగా ఉంటే మాత్రం పన్నులు వసూలు చేస్తామని స్పష్టం చేశారు.

### హైమన్‌డార్ఫ్ స్ఫూర్తితో మార్లవాయి అభివృద్ధి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న కనకరాజు

నార్నూర్(జైనూర్): హైమన్‌డార్ఫ్ స్ఫూర్తితో మార్లవాయి గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం జైనూర్ మండలం మార్లావాయి గ్రామాన్ని సందర్శించారు. పద్మశ్రీ కనకరాజుతో ముచ్చటించారు. అనంతరం ఆదివాసీ ఆత్మబంధువు హైమన్ డార్ఫ్, బెట్టి ఎలిజిబెత్ దంపతులకు నివాళి అర్పించారు. కాటేజ్, గుస్సాడీ శిక్షణ కేంద్రం, హైమాన్ డార్ఫ్ భవన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. హైమన్ డార్ఫ్ రాసిన 1946–1948 నివేదిక పుస్తకాన్ని గ్రామస్తులు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్లవాయి గ్రామాభివృద్ధికి సహకారాలు అందిస్తామన్నారు. ఐటీడీఏ డీఈ శివప్రసాద్, జేఈ ఇందల్, గ్రామ పటేల్ ఆత్రం భగవంత్‌రావు, మార్లావాయి రాయి సెంటర్ సార్‌మేడి జుగ్నాక దేవురావు ఉన్నారు.

# 12న రాష్ట్రపతి ముర్మతో గిరిజనుల భేటీ



సికింద్రాబాద్ నుంచి బయల్దేరుతున్న గిరిజనులు

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా ఆదిమ గిరిజనులకు అరుదైన అవకాశం లభించింది. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ కిస్టినా జెడ్ చొంగ్తూ సహకారంతో ఈ నెల 12న రాష్ట్రపతి ముర్మతో భేటీకి అవకాశం లభించింది. శుక్రవారం రాత్రి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి 30 మంది ఢిల్లీకి పయనం కాగా.. వీరిలో ఆదిలాబాద్ జిల్లా నుంచి కొలాం తెగకు చెందిన 15మంది, తోటి తెగకు చెందిన 15మంది ఉన్నారు. ఆదిమ గిరిజనుల జీవన విధానం, ఆర్థిక పరిస్థితి, విద్యావిధానం, సంస్కృతి, ఆచార వ్యవహారాలు తెలుసుకుని వారి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడానికి రాష్ట్రపతి ముర్మ, భారత ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని ఐటీడీఏ అధికారులు తెలిపారు. రాష్ట్రపతి భవన్, గార్డెన్ సందర్శన, రాష్ట్రపతితో ముఖాముఖి, సహపంక్తి భోజనం, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. 13న ఢిల్లీ పరిసరాల్లోని పర్యాటక ప్రాంతాలను సందర్శించి పరిశీలించి 15న జిల్లాకు చేరుకుంటారు. ఈ మహిళా బృందానికి జీసీడీఓ మెస్రం చాయ లైజన్ అధికారిగా బాధ్యత నిర్వహిస్తున్నారు. రాష్ట్ర గిరిజన కార్యాలయం నుంచి క్రిడా అధికారి జ్యోతి, సూపరింటెండెంట్ పద్మజ, అధికారులు సుధాకర్, ఐటీడీఏ అధికారులు రాంబాబు, నాగభూషణం పాల్గొంటున్నారు.

# నిపుణ్ భారత్ విజయవంతానికి కార్యశాల



ఢిల్లీలో జరిగిన కార్యశాలలో రాష్ట్ర బృందం

మంచిర్యాలఅర్బన్: భారత ప్రభుత్వం 2026లోపు మూడో తరగతి పిల్లలందరూ భాష, సంఖ్యా సామర్థ్యాల్లో పూర్తిస్థాయి నైపుణ్యత సాధించేందుకు నిపుణ్ భారత్ మిషన్(ఎఫ్ఎల్ఎన్) చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమర్థవంతమైన నాయకత్వం అవసరమని గుర్తించింది. ప్రతీ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు సమర్థవంతమైన నాయకుడిగా ఎదగడానికి కావాల్సిన అంశాలపై ఎన్సీఎస్ఎల్, ఎన్సీఆర్టీసీ సంయుక్తంగా నాలుగు రోజులపాటు కార్యశాల నిర్వహించింది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్, ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్(ఎన్‌సీఈఆర్టీ) క్యాంపస్ ఢిల్లీలో ఈ నెల 7నుంచి 10వరకు చేపట్టిన కార్యశాల ముగిసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక, హిమచల్‌ప్రదేశ్, జమ్మూ, కశ్మీర్ రాష్ట్రాల నుంచి ఐదుగురు చొప్పున సభ్యులు కార్యశాలకు హాజరయ్యారు. తెలంగాణ నుంచి రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ఎస్కే తాజ్‌బాబు, సిద్దిపేట జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ భాస్కర్, హనుమకొండ జిల్లా ప్రాథమిక పాఠశాలకు చెందిన రామచంద్రారెడ్డి, మంచిర్యాల జిల్లా నుంచి క్వాలిటీ కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, దండేపల్లి మండలం రెబ్బనపల్లి పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయురాలు అర్చన పాల్గొన్నారు.

**నాలుగు రోజులు**

నాలుగు రోజులపాటు నిర్వహించిన కార్యశాలలో నిపుణ్ భారత్ మిషన్‌లో అనేక అంశాలపై చర్చించారు. ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలు, సాధించిన ఫలితాలు, లక్ష్యాలు చేరుకునే కార్యాచరణ ప్రణాళిక తదితర వాటిపై ఎన్సీఈఆర్టీ, ఎన్సీఎస్ఎల్, సీఐఈటీ ప్రతిష్టాత్మక సంస్థలకు చెందిన అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు మార్గనిర్దేశం చేశారు. శిక్షణ తరగతుల్లో చర్చించిన అంశాలను రాష్ట్ర అధికారులకు నివేదించి పాఠశాల స్థాయికి చేర్చడానికి విధివిధానాలను రూపొందించుకోవాలని కార్యక్రమ నిర్వాహకులు సూచించినట్లు జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి తెలిపారు.

# అగ్రికల్చర్ పాలిటెక్నిక్ నోటిఫికేషన్ విడుదల

- పాలిసెట్–2023 (అగ్రికల్చర్) ర్యాంకుల ద్వారా సీట్ల భర్తీ
- దరఖాస్తుల దాఖలు గడువు ఈనెల 24



వ్యవసాయ పనులు చేస్తున్న అగ్రికల్చర్ విద్యార్థినులు

జగిత్యాలఅగ్రికల్చర్: పదోతరగతి పూర్తయిన గ్రామీణ విద్యార్థులకు అగ్రికల్చర్ పాలిటెక్నిక్ వరంగా మారింది. రెండేళ్ల కోర్సు పూర్తిచేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా లభిస్తుండడంతో డిమాండ్ బాగా పెరిగింది. ముఖ్యంగా వ్యవసాయంపై అభిరుచి ఉన్నవారు, రైతుబిడ్డలు మరింత వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని, పంటల్లో అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంది. ఈ కోర్సులు చదివాక ఉన్నత విద్యాభ్యాసం చేయాలంటే ఎంసెట్‌తో సంబంధం లేకుండా బీఎస్సీ (అగ్రికల్చర్) కోర్సులో నేరుగా ప్రవేశం పొందే వీలుంది. డిప్లొమో పూర్తిచేసిన వారికి బీఎస్సీ అగ్రికల్చర్‌లో 15 శాతం సీట్లు రిజర్వ్ చేస్తారు.

**సీట్ల వివరాలు..**

- దరఖాస్తులను బట్టి సీట్లను కౌన్సెలింగ్ పద్ధతిన భర్తీ చేస్తారు.
- రెండేళ్ల అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లు : 10 ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్‌ల్లో 220 సీట్లు, 7 ప్రైవేట్ కళాశాలల్లో 450 సీట్లు ఉన్నాయి.
- మూడేళ్ల అగ్రికల్చర్ ఇంజినీరింగ్ డిప్లొమో కళాశాలలు : ఒక ప్రభుత్వ కళాశాలలో 20 సీట్లు, మూడు ప్రైవేట్ కళాశాలలో 90 సీట్లు ఉన్నాయి.
- రెండేళ్ల క్రితం ప్రవేశపెట్టిన రెండేళ్ల ఆర్గానిక్ అగ్రికల్చర్ డిప్లొమో కళాశాల ఒకటి ఉండగా, అందులో 60 సీట్లు ఉన్నాయి.
- ఈ కళాశాల వికారాబాద్ జిల్లా గింగుర్తిలో ఉంది.
- ఏకలవ్య ప్రైవేట్ కళాశాల యాజమాన్యం దీనిని నిర్వహిస్తోంది.
- ఈ కోర్సులన్ని కూడా ఇంగ్లిష్ మీడియంలో అందుబాటులో ఉన్నాయి.
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండు పాలిటెక్నిక్‌లు ఉండగా, ఒకటి జగిత్యాల జిల్లా పొలాస, రెండోది కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ఉన్నాయి.
- ప్రతీ అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో 20 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

**అర్హత వివరాలు..**

ఈ ఏడాది అగ్రికల్చర్, ఆర్గానిక్ అగ్రికల్చర్, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ కోర్సులు చదివేందుకు పదోతరగతి పాసై, పాలిసెట్–2023 అగ్రికల్చర్ విభాగంలో పరీక్ష రాసిన వారు అర్హులు. మున్సిపల్ ఏరియాలో కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో నాలుగేళ్ల పాటు చదివిన విద్యార్థులకు 60శాతం సీట్లు రిజర్వ్ చేశారు. ఈసారి పట్టణ ప్రాంతాల అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయస్సు 15–22 ఏళ్ల మధ్య ఉండాలి. పాలిసెట్–2023(అగ్రికల్చర్ విభాగం)లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా సీట్లను కౌన్సెలింగ్ పద్ధతిన కేటాయిస్తారు.

**దఖాస్తుల దాఖలుకు ఈనెల 24**

- ఆన్‌లైన్ పద్ధతిన దరఖాస్తుల స్వీకరణ గురువారం ప్రారంభమైంది.
- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ.600, ఇతరులు రూ.1,100 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి.
- ఫీజు ఫేమెంట్ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ.. జూన్ 24.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించేందుకు ఆఖరు తేదీ జూన్ 26.
- ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు లభిస్తే.. మొదటి సెమిష్టర్‌కు రూ.19,945, ప్రైవేట్ కళాశాలల్లో రూ.22,210 ఫీజు చెల్లించాలి.
- మరిన్ని వివరాలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్శిటీ వెబ్‌సైట్ పీజేటీఎస్ఏయూలో సంప్రదించవచ్చు.

**అభిరుచి ఉన్నవారికి మేలు**



వ్యవసాయంపై ఆసక్తి, అభిరుచి ఉన్నవారికి వ్యవసాయ పాలిటెక్నిక్ మంచి అవకాశం. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసింది. పదోతరగతి చదివి, పాలిసెట్–2023 అగ్రికల్చర్ రాసినవారు ఈనెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

– శ్రీనివాస్, ప్రిన్సిపాల్, వ్యవసాయ పాలిటెక్నిక్, పొలాస

# 'గోస' వీడియో పాట ఆవిష్కరణ

- ఆవిష్కరించిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



'గోస' వీడియో పాటను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, పెద్దింటి అశోక్‌కుమార్.

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ రాసి, నటించిన సందేశాత్మక వీడియో పాట 'గోస'ను ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ శనివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. తండ్రీకొడుకుల మధ్య అనుబంధాన్ని, నేటితరం తల్లిదండ్రుల దీన స్థితిని సామాజిక పరిస్థితులకు అనుగుణంగా 'గోస' వీడియో పాటను రూపొందించారు. ఈ పాటను భిక్షపతియాదవ్ పాడగా.. చందు స్వరకల్పన చేశారు. సినీగేయ రచయిత వెంకట్ బాలగోని దర్శకత్వం వహించారు. శివ తరుణి, చైతన్య వాణి, అంబాల నటించారు. గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన పెద్దింటి అశోక్‌కుమార్ రెండున్నర దశాబ్దాలుగా కథకుడిగా, నవలా రచయితగా, సినీపాటలు, మాటల రచయితగా గుర్తింపు పొందారు. తాజాగా 'గోస' వీడియో పాటలో నటించడం విశేషం.

# వైరల్

## ఐశ్వర్య సరే... అతడు ఎవరు?

‘షాహిద్ కపూర్ ఎవరు?’ అనే ప్రశ్నకు ‘బాలీవుడ్ ప్రముఖ కథానాయకుడు’ అని జవాబు చెప్పడానికి అట్టే టైమ్ పట్టదు. హీరో కావడానికి ఎంత టైమ్ పట్టిందో తెలియదుగానీ, బ్యాక్‌గ్రౌండ్ డ్యాన్సర్‌గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాడు షాహిద్. కొరియోగ్రాఫర్ షియామక్ దావర్ డ్యాన్స్ ట్రూప్‌లో పని చేస్తున్న కాలంలో



సుభాష్ ఘాయ్ ‘తాళ్’ సినిమాలో ఐశ్వర్య రాయ్ నృత్యం చేసిన ‘జంగిల్ మే బోలే కోయల్ కుక్కూ’ పాటలో డ్యాన్సర్‌లలో ఒకరిగా అవకాశం వచ్చింది.

బాలీవుడ్‌లోకి అడుగు పెట్టి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆరోజు గురించి ఆర్‌జే రోహిణికి ఇంటర్వ్యూ ఇస్తూ ‘వరస్ట్ అండ్ ది బెస్ట్ డే ఆఫ్ మైలైఫ్’ అని చెప్పాడు షాహిద్. అందాల తార పక్కన డ్యాన్స్ చేసే అవకాశం అదృష్టమే కదా...మరి ‘వరస్ట్ డే’ అంటాడు ఏమిటి! అనే డౌట్ రావచ్చు. విషయం ఏమిటంటే ఆరోజు షూటింగ్‌కు వస్తున్న షాహిద్ బైక్ మీది నుంచి పడ్డాడు. అదీ విషయం. ‘తాళ్’ సినిమా పాటలో ‘షాహిద్ ఎక్కడ?’ అంటూ నెటిజనులు సెర్చింగ్ మొదలు పెట్టారు. ఐశ్వర్యరాయ్ పక్కన ఉన్న అల నాటి షాహిద్ ఫొటో వైరల్ అయింది.

## లక్షితా... ఎక్కడున్నావు? ఎలా ఉన్నావు?




ప్రతి ఒక్కరికీ ప్రైమరీ స్కూల్ ఫ్రెండ్స్ ఉంటారు. హైస్కూల్, కాలేజీ ఫ్రెండ్స్ టచ్‌లో ఉన్నంతగా ప్రైమరీస్కూల్ ఫ్రెండ్స్‌లో చాలా తక్కువమంది మాత్రమే టచ్‌లో ఉంటారు. అయితే వారి చిత్రాలు మన మదిలో ప్రింటై పోయి ఉంటాయి. ఏదో ఒక సమయంలో వారు గుర్తుకు వస్తుంటారు. ఇన్‌స్టాగ్రామ్ యూజర్ నేహాకు తన ఎల్‌కేజీ ఫ్రెండ్ లక్షిత గుర్తుకు వచ్చింది.

‘ఎక్కడ ఉందో? ఎలా ఉందో’ అనే ఆసక్తి మొదలైంది. వెంటనే ‘ఫైండింగ్ లక్షిత’ పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఎకౌంట్ క్రియేట్ చేసింది.

నేహా ఆన్‌లైన్ సెర్చ్ జర్నీకి లక్షలాది లైక్ వచ్చాయి అనేది ఒక విషయం అయితే, మరో విశేషం... నేహాను అనుసరిస్తూ ఎంతోమంది తమ ఎల్‌కేజీ ఫ్రెండ్స్‌ను వెదుక్కునే పనిలో పడ్డారు. ఇదొక ట్రెండ్‌గా మారింది.

‘నా ఎల్‌కేజీ ఫ్రెండ్ జాడ కోసం నేను కూడా నేహాలాగే చేశాను. ఇదొక మంచి ఐడియా. ఏదో ఒకరోజు నా ఫ్రెండ్ గురించి కచ్చితంగా తెలుసుకుంటాను’ అని ఒక యూజర్ రాసింది.

## మెరుపులా వచ్చి కాపాడింది



పశ్చిమబెంగాల్‌లోని పుర్బ మేదినీపూర్ రైల్వేస్టేషన్‌లో... ప్లాట్‌ఫామ్‌పై నిల్చున్న ఒక వ్యక్తి ఉన్నట్టుండి పట్టాలపై తలపెట్టి పడుకున్నాడు. అటు నుంచి రైలు వస్తోంది.

అవతలి ప్లాట్‌ఫామ్‌పై ఉన్న కె.సుమతి అనే రైల్వే కానిస్టేబుల్ మెరుపు వేగంతో పరుగెత్తుకు వచ్చి అతడిని పట్టాల మీది నుంచి బలవంతంగా లాక్కెళ్లింది.

ఏమాత్రం ఆలస్యం అయినా అతడు చనిపోయేవాడు.

దీనికి సంబంధించిన సీసీటీవి ఫుటేజిని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్), ఇండియా ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తే సుమతిపై ప్రశంసలు వెల్లువెత్తాయి.

‘రైల్వేశాఖ మాత్రమే కాదు యావత్ దేశం గర్వించదగిన మహిళ’

‘అంకితభావంతో కూడిన విధి నిర్వహణకు మానవత్వం, సాహసం తోడైతే... ఆ పేరు సుమతి’... ఇలాంటి కామెంట్స్ ఎన్నో నెటిజనుల నుంచి వచ్చాయి.

గత సంవత్సరం జార్ఖండ్‌లోని టాటానగర్ రైల్వేస్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ ఎస్‌కే మీనా ఒక వ్యక్తి రైలుకింద పడకుండా కాపాడిన వీడియో వైరల్ అయింది.

## ఎలానూ... ఇలా అయినవేంది!!






ఏఐ ఆర్టిస్ట్ తలుచుకుంటే ఏమైనా చేయగలడు... అన్నట్లుగా తయారైంది పరిస్థితి. సదరు నౌఫాల్ అనే ఏఐ ఆర్టిస్ట్ తన ఆర్ట్‌తో బిలియనీర్ ఎలాన్ మస్క్‌ను అమెరికా నుంచి ముంబైకి తీసుకువచ్చి ఛాయ్‌వాలాగా మార్చాడు.

ఈ ‘చాయివాలా-ఎలాన్ మస్క్’ ఇమేజ్ అంతర్జాల లోకంలో తెగ వైరల్ అయింది. ట్విట్టర్‌లో వేగంగా రెండు మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. అంతర్జాల లోకవాసులు ఒకరిని మించి ఒకరు ఫన్నీగా కామెంట్స్ పెడుతున్నారు.

‘ఎలాన్... ఏమైనా చేయగలడు!’, ‘ఏఐ టెక్నాలజీతో గరం ఛాయ్ తయారుచేస్తున్నాడు!’... ఇలాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి.

మరో ఏఐ ఆర్టిస్ట్ ఎలాన్‌ను ఏకంగా బేబీగా మార్చేశాడు.

‘బ్రేకింగ్‌న్యూస్: ఎలాన్ మస్క్ యాంటీ ఏజింగ్ ఫార్ములాపై పనిచేస్తున్నాడు. దాని ఫలితమే ఈ ఫొటో’ అనే కాప్షన్ ఆకట్టుకుంటోంది.

‘మార్స్ పైకి వెళ్లడానికి మస్క్‌కు ఇప్పుడు బోలెడు సమయం దొరికింది’... అని ఒకరు కామెంట్ పెట్టారు.

## బతుకు పోరు



‘ఈ కర్మభూమిలో ప్రతి అడుగులో ఒక కథ వినిపిస్తుంది’ అంటుంది ఇంజా రోజియ. అమెరికన్ టూరిస్ట్ రోజియ ఇటీవల తన స్నేహితురాలితో కలిసి రాజస్థాన్‌లోని పుష్కర్ నగరానికి వచ్చింది.

బిడ్డను ఒళ్లో పడుకోబెట్టుకొని ఎర్రటి ఎండలో కూర్చున్న గుడియ అనే మెహందీ ఆర్టిస్ట్ కనిపించింది. మెహందీ వేయించుకుంటూ గుడియతో కబుర్లలో పడింది రోజియ. తెలిసీ తెలియని ఇంగ్లీష్‌లోనే తన జీవితకథను రోజియతో పంచుకుంది గుడియ.

రోజియ వయసే ఉన్న గుడియకు నలుగురు పిల్లలు. విద్యుత్ సౌకర్యం కూడా లేని చిన్న పల్లెలో ఉండేది. తల్లిదండ్రులు చనిపోయారు. భర్త తాగుబోతు. ఎప్పుడూ ఏదో రకంగా హింసించేవాడు. భర్త పెట్టే బాధలు భరించలేక పిల్లల్ని తీసుకొని పట్టణానికి వచ్చింది.

తనకు తెలిసిన ‘మెహందీ ఆర్ట్’తో బతుకుబండి లాగిస్తోంది అంటూ గుడియ గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది రోజియ. ‘నా జీవితం ఇలా అయిపోయింది... అంటూ ఆమె కన్నీళ్లతో బాధ పడలేదు. ఎవరి మీదో ఫిర్యాదు చేస్తున్నట్లుగా లేదు. జరిగిందేదో జరిగింది. బతుకుపోరు చేస్తాను...అనే స్ఫూర్తి ఆమెలో బలంగా కనిపించింది. గుడియ నలుగురు పిల్లలకు తల్లి. తల్లి ప్రేమకు ఉన్న శక్తి ఏమిటంటే జీవితంలో ఎన్నో యుద్ధాలను గెలిచేలా చేస్తుంది’ అంటూ రాసింది రోజియ.

# విమానం ఎక్కకుండా ప్రపంచాన్ని చుట్టేశాడు

**2013 అక్టోబర్ 10న డెన్మార్క్‌లోని ఇంటి నుంచి బయలుదేరాడు థోర్.**
**3,512 రోజుల తర్వాత 203 దేశాలు చూసి మే 23, 2023న మాల్దీవుల్లో యాత్ర ముగించాడు.**
**విమానం ఎక్కకుండా ఇలా ప్రపంచాన్ని చుట్టినవాడు ఇతడే.**
**‘ఇన్ని దేశాలు తిరగడం ఎందుకు?’ అనంటే ‘అన్ని దేశాలు ఉన్నాయి కనుక’ అని జవాబు.**
**జూన్ 13న మాల్దీవుల నుంచి ఇంటికి మరలుతున్నాడు థోర్.**



‘తువాలు’, ‘టోంగా’, ‘సమోవా’, ‘పలావ్’, ‘నౌరు’, ‘కిరిబటి’.... ఇవేంటని అనుకుంటున్నారా? దేశాలు. ఇవి మీరు విని ఉండొచ్చు. వినకపోయి ఉండొచ్చు. ఏమంటే ఐక్యరాజ్య సమితిలో ఉన్న దేశాలు 193. ‘కాని ఇంకా ఉన్నాయి. అవి తమను తాము దేశాలుగా చెప్పుకుంటాయి. ఐక్యరాజ్యసమితి ఇంకా గుర్తించకపోవచ్చు’ అంటాడు థోర్. అందువల్ల థోర్ చుట్టి వచ్చిన దేశాల సంఖ్య అక్షరాలా 203. వీటిలో యూరప్ నుంచి 37, ఆసియా నుంచి 20, సౌత్ అమెరికా నుంచి 12, ఆఫ్రికా నుంచి 54... ఇలా ప్రపంచ పటంలోని అన్ని దేశాలు అతను చుట్టి వచ్చాడు.

**మనుషుల్ని కలవడానికి...**

‘స్నేహితుడు అని ఎవర్ని అనాలంటే అప్పటి దాకా పరిచయం కాని అపరిచితుణ్ణే’ అనే స్లోగన్‌తో థోర్ తన ప్రపంచ యాత్ర మొదలెట్టాడు. డెన్మార్క్‌కు చెందిన 44 ఏళ్ల ఈ వివాహితుడు కొంతకాలం మిలట్రీలో, ఆ తర్వాత షిప్పింగ్ లాజిస్టిక్స్‌లో పని చేశాడు. దేశాలు చూడటం పిచ్చి. కొత్త మనుషుల్ని కలవడం ఇష్టం. అందుకని ప్రపంచంలోని అన్ని దేశాలు చుట్టి రావాలనుకున్నాడు. అయితే డబ్బు పరిమితుల దృష్ట్యా, ఎటువంటి సవాలుకు వీలులేని విమానయానం ద్వారా కాకుండా రైళ్లు, ఓడలు, వాహనాల ద్వారా ప్రపంచం చుట్టాలనుకున్నాడు. దాదాపు పదేళ్ల పాటు ఇంటి ముఖం చూడకుండా తిరిగేశాడు.

**రోజుకు 20 డాలర్లు**

డెన్మార్క్‌కు చెందిన కొన్ని సంస్థల స్పాన్సర్‌షిప్‌తో యాత్ర మొదలెట్టాడు థోర్. ప్రయాణానికి, తిండికి, వీసా ఫీజులకు కలిపి రోజుకు కేవలం 20 డాలర్లు (1600 రూపాయలు) ఖర్చు చేస్తూ ఈ యాత్ర సాగించాలనుకున్నాడు. దొరికిన తిండి తినడం, ఫ్రీగా బస పొందడం... లాంటి పనుల ద్వారా ఇది సాధ్యమే అనిపించాడు. అతని యాత్రను బ్లాగ్‌లో, ఫేస్‌బుక్‌లో రాస్తూ వెళ్లడం వల్ల చదివిన పాఠకులు ఎప్పటికప్పుడు సహాయం చేస్తూ వెళ్లారు. దాంతో ఇన్ని రోజులు అతని విశ్వదర్శనం సాగింది. ‘ఒక్కో దేశంలో కేవలం 24 గంటలు మాత్రమే గడుపుతూ వెళ్లాను. ఎందుకంటే ఒక దేశం నుంచి ఇంకో దేశం ప్రయాణించడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఆ దారిలో మనుషుల్ని కలవడమే ఇష్టపడ్డాను’ అంటాడు థోర్. అతను తన ప్రయాణంలో భాగంగా మన దేశానికి డిసెంబర్ 12, 2018న వచ్చాడు.

**ప్రతిదీ లెక్క**

థోర్ తన ప్రయాణంలో ప్రతిదీ రికార్డు చేశాడు. ఏ మోసం లేకుండా ఎక్కడికక్కడ టికెట్లు పెడుతూ వెళ్లాడు. తన మొత్తం ప్రయాణంలో 351 బస్సులు, 158 ట్రైన్లు, 43 టుక్‌టుక్‌లు (ఆటో), 37 కంటైనర్ షిప్‌లు, 33 పడవలు, 9 ట్రక్కులు, 3 సెయిల్‌బోట్‌లు, 2 క్రూయిజ్ షిప్‌లు ఉపయోగించాడు. మే 23న మాల్దీవుల్లో ఇతని యాత్ర ముగిసింది. అయితే ఇన్నాళ్లూ కుటుంబానికి దూరంగా ఉన్నాడా? లేదు. అతని భార్య అతణ్ణి వెతుక్కుంటూ వెళ్లి కలిసేది. మొత్తం ఇన్ని రోజుల్లో 27 చోట్ల 27 సార్లు కలిసిందామె.

అన్నట్టు ఈ మొత్తం యాత్ర పేరు ‘ఒన్స్ అపాన్ ఏ సాగా’.

# హెల్త్

## చిన్న గురకనైనా... చికిత్సలతో నివారించాలెందుకంటే?



గురకను గాఢనిద్రకు సంకేతమని అనుకుంటారు. అది నిజం కాదు. అనారోగ్యానికి చిహ్నం. రాబోయే ఎన్నో ఆరోగ్య విపత్తులకు సూచన. గురకతో మెదడు, గుండెకు రక్తం అందకుండా పోయే ప్రమాదం ఉంది. దాంతో గుండెజబ్బులు, పక్షవాతం, రక్తప్రసరణ వ్యవస్థకు సంబంధించిన సీరియస్ జబ్బులకు దారితీసే ప్రమాదమూ ఉంది. అందుకే దాన్ని నివారించి తీరాలి. ఇందుకోసం శస్త్రచికిత్స లేకుండానే అనుసరించే ‘సీ ప్యాప్’ వంటి మార్గాలతో... లేదా దవడ శస్త్రచికిత్సతో దాన్ని చక్కదిద్దాలి. గురకతో ప్రమాదాలేమిటో, చిన్న గురకనైనా ఎందుకు చక్కదిద్దాలో తెలిపేదే ఈ కథనం.

నిద్రలో మిగతా కండరాల్లాగే గొంతు కండరాలూ రిలాక్స్ అవుతాయి. దాంతో అవి వేలాడినట్టుగా (ఫ్లాపీగా) అయిపోతాయి. దానివల్ల శ్వాస ప్రక్రియలో గాలిగొట్టం, అంగిలి ప్రకంపనలకు గురయి, శబ్దం వస్తుంది. అదే గురక! నిద్రలో రిలాక్స్ రావడం ద్వారా కుంచించుకుపోయిన శ్వాసనాళం అలా కాసేపు మూసుకుపోతుంది. కొద్దిసేపు మాత్రమే అలా ఉంటే ఆ కండిషన్‌ను ‘హైపాప్నియా’ అంటారు. ఆ స్థితి (కండిషన్) చాలాసేపు కొనసాగితే దాన్ని ‘ఆప్నియా’ అంటారు.

### ఎన్ని రకాల ముప్పులో...

● రాత్రిపూట వచ్చే గురకతో గొంతు ఫ్లాపీగా అవడం వల్ల ఆక్సిజన్ సరఫరా ఆగిపోతుంది కాబట్టి శ్వాసను పునరుద్ధరించేందుకు వారు నిద్రలేవడంతో మళ్లీ శ్వాసనాళం స్టిఫ్‌గా అయిఆక్సిజన్ సరఫరా అందుతుంటుంది. కానీ రాత్రంతా ఇదే జరుగుతూ ఉండటంతో నాణ్యమైన నిద్ర అందదు. దీన్నే ‘స్లీప్ డెఫిసిట్’ అంటారు. దాంతో పగలంతా డల్‌గా ఉంటారు. ఏ విషయంపైనా సరిగా దృష్టి కేంద్రీకరించలేకపోవడం, అర్థం చేసుకోలేకపోవడం, సమస్యలను పరిష్కరించే నేర్పు మందగించడం, సరైన నిర్ణయం తీసుకోవడంలో ఆటంకాలు ఉంటాయి. ఇవే వాహనం నడుపుతున్నప్పుడు ప్రమాదాలు జరగడానికీ కారణాలు కావచ్చు. ● స్లీప్ ఆప్నియా కారణంగా వచ్చే గురకతో... కుంగుబాటు, యాంగ్జైటీ, మూడ్స్ డిజార్డర్స్ వంటి మానసికమైన ఆరోగ్య సమస్యలూ వస్తాయి. ● స్లీప్ ఆప్నియా వల్ల అధిక రక్తపోటు, గుండెజబ్బులు వచ్చే ముప్పు ఉంది. తరచూ ఆక్సిజన్ మోతాదులు తగ్గిపోతూ ఉండటం వల్ల గుండె, రక్తప్రసరణ వ్యవస్థకు సంబంధించిన సమస్యలూ రావచ్చు. దీనివల్ల... గుండెపోటు, పక్షవాతం వంటి వాటికి దారితీసే ముప్పు ఉంటుంది.

● గురక కారణంగా జీవిత భాగస్వామికీ ఇబ్బంది కలగడం దాంతో వారి మధ్య సంబంధాలూ దెబ్బ

### శస్త్రచికిత్స అవసరం లేకుండానే...

రాత్రి నిద్ర సమయంలో ‘సీ ప్యాప్’ వంటి కొన్ని ఉపకరణాలు అమర్చడం ద్వారా గాలి తగినంత ఒత్తిడితో లోపలికి వెళ్లేలా చేసే చికిత్స ప్రక్రియలతో గురక వచ్చే వారికి చికిత్స చేస్తారు. ‘కంటిన్యువస్ పాజిటివ్ ఎయిర్ వే ప్రెషర్’ అనే మాటలకు సంక్షిప్త రూపమే ‘సీ ప్యాప్’. నోటికి అమర్చే ఇలాంటి ఉపకరణాల వల్లనే చాలామందిలో సమస్య చక్కబడే అవకాశం ఉంటుంది. కానీ కొందరికి శస్త్రచికిత్సేతర మార్గాలతో గురక తగ్గకపోవచ్చు. అలాంటివారిలో ఆకస్మిక ప్రమాదాల ముప్పు నివారణకు శస్త్రచికిత్సే మంచి మార్గమవుతుంది.

### ముప్పు నివారణ కోసం ఎమ్ఎమ్ఏ శస్త్రచికిత్స...

దేహనిర్మాణంలోని లోపాలను చక్కదిద్దడం ద్వారా గురక రాకుండా చూడటానికి సర్జరీ ఒక మార్గం. ఈ శస్త్రచికిత్సనే ‘మాక్సిల్లో మాండిబులార్ అడ్వాన్స్‌మెంట్’ (ఎమ్ఎమ్ఏ) సర్జరీ అంటారు. ఇందులో ఒక దవడకు తగినట్లుగా మరో దవడను చక్కదిద్దుతారు. అంటే ఒక్కోసారి పై దవడనూ, లేదా కింది దవడనూ లేదా కొన్ని సందర్భాల్లో రెండు దవడలనూ చక్కదిద్దుతారు. వెనక్కు పడిపోతున్నట్లుగా ఉన్న నాలుకను బయటికి వచ్చేలా సరిచేస్తారు. ఇలా శస్త్రచికిత్సతో చక్కదిద్దడంతోనే గురక కూడా మాయమైపోతుంది. ఫలితంగా గుండెజబ్బులు, గుండెపోటు, పక్షవాతం, రక్తప్రసరణ వ్యవస్థకు సంబంధించిన సమస్యలూ నివారితమవుతాయి.

తినడం వంటివి చోటుచేసుకోవచ్చు.

### దేహనిర్మాణంలో లోపాలతో ...

దవడ సైజు, వాటి అమరికలో లోపాలు అంటే... పైదడడ చిన్నగా ఉండి, కిందికి పెద్దగా ఉండటం లేదా పైది పెద్దగా ఉండి, కిందిది చిన్నదిగా ఉండటం... దాంతో రెండు దవడలకు మధ్య నాలుకకు తగినంత ఖాళీ ఉండక నాలుక వెనక్కు నెట్టేసినట్లుగా మారి, శ్వాసకు అంతరాయంగా మారవచ్చు. ఈ లోపాల కారణంగా నమలడం, కొరకడం, మాట్లాడటం వంటి సమస్యలూ వస్తాయి. ఇలాంటి కారణాలతో ఒక్కోసారి చిన్నపిల్లల్లో కూడా గురక రావచ్చు.

**నివారణ:** ● స్థూలకాయం ఉన్నవారు బరువు తగ్గాలి. ● నిద్రకు ఉపక్రమించడానికి ముందు ఆల్కహాల్ ఎట్టిపరిస్థితుల్లో తీసుకోకూడదు. అసలు పూర్తిగా మానేయడం మరీ మంచిది.



**డాక్టర్ నవత**
సీనియర్ కన్సల్టెంట్
మాక్సిల్లో ఫేసియల్ సర్జన్

### మెడి టిప్
## మోకాళ్ల నొప్పులు మొదలవబోతున్నాయా?



మోకాళ్ల నొప్పులు ప్రారంభం కావడానికి ముందు అప్పుడప్పుడూ మోకాళ్ల దగ్గర కలుక్కుమనడం, విరామాలతో నొప్పి వస్తూ పోతూ ఉండడం, మెట్లు ఎక్కుతున్నప్పుడు లేదా ఎక్కువగా నడిచినప్పుడు నొప్పి కనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**మోకాళ్ల అరుగుదలను వాయిదా వేయడానికి...** ◆ నడక వల్ల మోకాళ్లు మరింతగా అరిగి, నొప్పులు పెరుగుతాయనుకుంటారు. నిజానికి మోకాళ్ల కదలికలు ఎంతగా ఉంటే, అంతగా రక్తప్రసరణ జరగడమే కాకుండా... మోకాలి కీళ్లకు అవసరమైన పోషణ అంది మోకాలి కీళ్లు, అక్కడి ఎముకలతోపాటు ఇతర అవయవాలకూ ఆరోగ్యం సమకూరుతుంది. ◆ తొలుత ఐదు లేదా పదినిమిషాలు వ్యవధితో మొదలుపెట్టి క్రమంగా వాకింగ్ సమయాన్ని పెంచుకుంటూ పోవాలి. ◆ స్టేషనరీ సైక్లింగ్ కూడా మంచిదే.



● అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్
## ఏఆర్‌డీఎస్ అంటే..?

అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్ అనే మాటకు సంక్షిప్త రూపమే ఏఆర్‌డీఎస్. ఇది ఊపిరితిత్తులు దెబ్బతినడం వల్ల వచ్చే ఒక రకం ఆరోగ్య సమస్య. ఇది నిమోనియా కంటే తీవ్రమైన దశ. నిమోనియాలో జ్వరం, ఎడతెరిపి లేకుండా దగ్గు, ఛాతీలో కఫం చేరడం, దాంతో గాలికి స్థలం లేక ఊపిరి అందకపోవడం వంటి సమస్యలు కనిపిస్తాయి. కానీ బాధితులు ఏఆర్‌డీఎస్ స్థితికి వెళ్లినప్పుడు అసలు ఊపిరే అందని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఏఆర్‌డీఎస్‌పై అవగాహన కోసం ఈ కథనం.

ఏఆర్‌డీఎస్ రావడానికి ప్రత్యక్ష, పరోక్ష కారణాలు ఉంటాయి. విషపూరిత రసాయనాలు, వాటి నుంచి వెలువడే విష వాయువుల బారిన పడితే నేరుగా ఏఆర్‌డీఎస్ రావచ్చు. కొన్ని సందర్భాల్లో మద్యపాన ప్రియులలో, వాళ్ల గాల్‌బ్లాడర్‌లో స్టోన్స్ ఉన్నా రావచ్చు. డయాబెటిస్ ఉన్న కొందరిలో కాలికి తగినంత రక్తం అందక అది కుళ్లిపోవచ్చు. దీన్నే గ్యాంగ్రీన్ అంటారు. ఇలా గ్యాంగ్రీన్ కూడా ఏఆర్‌డీఎ్‌కు దారితీయవచ్చు. ఇలాంటి పరిస్థితులు తీవ్రమైనప్పుడు దేహంలోని అన్ని కీలక అవయవాలూ దెబ్బతిని, దేహ వ్యవస్థలూ కుప్పకూలిపోయే ప్రమాదమూ ఉంటుంది.

**లక్షణాలు:** ▸ ఊపిరి అందకపోవడం ▸ చాలా వేగంగా ఊపిరి తీసుకోడానికి ప్రయత్నిస్తుండటం ▸ ఊపిరి అందక దేహంలోని ఆక్సిజన్ తగ్గి శరీరం నీలంగా మారిపోవడం.



**డాక్టర్ రమణ ప్రసాద్**
సీనియర్ పల్మునాలజిస్ట్
అండ్ స్లీప్ స్పెషలిస్ట్

**నిర్ధారణ:** ▸ ఎక్స్‌రే : ఈ ఎక్స్‌రే చిత్రంలో లంగ్స్ మూడొంతులు దెబ్బతిని ఉన్నట్లు కనిపిస్తుంటే దాన్ని ఏఆర్‌డీఎస్‌గా పేర్కొనవచ్చు.

▸ ఏబీజీ (ఆర్టీరియల్ బ్లడ్ గ్యాసెస్) : శరీరానికి మంచి రక్తాన్ని అందించే ధమని (ఆర్టరీ) నుంచి రక్తాన్ని తీసి అందులో ఉండాల్సిన ఆక్సిజన్ మోతాదులను పరీక్షిస్తారు. ఈ పరీక్షను ఆర్టీరియల్ బ్లడ్ గ్యాసెస్ అంటారు. ఈ పరీక్షలో ఉండాల్సిన ఆక్సిజన్ మోతాదులను ‘ఫ్రాక్షనల్ ఇన్‌స్పిరేటరీ ఆక్సిజన్’ అంటారు. ఈ కొలత 500 ఉంటే అది నార్మల్. 200 కంటే తక్కువగా ఉంటే ‘ఏఆర్‌డీఎస్’ అనీ, 100 కంటే తక్కువగా ఉంటే ‘సివియర్ ఏఆర్‌డీఎస్’గా చెబుతారు. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి.

▸ పల్స్ ఆక్సీమీటర్: ఇది రక్తంలోని ఆక్సిజన్ పరిమాణం ఎంతుందో చెబుతుంది. పల్స్ ఆక్సీమీటర్‌లో 95 -97 శాతం ఉండటం నార్మల్ కాగా, 90 శాతం కంటే తక్కువగా ఉన్న వారిని హాస్పిటల్‌లో ఉంచి చికిత్స చేయాలి. 85% కంటే తక్కువగా ఉంటే దేహంలో ఏవైనా విషపదార్థాలు ఉన్నాయేమో పరీక్షించాలి. ▸ రక్తంలో తెల్లరక్తకణాల సంఖ్యను తెలుసుకునేందుకు సీబీపీ పరీక్ష చేయించాలి.

**నివారణ :** ▸ దగ్గు, తుమ్ము వచ్చినప్పుడు నోటికి, ముక్కుకు అడ్డుగా చేతిరుమాలు లేదా టిష్యూపేపర్ ఉంచుకోవాలి. ఒకరు ఉపయోగించిన టవళ్లు, రుమాళ్లు ఇతరులు వాడకూడదు. టిష్యూ వాడాక ఇతరులెవరూ ముట్టుకోకుండా, జాగ్రత్తగా పారేయాలి. ▸ దగ్గు, తుమ్ము సమయంలో అడ్డుపెట్టుకున్న చేతుల్ని నోటికి, ముక్కుకు, కళ్లకు తాకించకుండా వాటిని క్లీన్ చేసుకోవాలి. ▸ 65-70 ఏళ్లు దాటిన వారంతా స్ట్రెప్టోకోకల్ ఇన్ఫెక్షన్లను నివారించే వ్యాక్సిన్లను తీసుకోవాలి.

**చికిత్స:** ▸ యాంటీబయాటిక్స్ ఇవ్వడం ▸ ఆక్సిజన్ పెట్టడం ▸ నాన్ ఇన్వేజివ్ వెంటిలేటర్ పెట్టడం, అప్పటికీ ప్రయోజనం లేకపోతే వెంటిలేటర్ ద్వారా బాధితులకు శ్వాస అందించడం; వెంటిలేటర్ కూడా పనిచేయకపోతే హై ఫ్రీక్వెన్సీ ఆసిలేటర్ వెంటిలేటర్ పెట్టడం ▸ అప్పటికీ ప్రయోజనం లేకపోతే ‘ఎక్స్‌ట్రా కార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేటర్ సహాయంతో రక్తం నుంచి కార్బన్ డైయాక్సైడ్‌ను వేరు చేసి, ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని దేహంలోకి పంపడం. ▸ ఈ చికిత్సలతోపాటు ఇతర లైఫ్ సపోర్ట్ సిస్టమ్స్ సహాయంతో చికిత్స అందించడం.



## టైటిల్‌కు విజయం దూరంలో భారత్

మహిళల జూనియర్ ఆసియా కప్ హాకీ టోర్నీలో భారత జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. జపాన్‌లోని కాకామిగహారా నగరంలో జరుగుతున్న ఈ టోర్నీలో శనివారం జపాన్ జట్టుతో జరిగిన సెమీఫైనల్లో భారత్ 1–0 గోల్ తేడాతో గెలిచింది. ఆట 47వ నిమిషంలో సునెలితా టొప్పో భారత్‌కు ఏకైక గోల్ అందించింది. రెండు జట్లకు ఆరు చొప్పున పెనాల్టీ కార్నర్‌లు లభించినా ఫలితం లేకపోయింది. ఫైనల్ చేరిన క్రమంలో భారత్ ఈ ఏడాది నవంబర్–డిసెంబర్‌లలో చిలీలో జరిగే జూనియర్ ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించింది. నేడు జరిగే తుది పోరులో దక్షిణ కొరియాతో భారత్ ఆడుతుంది. రెండో సెమీఫైనల్లో కొరియా 2–0తో చైనాపై గెలిచింది.



# స్వియాటెక్‌దే 'ఫ్రెంచ్' కిరీటం



స్వియాటెక్

- మూడోసారి విజేతగా నిలిచిన పోలాండ్ స్టార్
- ఫైనల్లో ముకోవాపై విజయం
- రూ. 20 కోట్ల 41 లక్షల ప్రైజ్‌మనీ సొంతం



పారిస్: ఎర్రమట్టి కోర్టులపై మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న పోలాండ్ టెన్నిస్ స్టార్ ఇగా స్వియాటెక్ మూడోసారి ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను దక్కించుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ నంబర్ వన్ స్వియాటెక్ 6–2, 5–7, 6–4తో అన్‌సీడెడ్ కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్)పై విజయం సాధించింది. 2 గంటల 46 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన ఫైనల్లో కీలకదశలో సంయమనం కోల్పోకుండా ఆడిన డిఫెండింగ్ చాంపియన్ స్వియాటెక్ ట్రోఫీని సొంతం చేసుకుంది. విజేతగా నిలిచిన స్వియాటెక్‌కు 23 లక్షల యూరోలు (రూ. 20 కోట్ల 41 లక్షలు), రన్నరప్ ముకోవాకు 11 లక్షల 50 వేల యూరోలు (రూ. 10 కోట్ల 20 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఓవరాల్‌గా స్వియాటెక్ కెరీర్‌లో ఇది నాలుగో గ్రాండ్‌స్లామ్ టైటిల్. 2022లో యూఎస్ ఓపెన్ నెగ్గిన స్వియాటెక్... 2020, 2022లలో ఫ్రెంచ్ ఓపెన్ విజేతగా నిలిచింది.

ఒక్క సెట్ కూడా కోల్పోకుండా ఫైనల్ చేరిన స్వియాటెక్ తుది పోరులోనూ శుభారంభం చేసింది. రెండో గేమ్‌లో, ఎనిమిదో గేమ్‌లో ముకోవా సర్వీస్‌లను బ్రేక్ చేసిన స్వియాటెక్ 48 నిమిషాల్లో తొలి సెట్‌ను దక్కించుకుంది. రెండో సెట్‌లో ముకోవా తేరుకుంది. ఐదో గేమ్‌లో స్వియాటెక్ సర్వీస్‌ను బ్రేక్ చేసి, తన సర్వీస్‌ను కాపాడుకొని స్కోరును 3–3తో సమం చేసింది. ఆ తర్వాత తొమ్మిదో గేమ్‌లో స్వియాటెక్ సర్వీస్‌ను ముకోవా బ్రేక్ చేసినా, ఆ వెంటనే తన సర్వీస్‌ను కోల్పోవడంతో స్కోరు 5–5తో సమమైంది. కానీ 11వ గేమ్‌లో స్వియాటెక్ సర్వీస్‌ను మళ్లీ బ్రేక్ చేసిన ముకోవా ఈసారి తన సర్వీస్‌ను నిలబెట్టుకొని 7–5తో 71 నిమిషాల్లో రెండో సెట్‌ను నెగ్గింది. నిర్ణాయక మూడో సెట్‌లో ముకోవా రెండుసార్లు స్వియాటెక్ సర్వీస్‌ను బ్రేక్ చేసినా కీలకదశలో ఒత్తిడికి లోనై తన సర్వీస్‌లను కాపాడుకోవడంలో విఫలమైంది. పదో గేమ్‌లో ముకోవా తన సర్వీస్‌లో డబుల్ ఫాల్ట్ చేసి గేమ్‌తోపాటు సెట్‌ను, మ్యాచ్‌ను కోల్పోయింది.

### ఫైనల్ గణాంకాలు

| స్వియాటెక్ | | ముకోవా |
|---|---|---|
| 1 | ఏస్‌లు | 6 |
| 3 | డబుల్ ఫాల్ట్‌లు | 3 |
| 7/11 | బ్రేక్ పాయింట్లు | 5/7 |
| 19 | విన్నర్స్ | 30 |
| 27 | అనవసర తప్పిదాలు | 38 |
| 10/24 | నెట్ పాయింట్లు | 18/28 |
| 4 | డ్రాప్ షాట్‌లు | 20 |
| 96 | మొత్తం పాయింట్లు | 81 |

జొకోవిచ్ X కాస్పర్ రూడ్ | నేడు పురుషుల సింగిల్స్ ఫైనల్ సాయంత్రం 6 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

**6** మార్గరెట్ కోర్ట్ (ఆస్ట్రేలియా), క్రిస్ ఎవర్ట్ (అమెరికా), స్టెఫీ గ్రాఫ్ (జర్మనీ), మోనికా సెలెస్ (యుగోస్లావియా), జస్టిన్ హెనిన్ (బెల్జియం) తర్వాత కనీసం వరుసగా రెండేళ్లు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన ఆరో క్రీడాకారిణిగా స్వియాటెక్ నిలిచింది.

**8** ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను కనీసం మూడుసార్లు సాధించిన ఎనిమిదో క్రీడాకారిణిగా స్వియాటెక్ గుర్తింపు పొందింది. ఈ జాబితాలో క్రిస్ ఎవర్ట్ (అమెరికా: 7 సార్లు), స్టెఫీ గ్రాఫ్ (జర్మనీ: 6 సార్లు), జస్టిన్ హెనిన్ (4 సార్లు), మార్గరెట్ కోర్ట్ (3 సార్లు), అరంటా సాంచెజ్ (స్పెయిన్: 3 సార్లు), మోనికా సెలెస్ (3 సార్లు), సెరెనా విలియమ్స్ (అమెరికా: 3 సార్లు) ఉన్నారు.

**3** ఓపెన్ శకంలో (1968 నుంచి) తాము ఫైనల్ చేరిన తొలి నాలుగు గ్రాండ్‌స్లామ్‌లలోనూ విజేతగా నిలిచిన మూడో ప్లేయర్‌గా స్వియాటెక్ నిలిచింది. గతంలో మోనికా సెలెస్, నయోమి ఒసాకా (జపాన్) ఈ ఘనత సాధించారు.

# మరో 280 పరుగులు...

టెస్టు క్రికెట్‌లో అత్యధిక పరుగుల ఛేదన 418... సాధించి 20 ఏళ్లయింది... ఓవల్ మైదానంలో అయితే 263 పరుగులే, అదీ 1902లో వచ్చింది. ఈ రెండింటితో పోలిస్తే ప్రస్తుత లక్ష్యం 444 పరుగులు చాలా ఎక్కువ... అయితే పాత లెక్కల ప్రతికూలతలకంటే పట్టుదలతో కూడిన ప్రదర్శన ఫలితాన్ని ఇవ్వవచ్చు! వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను గెలుచుకునేందుకు భారత్‌ను విజయం ఊరిస్తోంది. పరుగు తేడాతో రోహిత్, పుజారా వెనుదిరిగినప్పుడు సందేహం ఉన్నా... కోహ్లి, రహానే కలిసి ఆశలు రేపారు. వీరిద్దరి ఆటతో పాటు పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న తీరు చూస్తే చివరి రోజు 280 పరుగులు చేయడం అసాధ్యమేమీ కాదు. అయితే మరో వికెట్ ఆసీస్‌కు దారులు తెరిచే అవకాశమూ ఉంది. టీమిండియా స్ఫూర్తి పొందేందుకు ఆస్ట్రేలియాపై ఆఖరి రోజు 325 పరుగులు సాధించి మరీ గెలిచిన 'గాబా'ను గుర్తు చేసుకుంటే చాలు!

- డబ్ల్యూటీసీ టైటిల్ వేటలో భారత్
- లక్ష్యం 444... ప్రస్తుతం 164/3
- రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 270/8 డిక్లేర్డ్



రహానే, కోహ్లి

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) విజేతగా నిలిచేందుకు భారత్, ఆస్ట్రేలియా మధ్య ఆఖరి రోజు ఆసక్తికర సమరానికి రంగం సిద్ధమైంది. 444 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఆట ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. కోహ్లి (60 బంతుల్లో 44 బ్యాటింగ్; 7 ఫోర్లు), రహానే (59 బంతుల్లో 20 బ్యాటింగ్; 3 ఫోర్లు) చక్కటి బ్యాటింగ్‌తో ఇప్పటికే అభేద్యంగా 71 పరుగులు జోడించారు. ఆఖరి రోజు విజయం కోసం భారత్‌కు మరో 280 పరుగులు కావాల్సి ఉండగా, ఆసీస్‌కు 7 వికెట్లు అవసరం. అంతకుముందు ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌ను 8 వికెట్లకు 270 పరుగులవద్ద డిక్లేర్ చేసింది.

**క్యారీ జోరు...**

ఆస్ట్రేలియా భారత్‌కు భారీ లక్ష్యాన్ని విధించగలగడంలో కీపర్ క్యారీ (105 బంతుల్లో 66 నాటౌట్; 8 ఫోర్లు)దే కీలకపాత్ర. శనివారం ఆసీస్ 40.3 ఓవర్లు ఆడి మరో 147 పరుగులు జత చేసింది. వాటిలో క్యారీ, మిచెల్ స్టార్క్ (57 బంతుల్లో 41; 7 ఫోర్లు) ఏడో వికెట్‌కు 20 ఓవర్లలో 93 పరుగులు జోడించడం విశేషం. ఓవర్ నైట్ బ్యాటర్లు లబుషేన్ (41; 4 ఫోర్లు), గ్రీన్ (25; 4 ఫోర్లు) ఎక్కువసేపు నిలవలేకపోగా, క్యారీ మాత్రం బౌండరీలతో చకచకా పరుగులు రాబట్టాడు. 82 బంతుల్లో క్యారీ అర్ధసెంచరీ పూర్తయింది. ఎట్టకేలకు స్టార్క్‌ను అవుట్ చేసి షమీ ఈ భాగస్వామ్యాన్ని విడదీయగా, తాను అవుట్ కాగానే కమిన్స్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు.

**రోహిత్ రాణించినా...**

ఛేదనను ఓపెనర్లు రోహిత్, గిల్ (19 బంతుల్లో 18; 2 ఫోర్లు) దూకుడుగానే ఆరంభించారు. దాంతో 7 ఓవర్లలోనే స్కోరు 41 పరుగులకు చేరింది. ఈ దశలో గ్రీన్ పట్టిన వివాదాస్పద క్యాచ్‌తో గిల్ నిష్క్రమించాడు. గ్రీన్ క్యాచ్ అందుకుంటున్నప్పుడు బంతి నేలకు తగిలినట్లుగా కనిపించింది. టీవీ రీప్లేలోనూ సందేహాస్పదంగానే ఉన్నా అంపైర్ చివరకు అవుట్‌గా ప్రకటించడంతో గిల్ నిష్క్రమించక తప్పలేదు. టీ విరామం తర్వాతా రోహిత్ దాటి కొనసాగింది. అయితే లయన్ తొలి ఓవర్లో అనవసరపు స్వీప్ షాట్‌కు ప్రయత్నించి అతను వికెట్ల ముందు దొరికిపోయాడు. మరో ఐదు బంతులకే పుజారా (47 బంతుల్లో 27; 5 ఫోర్లు) కూడా అవుట్ కావడంతో భారత్ కుప్పకూలుతుందేమో అనిపించింది. కానీ కోహ్లి, రహానే తమ అపార అనుభవంతో జట్టును ఆదుకున్నారు. ప్రత్యర్థి బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పట్టుదలగా క్రీజులో నిలబడటంతో పాటు వేగంగా పరుగులు సాధించారు. ఆసీస్ బౌలర్లు కూడా పూర్తిగా నియంత్రణ కోల్పోయి బంతులు వేశారు. ఆట చివర్లో మరో వికెట్ తీయలేక కంగారూ శిబిరంలో తీవ్ర అసహనం కనిపించింది. భారత్ ఈ ఇన్నింగ్స్‌లో 4.10 రన్‌రేట్‌తో పరుగులు సాధించడం విశేషం.

### స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 469; భారత్ తొలి ఇన్నింగ్స్: 296; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఖ్వాజా (సి) భరత్ (బి) ఉమేశ్ 13; వార్నర్ (సి) భరత్ (బి) సిరాజ్ 1; లబుషేన్ (సి) పుజారా (బి) ఉమేశ్ 41; స్మిత్ (సి) శార్దుల్ (బి) జడేజా 34; హెడ్ (సి అండ్ బి) జడేజా 18; గ్రీన్ (బి) జడేజా 25; క్యారీ (నాటౌట్) 66; స్టార్క్ (సి) కోహ్లి (బి) షమీ 41; కమిన్స్ (సి) (సబ్) అక్షర్ (బి) షమీ 5; ఎక్స్‌ట్రాలు 26; మొత్తం (84.3 ఓవర్లలో 8 వికెట్లకు డిక్లేర్డ్) 270. వికెట్ల పతనం: 1–2, 2–24, 3–86, 4–111, 5–124, 6–167, 7–260, 8–270. బౌలింగ్: షమీ 16.3–6–39–2, మొహమ్మద్ సిరాజ్ 20–2–80–1, శార్దుల్ ఠాకూర్ 8–1–21–0, ఉమేశ్ యాదవ్ 17–1–54–2, రవీంద్ర జడేజా 23–4–58–3.

భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (ఎల్బీ) (బి) లయన్ 43; శుబ్‌మన్ గిల్ (సి) గ్రీన్ (బి) బోలండ్ 18; పుజారా (సి) క్యారీ (బి) కమిన్స్ 27; విరాట్ కోహ్లి (బ్యాటింగ్) 44; అజింక్య రహానే (బ్యాటింగ్) 20; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (40 ఓవర్లలో 3 వికెట్లకు) 164. వికెట్ల పతనం: 1–41, 2–92, 3–93. బౌలింగ్: కమిన్స్ 9–0–42–1, బోలండ్ 11–1–38–1, మిచెల్ స్టార్క్ 7–0–45–0, గ్రీన్ 2–0–6–0, నాథన్ లయన్ 11–1–32–1.

## ఫైనల్లో సిక్కి రెడ్డి జోడీ



సాక్షి, హైదరాబాద్: డెన్మార్క్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీలో తెలంగాణ అమ్మాయి సిక్కి రెడ్డి మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ఫైనల్ చేరింది. డెన్మార్క్‌లో శనివారం జరిగిన సెమీఫైనల్లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) ద్వయం 21–18, 22–20తో మూడో సీడ్ జెస్పర్ టాఫ్ట్–క్లారా గ్రావెర్సన్ (డెన్మార్క్) జంటను ఓడించింది.

## భారత్ పరాజయం


ఎయిండ్‌హోవెన్ (నెదర్లాండ్స్): అంతర్జాతీయ హాకీ సమాఖ్య పురుషుల ప్రొ లీగ్‌లో భారత జట్టుకు ఐదో ఓటమి ఎదురైంది. నెదర్లాండ్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 2–3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ తరఫున సంజయ్ (18వ ని.లో), గుర్జంత్ సింగ్ (46వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. నెదర్లాండ్స్ జట్టుకు డుకో టెల్గన్‌కాంప్ (7వ ని.లో), బోరిస్ (41వ ని.లో), జెప్ హోడ్‌మేకర్స్ (43వ ని.లో) ఒక్కో గోల్ అందించారు. నేడు జరిగే మ్యాచ్‌లో అర్జెంటీనాతో భారత్ ఆడుతుంది.

## సినిమా

# ముప్పైరెండేళ్ల తర్వాత...



రజనీకాంత్



అమితాబ్ బచ్చన్

ఇండియన్ సూపర్ స్టార్స్ అమితాబ్ బచ్చన్, రజనీకాంత్ కాంబినేషన్ చాలా ఏళ్ల తర్వాత కుదిరింది. ఈ ఇద్దరూ కలిసి గతంలో మూడు హిందీ చిత్రాల్లో స్క్రీన్ షేర్ చేసుకున్నారు. 'అంధా కానూన్' (1983), 'గిరఫ్తార్' (1985), 'హమ్' (1991) చిత్రాల్లో ఈ ఇద్దరూ కలిసి నటించారు. ఆ తర్వాత నటించలేదు. ముప్పైరెండేళ్ల తర్వాత ఇప్పుడు ఈ కాంబినేషన్ కుదిరింది. రజనీ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. రజనీకాంత్ కెరీర్‌లో ఇది 170వ చిత్రం. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రకు అమితాబ్ అయితే బాగుంటుందని చిత్ర యూనిట్ భావించిందట. అమితాబ్‌ని సంప్రదిస్తే 'యస్' అన్నారట. ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ చిత్రం రూపొందనుందని, ఇందులో రజనీకాంత్ పోలీసాఫీసర్ పాత్ర చేయనున్నారని సమాచారం. సుభాస్కరన్ నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలో ఆరంభం కానుంది. వచ్చే ఏడాది విడుదల కానుంది.

శర్వానంద్–రక్షితా రెడ్డిల వివాహం ఇటీవల జైపూర్‌లోని లీలా ప్యాలెస్‌లో జరిగిన విషయం తెలిసిందే. ఈ నెల 9న రాత్రి హైదరాబాద్‌లోని ఎన్ కన్వెన్షన్‌లో వెడ్డింగ్ రిసెప్షన్ జరిగింది. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, సినిమా రంగం నుంచి బాలకృష్ణ, వెంకటేశ్, రామ్‌చరణ్ తదితరులు హాజరై, నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



శర్వానంద్ దంపతులతో కేటీఆర్, వెంకటేశ్

## వైఎస్ జగన్ పాత్రలో జీవా



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాత్రలో తమిళ నటుడు జీవా నటించనున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి బయోపిక్‌తో 'యాత్ర' (2019) సినిమాని తెరకెక్కించిన దర్శకుడు మహీ వి. రాఘవ్ ప్రస్తుతం 'యాత్ర 2'కి సన్నాహాలు చేస్తున్నారు. కాగా 'రంగం' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తమిళ హీరో జీవాను జగన్ మోహన్ రెడ్డి పాత్రకు సంప్రదించారు మహీ. ఈ చిత్రంలో నటించడానికి జీవా సుముఖత వ్యక్తపరిచారు. ఇక వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జీవితంలో 2009 నుంచి 2019 వరకు జరిగిన ఘటనల నేపథ్యంలో 'యాత్ర 2' కథ సాగుతుంది. జగన్ పాదయాత్ర నుంచి ప్రారంభమై సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడంతో ఈ సినిమా ముగుస్తుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టు 3న మొదలవుతుంది. 2024 ఫిబ్రవరిలో 'యాత్ర 2' సినిమా విడుదల కానుంది. కాగా మహీ వి. రాఘవ్ దర్శకత్వం వహించిన 'సిద్ధా లోకం ఎలా ఉంది నాయనా?' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది.

## మట్టి కథకు మూడు అంతర్జాతీయ అవార్డులు



'మట్టి కథ' పోస్టర్

'ఇండో ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్' (2023)లో 'మట్టి కథ' సినిమా మూడు అవార్డులకు ఎంపిక అయింది. అజయ్ వేద్ హీరోగా కనకవ్వ, 'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి, దయానంద్ రెడ్డి కీలక పాత్రల్లో పవన్ కడియాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మట్టి కథ'. అన్నపరెడ్డి అప్పిరెడ్డి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదలకానుంది. పల్లెటూరి కుర్రోడి ఆశలు, ఆకాంక్షలు ఎలా ఉంటాయి? మట్టిలోని మధురానుభూతి ఎలా ఉంటుంది? అనే నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రాన్ని ఇండో ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కి దరఖాస్తు చేయగా మూడు అవార్డులకు ఎంపికైంది. 'బెస్ట్ ఇండియన్ ఫ్యూచర్ ఫిల్మ్, బెస్ట్ యాక్టర్ ఫ్యూచర్ ఫిల్మ్, డెబ్యూ ఫిల్మ్ మేకర్ ఆఫ్ ఫ్యూచర్ ఫిల్మ్' విభాగాల్లో 'మట్టి కథ' ఎంపికైంది. కాగా 'ఇండో ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్'లో అవార్డులు దక్కించుకున్న 'బలగం, మామణిదన్ (తమిళ్) చిత్రాల సరసన 'మట్టి కథ' నిలవడంపై చిత్రయూనిట్ ఆనందం వ్యక్తం చేసింది.

## నా బలం అతనే!

''ఈ ప్రియమైన వ్యక్తి నా బలం.. నా విషయంలో నేను పాజిటివ్‌గా ఉండాలని మరచిపోయి, నిరాసక్తకు గురైన టైమ్‌లో నా బలంగా మారాడు. నా కన్నీళ్లు తుడిచాడు. జోక్స్ చెప్పి నన్ను నవ్వించాడు. లేకపోతే ఆత్మీయంగా హత్తుకుని, నాకు స్వాంతన చేకూర్చుతాడు. ఆ సమయంలో నాకదే కావాలని గ్రహించి, ఆ హగ్ ఇస్తాడు. ఇకనుంచి నాకు ఏదీ కష్టంగా అనిపించదు'' అని ఓ వ్యక్తితో తాను దిగిన ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు ఇలియానా. అయితే ఆ వ్యక్తి ముఖం సరిగ్గా కనబడనివ్వలేదు. ప్రస్తుతం ఇలియానా గర్భవతి అనే సంగతి తెలిసిందే. ఈ విషయం స్వయంగా ఆమె ప్రకటించినప్పటి నుంచి సోషల్ మీడియాలో తండ్రి ఎవరు? అనే చర్చ జరుగుతోంది. అయితే ఇలియానా మాత్రం స్పష్టం చేయలేదు. ఇక ప్రెగ్నెన్సీ గురించి సోషల్ మీడియాలో ఈ విధంగా పేర్కొన్నారు ఇలియానా. ''గర్భం దాల్చడం అనేది ఒక అందమైన ఆశీర్వాదం. నేనీ అనుభూతి పొందే అదృష్టవంతురాలిని అని అనుకోలేదు. అందుకే ఈ ప్రయాణం (ప్రెగ్నెన్సీ) నాకో అదృష్టం అని భావిస్తున్నాను. లోపల ఒక ప్రాణం పెరుగుతుంటే ఆ అనుభూతిని చెప్పటానికి మాటలు చాలడంలేదు. బేబీ బంప్ పెరుగుతుంటే అలా చూస్తూ, ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాను. త్వరలో నిన్ను (బిడ్డని ఉద్దేశించి) కలుస్తాను'' అంటూ... ''ఒక్కోసారి కన్నీళ్లు వస్తున్నాయి. దాంతో పాటు ఏదో అపరాధ భావం. అంతలోనే చిన్న విషయాలకు ఏడవకూడదని సర్ది చెప్పుకుంటాను. నేను బలంగా ఉండాలి. అలా లేకపోతే ఇక తల్లిగా నేనేం చేయగలుగుతాను? నేనెలాంటి తల్లిగా ఉంటానో తెలియదు కానీ, ఇప్పటికే ఈ చిన్ని మనిషిని (బేబీని) ప్రేమించడం మొదలుపెట్టాను కాబట్టి మంచి తల్లినవుతాననే నమ్మకం ఉంది'' అని కూడా షేర్ చేశారు ఇలియానా.



బాయ్‌ఫ్రెండ్‌తో ఇలియానా

## ప్రేక్షకుల స్పందనతో ఆనందం కలిగింది

– డైరెక్టర్ సురేష్



గోపీ, వెంకట్, నవ్య స్వామి, సురేష్

''మానవ సంబంధాల నేపథ్యంలో నడిచే చిత్రం 'ఇంటింటి రామాయణం'. కుటుంబంతో, స్నేహితులతో కలిసి చూడాల్సిన సినిమా ఇది. మా చిత్రానికి ప్రేక్షకుల స్పందన చూసి చాలా ఆనందం కలిగింది'' అని డైరెక్టర్ సురేష్ నరెడ్ల అన్నారు. రాహుల్ రామకృష్ణ, నవ్య స్వామి, వీకే నరేశ్, సురభి ప్రభావతి, గంగవ్వ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'ఇంటింటి రామాయణం'. సూర్యదేవర నాగవంశీ, మారుతి టీమ్ సమర్పణలో వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ యిన్నమూరి నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో సురేష్ నరెడ్ల మాట్లాడుతూ– ''మా సినిమా ప్రేక్షకులకు బాగా నచ్చడంతో పాజిటివ్ మౌత్ టాక్ స్ప్రెడ్ చేస్తున్నారు. అమెరికాలోనూ మంచి స్పందన వస్తోంది. నాకు సపోర్ట్ చేసిన నాగవంశీ, మారుతిగార్లకు, ఆహా వారికి కృతజ్ఞతలు'' అన్నారు. ''ఇంటింటి రామాయణం'కి మేం ఊహించిన దానికంటే అద్భుతమైన స్పందన రావడం చాలా సంతోషంగా ఉంది.. ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అని నటి నవ్య స్వామి అన్నారు.

## మంచి సినిమాకి ఆదరణ ఉంటుంది

– సముద్ర ఖని



అనసూయ, సముద్ర ఖని, శివప్రసాద్, కిరణ్ కొర్రపాటి

''డైరెక్టర్ శివ ప్రసాద్‌గారు తొలి సినిమా 'విమానం'తో మంచి హిట్ అందుకున్నందుకు అభినందనలు. మంచి సినిమాకు ప్రేక్షకాదరణ ఉంటుందనే విషయాన్ని 'విమానం' మరోసారి నిరూపించింది'' అని నటుడు, దర్శకుడు సముద్ర ఖని అన్నారు. శివప్రసాద్ యానాల దర్శకత్వంలో సముద్ర ఖని, మాస్టర్ ధ్రువన్, అనసూయ, రాహుల్ రామకృష్ణ, ధనరాజ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'విమానం'. జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి నిర్మించిన ఈ సినిమా శుక్రవారం తెలుగు, తమిళ భాషల్లో విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో కిరణ్ కొర్రపాటి మాట్లాడుతూ– ''విమానం' లాంటి చిత్రాలు అరుదుగా వస్తాయి. ఇలాంటి చిత్రాలను ఆదరిస్తే కొత్త దర్శకులకు ఇంకా మంచి ఉత్సాహం వస్తుంది'' అన్నారు. ''విమానం' చిత్రం చూశాక 'మా నాన్న గుర్తుకొచ్చాడు' అంటూ మా నాన్న, అమ్మ చెప్పడంతో చాలా ఆనందం వేసింది'' అన్నారు శివప్రసాద్ యానాల. నటుడు ధనరాజ్, మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్, రైటర్ హను, సినిమాటోగ్రాఫర్ వివేక్, అనసూయ భరద్వాజ్, మాస్టర్ ధ్రువన్ మాట్లాడారు.

## ఇకపై నవ్వించే సినిమాలే చేస్తాను

– 'డైమండ్' రత్నబాబు



రత్నబాబు, సన్నీ, రజిత్ రావు

''ప్రేక్షకులను నవ్వించాలనే ఉద్దేశంతో 'అన్‌స్టాపబుల్' చేశాను. ఈ సినిమా చూసిన ప్రేక్షకులు హాయిగా నవ్వుకున్నామంటూ ఫోన్ చేస్తున్నారు. ప్రేక్షక దేవుళ్లు ఇచ్చిన తీర్పే రియల్ బ్లాక్ బస్టర్.. ఇకపై నేను అన్నీ నవ్వించే సినిమాలే చేస్తాను'' అని డైరెక్టర్ 'డైమండ్' రత్నబాబు అన్నారు. వీజే సన్నీ, సప్తగిరి హీరోలుగా, నక్షత్ర, అక్సాఖాన్ హీరోయిన్లుగా 'డైమండ్' రత్నబాబు దర్శకత్వం వహించిన చిత్రం 'అన్‌స్టాపబుల్'. రజిత్ రావు నిర్మించిన ఈ సినిమా గత శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో వీజే సన్నీ మాట్లాడుతూ– ''ఒక సినిమా తీసి, థియేటర్‌లో రిలీజ్ చేయడం తేలికైన విషయం కాదు. రజిత్ రావుగారు సినిమాపై ప్యాషన్‌తో ఎక్కడా రాజీపడకుండా ఈ సినిమా చేశారు'' అన్నారు. ''అన్‌స్టాపబుల్ 2'ని రత్నబాబు దర్శకత్వంలోనే చేస్తున్నాం'' అన్నారు రజిత్ రావు.

## గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎటువంటి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

## వధువు కావలెను



కాపు/45y/M.Sc, B.Ed/ Govt. జాబ్/ స్కూల్ హెడ్‌మాస్టర్/1,50,000/- (pm)/ అందమైన వరుడికి తగిన (Any OC, BC) అందమైన వధువు కావలెను. సంప్ర: 8688671906 [H-797700]

SC మాల/B.Tech/C.Govt. ఎలక్ట్రికల్ ఇంజినీర్ / రైల్వే / 90,000/-PM / 5'10" ఎత్తు /29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14668]

కుల పట్టింపు లేదు/ 2వ పెళ్లి / పిల్లలు లేరు/ 44/5'9"/ MBA/ SWE/ TCS కోట్ల ఆస్తి గల వరునికి తగిన వధువు కావలెను. Ph: 8367619529 [H-14666]

కురుమ/ కట్నప్రసక్తి లేదు / గుడ్ లుకింగ్ / 27/ 5'8"/ MBA/ గుడ్ జాబ్/ 60,000/-Pm/ వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ వరునికి వధువు కావలెను. Ph: 8367619529 [H-14666]

రెడ్డి: కట్నప్రసక్తి లేదు /హ్యాండ్ సమ్/ 28/ 5'10"/ B.Tech/ IIT, MBA IIM/ SWE/ 3 Lakhs pm/ కోట్ల ఆస్తి గల వరునికి వధువు కావలెను. Ph: 8367619529 [H-14666]

రెడ్డి: 2nd మ్యారేజ్/40/6"/డాక్టర్, 1Lac. PA గల వరునికి 1వ, 2వ, లేట్ అందమైన వధువు కావలెను. కులకట్న ప్రసక్తి లేదు. Ph: 8143256692 [H-14666]

క్రిస్టియన్ మాల: కట్న ప్రసక్తి లేదు/ 28/5'9"/ M.Tech/ C.Govt. Jr.ఇంజనీర్/రైల్వే/ 75,000/- pm/ అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [H-14670]

క్రిస్టియన్ : కుల ప్రసక్తి లేదు/ 50/5'9"/ C.Govt. VRS. ఎంప్లాయి/ 48,000/- pm/ ఒంటరి వరునికి వధువు/ కావలెను. Ph: 9550650024 [H-14670]

కమ్మ/ CNB/ 2వ పెళ్లి / పిల్లలు లేరు/ Own House/ 70,000/- pm/ 1Cr. ఆస్తి/37/5'9"/ B.Sc/ వరునికి 1వ/ 2వ వధువు కావలెను. వెరీవెరీ అర్జెంట్. Ph: 6303293337, Whatsapp: 8187053655 [H-14670]

యాదవ : B.Tech(EEE)/ Govt.AEE/ ట్రాన్స్‌కో/14 Lakhs PA/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. Ph: 9515755529 [H-14670]

రెడ్డి /40/5'10"/MBA/రెండవ పెళ్లి/ Pvt జాబ్/ 60K/Own House/2 కోట్ల ప్రాపర్టీ ఉన్న వరునికి OC 1 or 2 మ్యారేజ్ పిల్లలు లేని వధువు కావలెను (డైరెక్ట్) , 9133857101. [T-1148502]

## K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: koreddy43@gmail.com, Facebook.com/koreddymarriagebureau

### వధువు కావలెను

Reddy/Business / B.Tech/1997/ 5'11"/ 100Cr. *1994/5'11"/250Cr. *1995/6'/ 100 Cr. *1995/6'/50Cr * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS / H1/USA/Handsome Boy/1992/5'9"/40Cr/185K/ * 1992/6'/330K/30Cr. Cont: K.C. Reddy - Hyd. Ph: 9849321309

Reddy/B.Tech/ MS/H1/ USA/Handsome Boy/1994/5'11"/120K/150Cr. * 1990/5'7"/ 120K/50Cr. * Cont : K.C. Reddy-Mar-Bureau-Hyd.Ph: 9849321309/9347807015

Reddy/Sweeden or USA/Very Handsome Boy/1997/ 5'9"/ B.Tech (JNTU Campus) MS(Sweden)/ 5L/ M/60Cr his share/Now Hyd. * Cont:K.C.Reddy-Ph: 9849321309

Reddy/Now in Hyd/B.Tech/MS/ USA/140K/400Cr (Property) Needs India or USA Alliance. * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/Business/Bangalore/B.Tech /Handsome Boy/1990/6'/1000Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/B.Tech / MS/USA / Citizen * No Dowry/1994/5'9"/ 200Cr/ Needs a Beautiful Bride. * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/USA Doctor/Very Hand Some Boy/MBBS/ MD (Cardiology) 1995/5'8"/10Cr. *Cont: K.C. Reddy. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/ PG/ DM.*1994/ 5'10"/ 75Cr. *1993/5'10"/50Cr. *1989/5'9"/30 Cr. * 1995/5'10"/400Cr. *Cont: K.C. Reddy-Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/IIT/BITS/ 1994/5'10"/ 35L/yr. *1992/5'9"/25L/yr. *32L/yr/1992/5'7"/USA-1992/400K. *1995/300K/5'7" *1994/5'7"/ 230K. * Cont: K.C. Reddy-Ph: 9849321309

### వరుడు కావలెను

Reddy / MBBS/USMLE Cleared/ 1996/5'2"/20Cr/Needs USA Doc or good Edn person USA. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/B.Tech (NIT)/Job Hyd/Most Beautiful/70L/yr/Rich Family/ 1998/ 5'3". *Cont: K.C. Reddy-Mar-Bureau- Hyd-Ph: 9347807015

Reddy/MBBS/PG/Rich Family/ 1998/ 5'5"/25Cr *1994/5'6"/100Cr *1998/5'7"/ 50Cr *1996/5'6"/60Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/Aus Citizen/Most Beautiful/ Rich Family/1997/5'6". *1998/5'7"/ 30Cr. * Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309/9347807015

Reddy/M.Tech/Most Beautiful/ SWE/ Hyd/1992/5'7"/20Cr. *1993/5'4"/20Cr. *1998/5'5"/10Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/Most Beautiful/ BE/MS/ USA/H1/1992/5'5"/200Cr/ *Cont: K.C. Reddy -Mar-Bureau-Hyd Ph: 9849321309/9347807015

Reddy/IIT/ B.Tech/ MS/USA/1996/5'7" *1999/5'6" *1994/5'4" *BITS/1995/5'6" *1997/5'4"/200K *1990/5'8"/160K. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309

Reddy/(Divorcee)/B.Tech/MS/India /Business/Most Beautiful/1985/ 5'5"/ 400Cr *Cont:K.C.Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/ Divorcee/ B.Tech/Interior Designer/Most Beautiful/ 1988/ 5'6"/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Most Beautiful/ V.Young/ 2001/ 5'3"/20Cr. *1998/5'4"/25Cr. *2002/ 5'7"/ 20Cr. *1998/5'7"/50Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

[D-517]

మాల : B.Tech. (IIT), 5'9 /31 Y/ Very Fair/ 5 Cr. / IRS గా చేస్తున్న వరుని కొరకు మెడిసిన్, IIT, IIM వధువులు సంప్రదించండి. సెల్ : 81065 01199, 92484 94810. [M-258]

రెడ్డి / డైవర్స్, 40 సం.లు, బిజినెస్, వెల్ సెటిల్డ్ వరుడికి అందమైన సాంప్రదాయ వధువు కావలెను. కాంటాక్ట్ : 70131 36357. (నో బ్రోకర్స్). [NA-5677]

Reddy, Now Hyd-28/5'10"/B.Tech-MS-USA. *32/5'10"/MBBS Residency USA. *28/5'10"/B.Tech IIT-MS-USA-350K/ Rich. Cont: P.P.Reddy-9391198332. [H-797646]

Reddy, 25/5'4"/M.Com. *22/ 5'4"/B.Com. *26/ 5'4"/B.Tech/ SWE-Hyd. Cont: P.P.Reddy-9391198332. [H-797646]

Reddy, 2nd Marriage-42/5'9"/ B.Tech-MS-USA Citizen. *32/5'10"/ B.Tech-MS USA. *32/5'9"/B.Tech-SWE-Hyd. Cont: P.P.Reddy-9391198332. [H-797646]

## అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి )

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

### వధువు కావలెను

రెడ్డి BE (NIT), MS, 27, 6' 0", Associate, 200 crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 11" Engineer, 50 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 10", SWE, 130 K, 30 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5'7", 150 K, 4 Crores, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.




రెడ్డి BE, MS, 31, 5'7", Manager, 120 K, 25 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Germany BE, MS, 28, 6' 0", Data Architect, 84 K Ponds, 15 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 31, 5' 10", 10 Crores, USA, H1, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK, MBBS, MRCP, 5' 6", 42, Doctor, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

### వరుడు కావలెను

రెడ్డి BE, MS, 24, 5' 4", 100 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 25, 5' 4", Developer, 22 L P/A, 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 7", Amazon, SWE, 40 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (ISB), 26, 5' 4", 28 L P/A, 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 26, 5' 4", SWE, 50 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Govt MBA, 27, 5' 3", 18 L P/A, 18 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MS (UK), 26, 5' 5", Product Manager, 12 L P/A, 40 Cr, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 26, 5' 8" PG Doctor, 50 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

## వరుడు కావలెను



No Caste bar, 1,2 వ 1కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు, వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK త్వరగా చేసుకునే వారికోసం మాత్రమే Ph: W: 7794960803 [H-781322]

రెడ్డి/45yr/5'4"/ కుల పట్టింపులేదు/ ఫెయిర్/ Ph.D/ Govt. ఎంప్లాయ్/ 85K (pm)/ వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం Ok). సంప్ర: 8008474869 [H-797700]

రెడ్డి/36yr/ కుల పట్టింపులేదు/ లేట్ మ్యారేజ్/ ఫెయిర్/Govt. ఎంప్లాయ్/ 80K (pm)/ వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ, బిజినెస్ & 4 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం 1st & 2nd లేట్ మ్యారేజ్ Ok). సంప్ర: 9492081545 [H-797700]

కాపు/28yr/ కుల పట్టింపులేదు/ లేట్ మ్యారేజ్/ ఫెయిర్/Govt. ఎంప్లాయ్/ 50K (pm)/ వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ & 3 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం Ok). సంప్ర: 8374802603 [H-797700]

రెడ్డి/విడో/52y/ 5'3"/ ఒంగోలు లో సొంత ప్లాట్లు/ Hyd లో/ సొంత బిజినెస్, రెంట్స్/ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను. (అర్జెంట్), (ఇల్లరికం Ok), (నో బ్రోకర్స్). Ph: 7799083500, 7386660643 [H-797700]

2వ పెళ్లి/B.Tech/C.Govt.ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్/ 50,000/-PM / 5'4"ఎత్తు/30 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963757612 [HA-14668]

SC మాల/ఏకైక కుమార్తె/ B.Tech /C.Govt. ఆఫీసర్/పంజాబ్ నేషనల్ బ్యాంక్/80,000/-PM/5'4" ఎత్తు/27 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8897389698 [HA-14668]

రజక/B.Tech/C.Govt.బ్యాంక్ క్యాషియర్/ఆంధ్రాబ్యాంక్/28000/-PM/5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9581317506 [HA-14668]

మాదిగ/B.Tech/Govt.AE/ఇరిగేషన్ Dept/70,000/-PM/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9642459724 [HA-14668]

రెడ్డి/విడో/56y/5'5"/V.Fair/Govt. ప్రొఫెసర్/ సొంత ఇల్లు & రెంట్స్/ 25 ఎకరాల మాగాణి గల వెల్‌సెటిల్డ్ ఏ బాదరాబందీలేని వధువుకు వరుడు కావలెను. Ph: 9492718486 [H-788901]

పద్మశాలి/60/ విడో/ 5'4"/ ఫ్యామిలీ పెన్షనర్/ 2 సొంత ఇళ్లు/ 1L pm / రెంట్స్/ పిల్లలులేని వధువుకి వరుడు కావలెను. కుల పట్టింపులేదు. Ph: 9866244690 [H-788901]

FC/విడో/58y/ తక్కువ చదువు/ సొంత బిజినెస్/ 3 ఇళ్లు గల ఒంటరి వధువుకు మంచి వ్యక్తిత్వం గల వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 9550629225 [H-788901]

రెడ్డి: 2nd మ్యారేజ్/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/ వయస్సు: 30, చదువు: డిగ్రీ/ సొంత వ్యాపారం కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం Ok) Ph: 9848971107. [H-14666]

రెడ్డి: 60yrs/ 5'4"/ V.fair, విడో, ఫ్యామిలీ పెన్షన్, సొంత ఇల్లు, రెంట్లు, 10ఎ. పొలం గల వధువుకు కుల ఆస్తి పట్టింపు లేని వరుడు కావలెను. (ఇల్లరికం Ok). Ph 7660088694 [H-14666]

SC: మొదటి, రెండవ పెళ్లి అయిన Ok/అందమైన/ 35/5'5"/ B.Com/ Pvt. జాబ్/వెల్ సెటిల్డ్ & గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [H-14666]

కాపు: చాలా అందమైన/26/5'6"/ B.Tech/ SWE/ కోట్ల ఆస్తి & గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [H-14666]

కాపు/30yrs/5'3"/కలర్:fair/MA, B.Ed/Govt. జాబ్/75K Per Month/సొంత వ్యాపారం/2 Own Houses/ వెల్ సెటిల్, ఇల్లరికం అయినా OK. CNB వరుడు కావలెను. Ph: 85004 27582 [HA-210]

బ్రాహ్మణ: 26/5'4"/B.Tech/ *28/5'3"/ B.Sc *30/5'4"/MBA/27/5'3"/ ఇంటర్ వధువులకు వరులు కావలెను కట్నాలు ఆశించని/ మధ్యతరగతి/ పురోహితులకు ప్రత్యేకం. Ph: 7207634758 [H-14670]

హిందు మాదిగ: 27yrs/ B.Com/5'2"/ ఫెయిర్ * మాదిగ/ డైవర్స్/32/డిగ్రీ/ నో కిడ్స్ వధువులకు జాబ్/బిజినెస్ వరులు కావలెను. Ph 8523840236 [H-14670]

క్రిస్టియన్ మాల: 24/5'4"/ M.Sc/ Govt. AEO/ అగ్రికల్చర్ Dept/ 45,000/- pm/ అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309258463 [H-14670]

SC: 26/5'4"/ B.Tech/ SWE/ 60K. pm/ వెల్‌సెటిల్డ్ ఫ్యామిలి గల వధువుకు తగిన SWE/Govt/ డాక్టర్ వరుడు కావలెను. Ph: 8125548806, 7386715262 [H-14670]

SC మాల & క్రిస్టియన్: M.Tech(EEE)/ C.Govt. డిప్యూటి మేనేజర్/ SBI/ 65,000/-pm/5'4"ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [H-14670]

SC మాదిగ & క్రిస్టియన్: B.Tech, MBA/ C.Govt. డిప్యూటి మేనేజర్/ SBI/ 65,000/-pm/5'4"ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [H-14670]

రెడ్డి: విడో 40 సం॥ డిగ్రీ సొంత ఇల్లు 30 ఎకరాల పొలం పెద్ద స్థిరాస్తి కలిగి పిల్లలులేని ఒంటరి వధువుకు అర్జెంట్‌గా వరుడు కావలెను. (ఆస్తి కుల పట్టింపు లేదు) Send photos Only Whatsapp 7207516654 [H-778991]

Sunni Muslim/30/5'6"/Parents Invite Correspondence for their Beautiful Daughter, Looking for a Well Settled Groom Working in Hyd. 9949344520 [H-792895]

Reddy Br. 26/5'6"/B.Tech (Bits) MS-USA/200Cr. *24/5'5"/B.Tech- MS-USA. 20Cr. *25/5'6"/B.Tech, SWE, 20Cr. Cont: P.P.Reddy-9391198332 [H-797646]

Reddy/30/5'5"/MD (Pediatrics) 15Cr. *24/5'5"/MD (Radiology) 2nd yr. *25/5'5"/MD (Gynic). Cont : P.P.Reddy-9391198332 [H-797646]

## వేదికలు



రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజినీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155/ 9391265304. [H-781434]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8688006130 / 6302543297 [H-788901]

వడ్డెర వధువు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [H-14666]

ఒంటరితనంతో విసిగిపోయిన విడో, డైవర్సి, స్త్రీ/పురుషుల కొత్త జీవితం కొరకు సంప్రదించండి. వయస్సు, కుల పట్టింపు లేదు. ఫోన్: 9848023736 [H-14666]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690309 [H-781497]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt/సాఫ్ట్‌వేర్/గెజిటెడ్/ MBBS/PG/NRI /PVT/ బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS 15సం॥ Exp. Ph: 8712384555 [HA-29502]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-793686]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14675]

Kamma-Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14675]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14675]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Srinivas. Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14675]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas. Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14675]

పెళ్లి-పెళ్లి-పెళ్లి, ఎక్కడ ! ఎప్పుడు!! ఎలా!!! సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్,రిచ్ వారికి ప్రత్యేక శ్రద్ధతో ఫాస్ట్ సెటిల్‌మెంట్.20years, పూర్ణ మాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-1455]

15 రో॥ అన్ని కులముల వారి తగిన సంబంధములు చూపించగల అతి పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com ✆ 94418 29644, 98490 58673, 94920 33897, 94407 85888 W [B-605]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్నికులాల SWE Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-147]

పద్మశాలి వధూవరుల స్వయంవరం (Online) 9th July Free Registration. bhavanimatrimony.com. Hyderabad. Ph: 9704656103, 9533608887 [HA-195]



## పేద ఇంటర్ విద్యార్థులకు విద్యాదాన్ స్కాలర్‌షిప్‌లు

సాక్షి, హైదరాబాద్: ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లోని విద్యార్థుల ఉన్నతికి సరోజినీ దామోదరన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించే విద్యాదాన్ ఇంటర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందనే ఆశయంతో శిబులాల్, ఎస్.డి.శిబులాల్ (ఇన్ఫోసిస్ కో-ఫౌండర్) ఈ సంస్థను ప్రారంభించి తెలంగాణలోని పేద విద్యార్థులకు విద్యాదాన్ ఉపకార వేతనాలను అందిస్తున్నారు. వార్షికాదాయం రూ.2 లక్షల్లోపున్న కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. టెన్త్‌లో 90 శాతం లేదా 9 సీజీపీఏ సాధించిన వారు అర్హులు. దివ్యాంగులైతే 7.5 సీజీపీఏ ఉంటే సరిపోతుంది. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్‌మీడియేట్ కోసం రూ.10 వేలు.. అనంతరం వారి ప్రతిభను బట్టి ఉన్నత చదువులకు రూ.60 వేల వరకు స్కాలర్‌షిప్ అందిస్తామని సంస్థ ప్రతినిధులు వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు జూలై 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమాచారం కోసం www. vidyadhan. org లేదా vidyadhan. telangana@ sdfoundationindia.com, 96635 17131తో సంప్రదించాలని సూచించారు.

## 19న రాష్ట్రవ్యాప్తంగా హరితహారం ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న రాష్ట్ర వ్యాప్తంగా హరితోత్సవం ప్రారంభించనున్నట్టు పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్ వెల్లడించారు. అటవీ శాఖ తరఫున హరితోత్సవంలో ఈ ఏడాది హరిత హారం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలియజేశారు. ఆయన శని వారం అరణ్యభవన్ నుంచి అన్ని జిల్లాల అటవీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 19న రాష్ట్రంలోని అన్ని నేషనల్ పార్కులు, అర్బన్ ఫారెస్ట్ పార్కులు, జూ పార్కుల్లో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు తెలిపారు. 19న రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం కోసం పెద్ద మొక్కలు, ప్లాంట్ మెటీరియల్ సిద్ధం చేయాలని, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలని కోరారు. సీఎంఓ ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ మాట్లాడుతూ ప్రజల్లో పర్యావరణ స్పృహ పెరిగేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.

## టెక్స్‌టైల్ పార్క్‌కు సహకరించడం లేదు

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంవోయూను పట్టించుకోవడం లేదు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శ
- వ్యవసాయానికి మోదీ ప్రభుత్వం వెన్నుదన్ను... 9 ఏళ్ల మోదీ సర్కారు పాలనా విజయాలను వివరించిన కేంద్ర మంత్రి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు ఎంవోయూకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకు రావడం లేదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. కేంద్రంలోని పెద్దలను తాను అనేక సార్లు అభ్యర్థించి రాష్ట్రానికి టెక్స్ టైల్ పార్కును తీసుకొస్తే ఇక్కడి సర్కారు నుంచి స్పందన లేక పోగా ఏ మాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. వ్యవసాయానికి మోదీ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని, పెద్ద ఎత్తున ఎరువుల సబ్సిడీ ఇస్తోందన్నారు. పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పనే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. తాజాగా పెంచిన పంటల మద్దతు ధర ఈ ఖరీఫ్ సీజన్‌నుంచే అమల్లోకి వస్తుందని, రైతులకు మేలు చేసేలా కేంద్రం గొప్ప నిర్ణయం తీసుకుందన్నారు.

**భారత్ బ్రాండ్ పేరుతో యూరియా**

నానో యూరియాతో పాటు భారత్‌బ్రాండ్ పేరుతో యూరియా ప్రవేశ పెడుతున్నట్టు, ఇందుకు 8 ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు కిషన్‌రెడ్డి తెలిపారు. 2014లో దేశ వ్యవసాయ బడ్జెట్ రూ.21,933 కోట్లు ఉంటే, తొమ్మిదేళ్లలో రూ.లక్షా 25 వేల 33 కోట్లకు పెరిగిందని వివరించారు. కిసాన్‌క్రెడిట్‌కార్డుల ద్వారా రూ.28,590 కోట్ల వ్యవసాయ రుణాల మంజూరు, 23 కోట్ల సాయిల్‌హెల్త్ కార్డులను రైతులకు అందజేసినట్టు తెలియజేశారు. ఒకప్పుడు రూ.లక్ష కోట్ల విలువైన నూనెల దిగుమతి ఉండేదని, ఇప్పుడు రైతుల నుంచి నూనెగింజల సేకరణ 1,500 శాతం పెరిగిందని తెలిపారు. గుడ్ల ఉత్పత్తిలో మూడో స్థానం, మాంసం ఉత్పత్తిలో 8వ స్థానం, పప్పుదినుసుల సేకరణలో కూడా కేంద్రం 7300 శాతం వృద్ధి సాధించిందన్నారు. ఎరువుల రాయితీ గత ఏడాదికి ఈ ఏడాదికి పోలిస్తే 500 శాతం పెరిగిందని చెప్పారు.

**రూ.20 లక్షల కోట్లు రుణ వితరణ లక్ష్యంగా..**

ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.20 లక్షల కోట్లు రుణ వితరణ లక్ష్యంగా కార్యాచరణను కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోందని కిషన్‌రెడ్డి వివరించారు. ప్రస్తుతమున్న ఈ-నామ్‌మార్కెట్లు 1260 బాగా నడుస్తున్నాయని తెలిపారు.

- 9 ఏళ్ల పాలనలో తెలంగాణకు చేకూరిన ప్రయోజనాలను గురించి కిషన్‌రెడ్డి వివరించారు. అవేంటంటే... ➡ తెలంగాణలో 39 లక్షల మంది రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్‌యోజన ద్వారా ఏటా రూ.6 వేలు అందజేత
- రూ.6,300 కోట్లతో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ ప్రారంభం. ➡ సించాయ్‌యోజన కింద చిన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి. ➡ దీని కింద తెలంగాణలో 11 ప్రాజెక్టులను గుర్తించి, వాటిని పూర్తి చేసుకోవడం కోసం ఇప్పటి వరకు రూ.1,248 కోట్లు కేటాయింపు. ➡ రూ.23,948 కోట్లతో ఎల్‌సీడీసీ ద్వారా గొర్రెల పెంపకం, ఇతర వ్యవసాయ కార్యక్రమాలకు రుణాల మంజూరు. ➡ ఆయిల్ పామ్ మిషన్ కింద రూ.214 కోట్లు. ➡ ఒక్క ఎరువుల మీద రూ.27 వేల కోట్ల రూపాయల సబ్సిడీ. ➡ రైతులకు మేలు చేసే 'వేపపూత' యూరియాను అందుబాటులోకి తీసుకొచ్చారు
- తెలంగాణలో ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యం సేకరణకు కేంద్రం ఒకప్పుడు రూ.3,307 కోట్లు ఖర్చు చేస్తే ఇప్పుడు రూ.26,307 కోట్లు వెచ్చిస్తోంది.

## రుణాలివ్వడమూ సాయమేనా?

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై రాష్ట్ర మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ రంగానికి రూ. 20 లక్షల కోట్లు, గొర్రెల కోసం రూ. 23 వేల కోట్ల రుణాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గొప్పగా చెప్పుకోవడం శోచనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. రుణాలివ్వడమూ సాయమేనా అని శనివారం ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఎరువుల సబ్సిడీ అనాదిగా వస్తున్నదేనని, బీజేపీ పాలనలో కొత్తగా వచ్చింది కాదని పేర్కొన్నారు. బీజేపీ పాలనలో ఎరువుల సబ్సిడీ తగ్గి, వినియోగం పెరిగిందని విమర్శించారు. రూ.6,300 కోట్లతో ప్రారంభించిన రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుంచి అరబస్తా యూరియానైనా రైతుల కోసం ఉత్పత్తి చేశారా? దానిని మార్కెట్‌లోకి పంపించారా? అని ప్రశ్నించారు. కేంద్రమంత్రి వాస్తవాలను దాచిపెట్టి రైతులను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. రైతుబంధు కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.65 వేల కోట్లు ఇస్తే, రైతుబంధును అనుకరిస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చింది కేవలం రూ.9,500 వేల కోట్లు మాత్రమేనని వివరించారు. ఫసల్ భీమా యోజన.. బీమా కంపెనీల ప్రయోజనాల కోసమేనని, ఈ పథకం ప్రీమియం ఎక్కువ.. పరిహారం తక్కువ అని వ్యాఖ్యానించారు. పెంచిన మద్దతుధరల గురించి మాట్లాడుతున్న కేంద్ర మంత్రి, పెరిగిన సాగు ఖర్చుల గురించి మాట్లాడాలని, డీజిల్, పెట్రోల్ ధరల పెంపుతో రైతాంగం నడ్డి విరిగిందని మండిపడ్డారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు అన్న కేంద్రప్రభుత్వం.. రైతుల సాగు ఖర్చులను రెట్టింపు చేసిందని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల గురించి కిషన్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమని పేర్కొన్నారు. కర్ణాటకలో అప్పర్ భద్ర ప్రాజెక్ట్‌కు జాతీయహోదా ఇచ్చి నిధులు కేటాయిస్తే, తెలంగాణలో ఒక్క బీజేపీ నాయకుడు కూడా మాకూ నిధులు కావాలని అడిగిన పాపాన పోలేదన్నారు.

## కరీంనగర్ కేబుల్ బ్రిడ్జి ముహూర్తం ఖరారు

- 21న ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్
- ప్రత్యేక ఆకర్షణగా సెంట్రల్ లైటింగ్
- ఫ్రీ వైఫై కూడా ఉంటుంది: గంగుల



కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లోని కేబుల్ బ్రిడ్జిని ఈనెల 21న రాష్ట్ర పురపాలక, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభిస్తారని పౌర సరఫరాలు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. అదేరోజు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, ట్రాఫిక్ సిగ్నల్స్, ఫ్రీ వైఫై, సెంట్రల్ లైటింగ్ కూడా ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం 7 గంటలకు లైటింగ్ సిస్టం క్రాకర్‌షో, లేజర్‌షో, బహిరంగ సభ ఉంటుందన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేబుల్ బ్రిడ్జి హైదరాబాద్‌లోని దుర్గం చెరువు కన్నా అడ్వాన్స్‌డ్‌గా ఉంటుందన్నారు. ఇందులో 10/30 అడుగుల స్కీన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. ఊహకు అందనివిధంగా మానేరు రివర్ ఫ్రంట్ (ఎంఆర్‌ఎఫ్) పనులు కొనసాగుతున్నాయని, ఆగస్టు 15న మొదటి దశ ఎంఆర్‌ఎఫ్ ప్రారంభమవుతుందని తెలిపారు. అదేరోజు ప్రపంచంలోనే మూడోదైన కరీంనగర్‌లోని వాటర్ ఫౌంటెయిన్ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

**ధాన్యం సేకరణలో చరిత్ర సృష్టించాం...**

రాష్ట్రంలో ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి చరిత్ర సృష్టించామని మంత్రి చెప్పారు. గత ఏడాది జూన్ 10 నాటికి కేవలం 14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించినట్లు వివరించారు. రూ.12,450 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని కొనుగోలుచేశామని, ధాన్యం డబ్బులు ఈనెల 15లోగా ఖాతాల్లో జమచేస్తామని హామీ ఇచ్చారు. రెండో పంటను కొనుగోలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. సమావేశంలో కరీంనగర్ నగర మేయర్ సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 'బ్యాడ్ గవర్నెన్స్'కు సింబల్‌గా తెలంగాణ

బీజేపీనేత మురళీధర్‌రావు



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే 'బ్యాడ్ గవర్నెన్స్'కు సింబల్‌గా తెలంగాణ నిలుస్తోందని, కేసీఆర్ పాలనలో జవాబుదారీతనం లేకుండా పోయిందని బీజేపీ నేత, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి పి.మురళీధర్ రావు విమర్శించారు. దళితబంధులో ఎమ్మెల్యేలు 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నట్టు తన వద్ద సమాచారం ఉందన్న సీఎం కేసీఆర్ వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సుపరిపాలన దినోత్సవం జరపడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

## 34 ఏళ్ల సర్వీసులో ఇంత ప్రగతి చూడలేదు

దేశంలో మరే రాష్ట్రం ఇంత అభివృద్ధి సాధించలేదు

- 9 ఏళ్లలో అద్భుతాలు సృష్టించాం
- సీఎం కేసీఆర్ ప్రణాళికలే దీనికి కారణం..
- సుపరిపాలన దినోత్సవంలో సీఎస్ శాంతికుమారి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎస్ శాంతికుమారి. చిత్రంలో అంజనీకుమార్, నవీన్ మిత్తల్

సాక్షి, హైదరాబాద్: గత 9 ఏళ్లలో ఎన్నో అద్భుతాలు సృష్టించామని, దేశంలో మరే రాష్ట్రం సాధించని అభివృద్ధిని తెలంగాణ సాధించిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. దీనికి ప్రధాన కారణం సీఎం కేసీఆర్ ప్రణాళికలేనని చెప్పారు. తన 34 ఏళ్ల సర్వీసులో రాష్ట్రంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి గతంలో చూడలేదని ఆమె వ్యాఖ్యానించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో నిర్వహించిన తెలంగాణ సుపరిపాలన దినోత్సవంలో సీఎస్ మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో 2014కి ముందు వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి ఉండేదని, వాటర్ ట్యాంకర్ల కోసం పెద్ద ఎత్తున పైరవీలు చేయాల్సి వచ్చేదన్నారు. అప్పట్లో వేసవి కాలం వచ్చిందంటే జిల్లా కలెక్టర్లతో సహా రాష్ట్ర ప్రభుత్వం సమ్మర్ యాక్షన్ ప్లాన్లు రూపొందించుకోవాల్సి వచ్చేదని, ఇప్పుడా పరిస్థితులు లేవన్నారు.

**అన్ని రంగాల్లో రాష్ట్రం రికార్డు**

నీటి పారుదల, వ్యవసాయం, ఐటీ, పరిశ్ర మలు, విద్యా, ఆరోగ్యం, సంక్షేమం, సుపరి పాలన, శాంతి భద్రతల పరిరక్షణ వంటి అన్ని రంగాల్లో రాష్ట్రం రికార్డు స్థాయిలో పురోగతి సాధించిందన్నారు. హరితహారంలో నాటిన 90 శాతం మొక్కలు మనుగడ సాధించడం ఒక అద్భుతమని శాంతికుమారి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రసూతి మరణాల్లో గణనీయమైన తగ్గుదల సాధించామని, ఇమ్యూనైజేషన్ పెరిగిందని, వైద్యారోగ్య రంగంలో అద్భుతాలు చవిచూశామని ఆమె వివరించారు. కార్య క్రమంలో ప్రభుత్వ శాఖల కార్యదర్శులు తమ శాఖల విజయాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. డీజీపీ అంజనీకుమార్, పీసీసీ ఎఫ్ డోబ్రియాల్ తదితరులు పాల్గొన్నారు.

కంచర్ల యాదగిరిరెడ్డి



అమెరికా సంయుక్త రాష్ట్రాలు..!
కొందరికి అగ్రరాజ్యం.. దేశాలకు పెద్దన్న..
మరికొన్నింటికి కుట్రదారు, శత్రువు..
కానీ ప్రపంచం మొత్తం అంగీకరించే ఓ అంశంలో
పైచేయి ఆ దేశానిదే.. అదే అత్యుత్తమ ఉన్నత విద్య.
రెండు వందలకుపైగా దేశాలున్న ఈ భూమ్మీద
ఒక్క అమెరికానే ఎక్కువమంది విదేశీ
విద్యార్థులను ఎందుకు ఆకర్షిస్తోందో తెలుసా?

రెండు లక్షల మంది.. గత ఏడాది ఒక్క భారతదేశం నుంచే ఉన్నత చదువుల కోసం అమెరికాకు చేరిన విద్యార్థుల సంఖ్య ఇది. గత ఏడాది మొత్తంగా 200 దేశాలకు చెందిన 9.48 లక్షల మందికిపైగా విద్యార్థులు అమెరికాలోని నాలుగు వేలకుపైగా ఉన్న యూనివర్సిటీల్లో చేరడం గమనార్హం. దీనికి ఎన్నో కారణాలు. అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు, విస్తృత అవకాశాలు, వైవిధ్యత, చదువుకోవడంలో రకరకాల వెసులుబాట్లు, అంతర్జాతీయ గుర్తింపు, స్కాలర్‌షిప్‌లు.. ఇలా మరెన్నో సానుకూల అంశాలు విద్యార్థులను అమెరికా వైపు ఆకర్షిస్తున్నాయి.

# చదువులకూ పెద్దన్నే..

అమెరికా మొత్తమ్మీద ఉన్నత విద్యనందించే సంస్థలు నాలుగు వేలకుపైనే ఉన్నాయి. అత్యాధునిక కృత్రిమ మేధ/మెషీన్ లెర్నింగ్ మొదలుకుని జెనెటిక్ ఇంజనీరింగ్ వరకు.. ఆర్ట్స్, హ్యూమానిటీస్, పొలిటికల్ ఎకానమీ.. ఇలా ఎన్నో రంగాలకు సంబంధించి విస్తృతస్థాయి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్ విద్యా సంస్థలు ఉన్నా.. ప్రభుత్వ సంస్థల్లో చేరే విద్యార్థులే ఎక్కువని అక్కడి విద్యాశాఖ గణాంకాలు చెప్తున్నాయి. కాలేజీలు, యూనివర్సిటీల్లో అత్యధికం గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్ అందిస్తున్నాయి.

### ప్రభుత్వ విద్యా సంస్థలు టాప్!

కమ్యూనిటీ కాలేజీల్లో రెండేళ్ల కోర్సులుంటాయి. ఇవి సిద్ధాంతాలకు కాకుండా వాస్తవిక జ్ఞానానికి, ఉద్యోగాలకు పనికొచ్చే విషయాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తాయి. విదేశీ విద్యార్థుల్లో చాలామంది ఈ కమ్యూనిటీ కాలేజీలు అందించే రకరకాల సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులు చేసి.. తర్వాత ఉన్నత విద్య కోసం ఇతర యూనివర్సిటీల్లో చేరుతుంటారు. హార్వర్డ్, యేల్, బ్రౌన్, ప్రిన్స్‌టన్ వంటి ప్రైవేట్ యూనివర్సిటీలు విద్యార్థుల ఫీజులతోపాటు దాతలు ఇచ్చే విరాళాలతో నడుస్తుంటాయి.

## అత్యుత్తమ విద్య అవకాశాలకు అడ్డా అమెరికా

- ఉత్తమ బోధనకు పేరుగాంచిన యూనివర్సిటీలు, కాలేజీలు
- విస్తృత అవకాశాలు, విభిన్న కోర్సులు, స్కాలర్‌షిప్‌లు కూడా..
- అక్కడి సర్టిఫికెట్లకు అంతర్జాతీయ గుర్తింపు
- పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తే పరిమిత ఖర్చుతోనే చదువుకునే చాన్స్

### ఎన్నో రకాల వెసులుబాట్లతో..

భారత్‌లో ఇంటర్మీడియట్‌లో చదివే కోర్సులే మీరు భవిష్యత్తులో ఏం కావాలని అనుకుంటున్నారో నిర్ణయిస్తాయి. ఎంపీసీ అయితే ఇంజనీరింగ్.. బైపీసీ అయితే వైద్యం. కానీ అమెరికాలో విభిన్న చదువులకు అవకాశం ఉంటుంది. చాలా యూనివర్సిటీల్లోని నాలుగేళ్ల గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్‌లోనూ రెండేళ్లపాటు హ్యూమానిటీస్, నేచురల్ సైన్సెస్, సోషల్ సైన్స్, గణితం వంటి సబ్జెక్టుల్లో కోర్సు చేయాల్సి ఉంటుంది. ఈ నాలుగేళ్ల కోర్సు సమయంలో ఎప్పుడైనా మీరు ఎంచుకున్న మేజర్ (ప్రధాన సబ్జెక్ట్)ను మార్చుకోవచ్చు. ఇంజనీరింగ్ చేస్తూ కంప్యూటర్ సైన్స్ నుంచి కృత్రిమ మేధకు మారిపోవచ్చు. యూనివర్సిటీలో చేరేటప్పుడు ఫలానా సబ్జెక్టు అని ఎంచుకోవాల్సిన అవసరమూ లేదు. యూనివర్సిటీ అందించే వేర్వేరు కోర్సులను దగ్గరి నుంచి పరిశీలించి.. నచ్చిన అంశాన్ని మేజర్‌గా ఎంచుకోవచ్చు. కచ్చితంగా క్లాస్‌రూమ్‌లకు రావాలన్న నియమం లేదు. ఆన్‌లైన్ కోర్సులు చేయవచ్చు. ఒకేసారి రెండు డిగ్రీలు చదవవచ్చు. ఒక యూనివర్సిటీ నుంచి ఇంకోదానిలోకి మారి కోర్సులు కొనసాగించేందుకూ అభ్యంతరాలు ఉండవు.

### గుర్తింపు, ఉద్యోగావకాశాలు

అమెరికా యూనివర్సిటీల నుంచి పట్టభద్రులైన వారికి ప్రపంచ దేశాలన్నింటిలోనూ తగిన గుర్తింపు ఉంటుంది. చదువుకునే సమయంలోనే వివిధ దేశాల వారితో కలిసిమెలిసి ఉండే అవకాశం లభిస్తుంది. పేరు ప్రతిష్టలున్న అధ్యాపకులు, నిపుణుల నుంచి నేర్చుకుని ఉంటారు. ప్రపంచవ్యాప్తంగా ఉండే యూనివర్సిటీల పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్, ఫార్చ్యూన్–500 కంపెనీల్లో అత్యధికం అగ్రరాజ్యంలోనే ఉండటం వంటి కారణాలతోనూ అమెరికాలో చదివిన వారికి మెరుగైన ఉద్యోగావకాశాలు కలిగిస్తాయి.

**అమెరికాలో చదువు పూర్తయిన తర్వాత మూడేళ్లపాటు ఆ దేశంలోనే పనిచేసుకునేందుకు అవకాశం ఉంటుంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమెటిక్స్ విద్యార్థులకు ఇది ఎంతో విలువైన వృత్తిపరమైన నైపుణ్యాన్ని అందిస్తుంది. దీన్ని ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెయినింగ్ (ఓపీటీ) అంటారు.**

**యూనివర్సిటీలు స్వయంగా కెరీర్ సర్వీసులను కూడా అందిస్తాయి. విదేశీ విద్యార్థులకు, కంపెనీలకు మధ్య వారధిగా నిలుస్తాయి. రెజ్యూమ్‌లు ఎలా తయారు చేసుకోవాలన్న చిన్న అంశాల నుంచి కంపెనీలతో కెరీర్ ఫెయిర్‌లు, మెంటార్‌షిప్ ప్రోగ్రామ్స్ వరకు సాయం అందిస్తాయి.**

### గత పదేళ్లలో అమెరికాలో విదేశీ విద్యార్థుల సంఖ్య ఇలా..

| | |
|---|---|
| 2012-13 | 8,19,644 |
| 2013-14 | 8,86,052 |
| 2014-15 | 9,74,926 |
| 2015-16 | 10,43,839 |
| 2016-17 | 10,78,822 |
| 2017-18 | 10,94,792 |
| 2018-19 | 10,95,299 |
| 2019-20 | 10,95,496 |
| 2020-21 | 9,14,519 |
| 2021-22 | 9,48,519 |

### ఖర్చుల మాటేమిటి?

అమెరికా చదువులంటే ఖరీదైనవని చాలామంది అంటూ ఉంటారు. అందులో వాస్తవం కొంతే. జాగ్రత్తగా ప్రణాళిక ప్రకారం వ్యవహరిస్తే.. అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం కోసం బోలెడన్ని స్కాలర్‌షిప్‌లు, గ్రాంట్లు అందుబాటులో ఉన్నాయి. దీనికితోడు చదువుకునేటప్పుడే పనిచేసుకునేందుకు అవకాశం కల్పించడం, రుణాలు వంటి మార్గాల ద్వారా విద్యాభ్యాసానికయ్యే ఖర్చులను పొందవచ్చు.

- అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసానికి లభించే ఆర్థిక సాయం ప్రధానంగా రెండు రకాలు. ఒకటి మీ అవసరాలను తీర్చేది. రెండోది మీ ప్రతిభకు అనుగుణంగా దక్కేది. కొన్ని స్కాలర్‌షిప్స్ ట్యూషన్ ఫీజులతోపాటు అక్కడి రోజువారీ ఖర్చులకు కావాల్సిన మొత్తాలను కూడా అందిస్తాయి. కొన్ని స్కాలర్‌షిప్‌లు ట్యూషన్ ఫీజు మొత్తం లేదా అందులో కొంత భాగాన్ని చెల్లిస్తాయి.
- యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియాను ఉదాహరణగా తీసుకుంటే.. విదేశీ విద్యార్థుల కోసం మెరిట్ ఆధారిత స్కాలర్‌షిప్‌లు, క్యాంపస్‌లో ఉద్యోగం చేసుకునే వెసులుబాటు ఉంటుంది. మీ అవసరాలకు తగిన ఆర్థిక సాయం (నీడ్స్ బేస్డ్ ఫైనాన్షియల్ ఎయిడ్) ఈ యూనివర్సిటీలో లభించదు.
- కేవలం గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్‌కు మాత్రమే కాకుండా అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్‌కు కూడా కొన్ని కాలేజీలు, విద్యాసంస్థలు ఆర్థిక సాయం అందిస్తాయి. ఈ అంశంపై మీకు సాయం అవసరమనుకుంటే 'ఎడ్యుకేషన్ యూఎస్ఏ' విభాగాన్ని సంప్రదించవచ్చు.





శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మల్హోత్రా

శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంతోష్‌రెడ్డి

## మహిళను కాపాడిన ఆర్పీఎఫ్ మహిళ కానిస్టేబుల్

### వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఘటన





అదుపు తప్పి రైలుకింద పడబోతున్న మహిళను కాపాడుతున్న మహిళ కానిస్టేబుల్

కాశిబుగ్గ: నడుస్తున్న రైలు నుంచి దిగబోయి జారి రైలుకింద పడబోయిన ఓ మహిళను రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) మహిళ కానిస్టేబుల్ చాకచక్యంగా కాపాడింది. ఈ ఘటన వరంగల్ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఆర్పీఎఫ్ సీఐ టీఎస్ఆర్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..గుర్తు తెలియని మహిళ మణుగూరు నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న మణుగూరు ఎక్స్‌ప్రెస్(12746)లో వరంగల్‌కు వచ్చింది. శుక్రవారం రాత్రి 2.46 గంటల సమయంలో రైలు వరంగల్ స్టేషన్‌కు చేరుకుంటుండగా రెండవ ప్లాట్‌ఫాంలో ఆగకముందే మహిళ దిగడానికి ప్రయత్నించి..అదుపు తప్పి రైలు కింద పడిపోతుండగా ఆర్పీఎఫ్ మహిళ కానిస్టేబుల్ సోనాలి ఎంజమోలేక్ క్వాన్ చాకచక్యంగా బయటికి లాగి ప్రాణాలు కాపాడింది. అక్కడే ఉన్న ప్రయాణికులు, ఆర్పీఎఫ్ అధికారులు మహిళ కానిస్టేబుల్‌ను అభినందించారు.



## క్లుప్తంగా...

### యాదాద్రిలో అక్షరాభ్యాసాలు



చిన్నారితో అక్షరాలను దిద్దిస్తున్న కలెక్టర్

యాదగిరిగుట్ట: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో శనివారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కొండకు దిగువనున్న శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఉదయం 10 గంటలకు కలెక్టర్ పమేలా సత్పతి, ఈవో గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.

### సికింద్రాబాద్–నాగర్‌సోల్ మధ్య ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్–నాగర్‌సోల్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్–నాగర్‌సోల్ (07517/07518) స్పెషల్ ట్రైన్ ఈ నెల 14, 21, 28 తేదీల్లో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి మర్నాడు ఉదయం 8 గంటలకు నాగర్‌సోల్ చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో 15, 22, 29 తేదీల్లో రాత్రి 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజున ఉదయం 10.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందని వెల్లడించారు.

### 10.27 కిలోల బంగారం పట్టివేత

సాక్షి, హైదరాబాద్: నెల్లూరు, హైదరాబాద్‌లలో అక్రమంగా తరలిస్తున్న 10.27 కిలోల బంగారాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 7న రాత్రి నెల్లూరులోని వెంకటాచలం టోల్‌ప్లాజా సమీపంలో డీఆర్ఐ అధికారులు ఓ కారును ఆపి తనిఖీ చేయగా వెనుక సీట్లలో దాచిన 7.798 కిలోల బంగారం బయటపడింది. దీంతో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. వారిచ్చిన సమాచారం ఆధారంగా ఆ బంగారాన్ని తీసుకొనేందుకు హైదరాబాద్‌లో ఎదురుచూస్తున్న మరో వ్యక్తిని అదుపులోకి తీసుకోగా అతని వద్ద మరో 2.471 కిలోల ఫారిన్‌మార్క్ బంగారం పట్టుబడింది.

## 'యాదాద్రి'లో వర్షం.. భక్తుల ఇబ్బందులు



యాదాద్రి కొండపై వర్షంలో తడుస్తున్న భక్తులు



వర్షపు నీటిలో ఆలయ ప్రతిబింబం

యాదగిరిగుట్ట: యాదాద్రి కొండపై శనివారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో సుమారు గంట పాటు వర్షం కురిసింది. దీంతో యాదగిరిగుట్ట పట్టణంలో, కొండపైన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతో శనివారం భక్తులు అధిక సంఖ్యలో శ్రీస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. అదే సమయంలో భారీగా ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో భక్తులు తలదాచుకునేందుకు సరైన చోటు లేకపోవడంతో అష్టభుజి ప్రాకార మండపంలో కిక్కిరిసిపోయారు.

## ఎయిర్‌పోర్టులో యువతి ఆత్మహత్యాయత్నం

### స్నేహితుడితో గొడవ.. ఆపై రెయిలింగ్ నుంచి దూకే యత్నం



రెయిలింగ్ నుంచి దూకేందుకు ప్రయత్నిస్తున్న శ్వేత

శంషాబాద్: స్నేహితుడితో గొడవ పడిన ఓ యువతి అతడిని బెదిరించాలనుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఎయిర్‌పోర్టులో కలకలం రేపింది. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో శ్వేత (21) అనే యువతి తన బాయ్‌ఫ్రెండ్ విష్ణువర్ధన్‌తో కలసి బెంగళూరు వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చింది. ఈ సందర్భంగా డిపార్చర్ కేంద్రంలో కూర్చున్న వీరు ఒకరితో ఒకరు గొడవపడ్డారు. గొడవ అనంతరం స్నేహితుడిని బెదిరించాలనుకున్న శ్వేత, అంతర్జాతీయ డిపార్చర్ విభాగం ముందు రెయిలింగ్ నుంచి కిందకు దూకేందుకు ప్రయత్నించింది. అక్కడే ఉన్న పోర్టర్ గమనించి పక్కనున్నవారి సాయంతో ఆమెను పైకి లాగాడు. వెంటనే ఎయిర్‌పోర్టు సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. ఒకరోజు ముందు బెంగళూరు నుంచి వచ్చిన వీరు హైదరాబాద్‌లో కంపెనీ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అదే విషయంలో ఇద్దరూ గొడవకు దిగారని తెలుస్తోంది. ఎయిర్‌పోర్టు అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు యువతిపై ఆత్మహత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 30 నుంచి జూలై 2 వరకు నాటా తెలుగు మహాసభలు



డీవీ కోటిరెడ్డి

సాక్షి,హైదరాబాద్: నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాటా) తెలుగు మహాసభలు ఈనెల 30 నుంచి జూలై 2 వరకు అమెరికాలోని డల్లాస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్నాయి. ఈ సభలకు పలువురు తెలుగు ప్రముఖులను ఆహ్వానిస్తున్నామని నాటా శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. నాటా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీధర్‌రెడ్డి, గండ్ర నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ప్రపంచ నలుమూలల నుంచి ఎంతో మంది హాజరవుతున్నారని వెల్లడించింది. తమ వ్యాపారం, ఉత్పత్తులను ప్రపంచ నలుమూలలకు తెలపడానికి ఇదో సువర్ణ అవకాశమని, ప్రపంచ స్థాయిలో మార్కెటింగ్ చేసుకోవడానికి ఇదో గొప్ప వేదికని పేర్కొంది. ఇందు కోసం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ పోర్టల్‌ను నాటా లాంచ్ చేసింది. ఈ ఎగ్జిబిషన్‌లో స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలనుకునేవారు నాటా పీఆర్ అండ్ మీడియా డీవీ కోటిరెడ్డి (9848011818)కి ఫోన్ చేయాలని,మరిన్ని వివరాలకు www. nataconventions.orgలో నమోదు చేసుకోవాలని సూచించింది. వేడుక ముగిసిన తర్వాత కూడా రెండు, మూడు నెలల పాటు పోర్టల్ ద్వారా కస్టమర్లకు అందుబాటులో ఉండొచ్చని నాటా వెల్లడించింది.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. 